జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శనివారం 18 ఏప్రిల్ 2026 | సంపుటి: 19 | సంచిక: 41 | పేజీలు: 12 | వెల: రూ.5 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , వైశాఖ మాసము , తిథి: షష్ఠి - 19:05:09 వరకు నక్షత్రంమూల - నిండా రాత్రి వరకు కరణంవణిజ - 19:05:09 వరకు పక్షంకృష్ణ యోగంవారీయన - 17:09:13 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


## రాజ్యసభ డిప్యూటి ఛైర్మన్‌గా మరోమారు హరివంశ్

న్యూఢిల్లీ,ఏప్రిల్17(ప్రజాజ్యోతి): రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ ఎన్నికయ్యారు. ప్రతిపక్ష అభ్యర్థులు ఎవరూ నామినేషన్ దాఖలు చేయక పోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఆయన ఉపసభాపతి బాధ్యతలు చేపట్టడం ఇది

మిగతా1 2లో..

## విమానాశ్రయ పరిధిలో నాయిస్ జోన్ ఎత్తివేత

**నిబంధనలు సడలించిన తెలంగాణ ప్రభుత్వం**

**రియల్ వ్యాపారులకు వరం కానున్న జివో 168**

హైదరాబాద్,ఏప్రిల్17(ప్రజాజ్యోతి): హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వంటి విమానాశ్రయాల

మిగతా 2లో..



## మహిళా సాధికారత కోసమే మా ప్రయత్నం

- ఉత్తర దక్షిణ పేరుతో విభజన సరికాదు
- ఈ దేశంలో అన్ని ప్రాంతాల వారికి సమాన హక్కులు
- మహిళా బిల్లును వ్యతిరేకిస్తామని చెప్పడం సరికాదు
- మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కుదరవు
- డీలిమిటేషన్‌తో ఎస్సీ,ఎస్టీ సీట్లు పెరుగతాయి
- వారి సీట్ల పెంపును అడ్డుకోవడం సరికాదు
- లోక్‌సభలో చర్చకు సమాధానం ఇచ్చిన అమిత్ షా
- విపక్షాల తీరుపై మహిళా ఎంపిల ఆందోళన
- నిరసనగా పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన



న్యూఢిల్లీ,ఏప్రిల్17(ప్రజాజ్యోతి): లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై రెండ్రోజులగా సుదీర్ఘ చర్చ జరిగింది. శుక్రవారం విపక్ష నేత రాహుల్ గాంధీ, తదితరులు మాట్లాడారు. సవరణ బిల్లును ఓడిస్తామని ప్రకటించారు. అనంతరం సభలో సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇచ్చారు. మహిళా సాధికారత కోసమే ఈ బిల్లులను తీసుకొచ్చామని, వచ్చే ఎన్నికల్లో వీటిని అమలు చేసేలా ముందు కెళ్తున్నామన్నారు. అయితే, ఇండి కూటమి సభ్యులు దీన్ని వ్యతిరేకించారని అన్నారు. మూడు బిల్లులపై సమగ్రంగా చర్చ జరిగింది. 130 మంది

మిగతా 12లో..

# వీగిన మహిళా రిజర్వేషన్ బిల్లు

- **131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు దక్కని ఆమోదం**
- **అనుకూలంగా 278.. వ్యతిరేకంగా 211 ఓట్లు**
- **రాజ్యాంగ సవరణకు అవసరమైన మద్దతు కరవు**
- **ఐక్యతను చాటుకున్న విపక్ష ఇండి కూటమి**
- **బిల్లుపై ప్రధాని మోడీ పిలుపు నిష్ఫలం**

న్యూఢిల్లీ,ఏప్రిల్17(ప్రజాజ్యోతి): మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. లోక్‌సభలో సుదర్ఘ చర్చ అనంతరం బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో మొడొంతుల మెజార్టీని సాధించలేకపోయింది. ఈ బిల్లుతో ముడిపడిన మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగింది. 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై ఈ ఓటింగ్ జరిగింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఓటింగ్‌లో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. బిల్లుకు అనుకూలంగా 278, వ్యతిరేకంగా 211 ఓట్లు పడ్డాయి. మొత్తం ఓటింగ్‌లో 489 మంది పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ అమలు సవరణ బిల్లు అవసరమైన మెజారిటీ సాధించలేకపోయింది. దీనిపై శుక్రవారం లోక్‌సభలో జరిగిన ఓటింగ్ పక్రియలో మొత్తం

మిగతా 2లో..

## 2023లోనే ఆమోదించిన బిల్లును అమలు చేయండి

- లేదా కొత్తగా మహిళా బిల్లును తీసుకుని రండి
- ప్రస్తుత బిల్లు మహిళా సాధికరత కోసం పెట్టిందికాదు
- ఆ ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం
- బీసీ, దళితులు, మైనార్టీలు, మహిళల పట్ల క్రూర చర్య
- చర్చలో మోడీ ఓ మెజీషియన్ అంటూ రాహుల్ విమర్శలు
- రాహుల్ తీరుపై మండిపడ్డ స్పీకర్ బిర్లా, కేంద్రమంత్రులు



న్యూఢిల్లీ,ఏప్రిల్17(ప్రజాజ్యోతి): ఇప్పటికే 2023లోనే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిందని, దానినే అమలు చేయాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రస్తుతం ప్రతిపాదించిన బిల్లు మహిళల సాధికారత కోసం పెట్టింది కాదని విమర్శించారు.

మిగతా 2లో..



## వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ టాప్

- 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి
- 30లక్షలకు పైగా ధాన్యం సేకరణ చేపట్టండి
- కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వినతి
- రాష్ట్రానికి రావాల్సిన బకాయిల విడుదలకు వినతి

న్యూఢిల్లీ,ఏప్రిల్17(ప్రజాజ్యోతి): 2025-26 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పార్ బాయిల్డ్ ధ్యానం సేకరించాలని కేంద్రమంత్రికి సిఎం రేవంత్, మంతంరి ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. అలాగే యాసంగి పంట 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వివరించారు. ఈ ధాన్యం మొత్తం కొనుగోలు చేసి తెలంగాణ రైతాంగానికి అండగా నిలవాలని కోరారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులు, ఇతర అంశాలపై చర్చించారు. కేంద్ర మంత్రితో భేటీ అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..'దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో వరిధాన్యం ఉత్పత్తి జరుగుతోంది. ఈ రబీ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేయబోతున్నాం. వరి ధాన్యం

మిగతా 2లో..

## జాతీయ విపత్తును నివారించిన రోజు

- రాహుల్ నేతృత్వంలో విపక్షాలు ఐక్యత చాటాయి
- ఇందుకు సహకరించిన విపక్ష నేతలకు కృతజ్ఞతలు
- ఎక్స్ వేదికగా పోస్ట్ చేసిన సిఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ,ఏప్రిల్17(ప్రజాజ్యోతి): ఇవాళ జాతీయ విపత్తును నివారించిన రోజు అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య శక్తులు, ప్రతిపక్షాలు కలిసి జాతీయ విపత్తును నివారించాయన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు కోసం కేంద్రం తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో

మిగతా 12లో..

## హోర్ముజ్ ఓపెన్..

- ప్రపంచానికి ఇరాన్ శుభవార్త
- హోర్ముజ్ జలసంధి తెరిచి ఉంటుందని ప్రకటన
- ఇరాన్ ప్రకటనతో భారీగా తగ్గిన ఆయిల్ ధరలు



టెహ్రాన్,ఏప్రిల్17(ప్రజాజ్యోతి): ప్రపంచానికి ఇరాన్ శుభవార్త అందించింది. హోర్ముజ్ జలసంధిని తెరిచి ఉంచినట్లు ప్రకటించింది. ఇజ్రాయిల్, లెబనాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఇరాన్ ప్రకటనతో ప్రపంచవ్యాప్తంగా క్రూడాయిల్ ధరలు అమాంతంగా పడిపోయాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రపంచ రవాణాకు కీలకంగా మారిన హోర్ముజ్

మిగతా 2లో..

## రెండున్నర ఏండ్లలో ఎయిర్ పోర్టు పూర్తిచేస్తాం

### ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ వెల్లడి

### ఫీల్డ్ విజిట్ చేసిన కేంద్ర బృందం



ఆదిలాబాద్ బ్యూరో, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి): వచ్చే రెండేళ్లలో ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ అందుబాటులోకి వచ్చే విధంగా ప్రయత్నాలు ముమ్మురంగా సాగుతున్నా యని అందుకు తన వంతు స హాయశక్తులకు కృషి చేస్తామ ని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పా యల్ శంకర్ స్పష్టం చేశారు. ఆదిలాబాద్ లో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి ప్రస్తుతం రక్షణ శా ఖకు చెందిన 360 ఎకరాలు స్థలం అందుబాటులో ఉందని మరో 450 ఎకరాల కోసం రా ష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన లు పంపడం జరిగిందని, రా ష్ట్ర ప్రభుత్వం ఆ భూమిని సేకరించి కేంద్ర ప్రభుత్వానికి అప్ప గించినట్లయితే వచ్చే జూన్ మాసంలో శిలాఫలకం వేసే యోచణలో కేంద్ర ప్రభుత్వం

మిగతా 2లో..

## సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించిన ఆర్టిజన్లు

### విద్యుత్ శాఖ ఆర్టిజన్ల జేఏసీ చైర్మన్ సతీష్ రెడ్డి

### సిఎండితో చర్చలకు ఆదేశించిన డిప్యూటీ సీఎం



హైదరాబాద్,ఏప్రిల్17(ప్రజాజ్యోతి): ట్రాన్స్కో సీఎం డి తో మా సమస్యల పై చర్చించేందుకు డిప్యూటీ సీఎం ఆదేశించిన నేపథ్యంలో వెంటనే సమ్మె విరమించాలని నిర్ణయించినట్టు ఆర్టిజన్ల జేఏసీ చైర్మన్ సతీష్ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం ఉదయం హైదరాబాదులోని ప్రజా భవన్ లో ఆర్టిజన్ల జేఏసీ నాయకులు డిప్యూటీ సీఎంతో సమావేశమయ్యారు. తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారులతో చర్చలకు అనుమతించిన డిప్యూటీ సీఎంకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు ఆర్టిజన్ల జేఏసీ కన్వీనర్ సాయిలు ప్రకటించారు. ఉద్యోగులు ప్రజలను మెప్పించే పనులు చేయాలి, సమ్మెపై బ్యాన్ ఉన్నదని తెలిసి, వేసవిలో విద్యుత్తు డిమాండ్ పీక్ స్థాయిలో

మిగతా 2లో..

## రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వం

- బ్రిటన్ పౌరసత్వం కలిగి ఉన్నట్లు ఆరోపణలు
- విచారణకు ఆదేశించిన అలహాబాద్ హైకోర్టు

న్యూఢిల్లీ,ఏప్రిల్17(ప్రజాజ్యోతి): ద్వంద్వ పౌరసత్వం ఆరోపణలకు సంబంధించి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయాలని అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై విచారణ జరపాలని అక్కడి లఖ్‌నవూ బెంచ్ ఉత్తర్వులిచ్చింది. ఈ కేసు దర్యాప్తును

మిగతా 12లో..

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

**లోయలోపడ్డ వ్యాన్.. పదిమంది దుర్మరణం**

చెన్నై,ఏప్రిల్17(ప్రజాజ్యోతి): తమిళనాడులో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వ్యాన్ లోయలో పడ్డ ఘటనలో 10 మంది చనిపోగా.. మరి కొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. కోయంబత్తూరు జిల్లాలోని వాల్పరై ఘాట్ రోడ్డులో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం

మిగతా 12లో..

## కాళేశ్వరంపై ఎలాంటి దురుద్దేశ్యం లేదు

- నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీతో చర్చించాం
- వానాకాలంలోగానే సాయిల్ టెస్టింగ్ పూర్తి
- 20న సీఎం రేవంత్ మేడిగడ్డను పరిశీలిస్తారు
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు



న్యూఢిల్లీ,ఏప్రిల్17(ప్రజాజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డికి, తమ ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 20వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మేడిగడ్డ బ్యారేజ్‌ను పరిశీలిస్తామని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఛైర్మన్ అనిల్ జైన్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులు, పునరుద్ధరణపై చర్చించామని తెలిపారు.

మిగతా 12లో..

# సంపాదకీయం

## ప్రజలకు మరింత భారం కానున్న సీట్ల పెంపు !

మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై పార్లమెంటు సమావేశాలు వాడీవేడిగా సాగుతున్నాయి. ఈ సమావేశాలకు చాలా ప్రత్యేకత ఉంది. ఎందుకంటే ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న, చట్టసభల్లో అమలుకు నోచుకుని మహిళలకు 33శాతం రిజర్వేషన్ చట్టం నారీ శక్తి వందన్ అధినియమ్ మోడీ ప్రభుత్వం అమలు చేసేందుకు పట్టుదలగా ఉంది. నిజానికి ఇది ఎన్నో ఏళ్ల కల. ఇప్పటికే చాలా ఆలస్యం అయ్యింది. ఈ క్రమంలో దేశంలో 50శాతం ఉన్న మహిళలకు రిజర్వేషన్ అన్నది హక్కుగా దక్కాల్సిందే. పురుషాధిక్యాన్ని ఎదురొడ్డి నిలబ డాలంటే వారికి రిజర్వేషన్లు ఉండాల్సిందే. అయితే ఈ విషయంలో ఇప్పటికే ఉన్న సీట్లకు అనుగుణంగా అమలు చేయకుండా లోక్‌సభ సీట్లను 816కి పెంచడం అన్నది చాలా దారుణం. ఎందుకంటే ఉన్న లోక్‌సభ, అసెంబ్లీ సీట్లతోనే దేశం ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతోంది. ప్రజాప్రతినిధులకు ఇచ్చే జీత భత్యాలు, పెన్షన్లు, క్వార్టర్లు, విమాన ఖర్చులు ఇలా చెప్పుకుంటూ పోతే తడిసి మోపెడువుతున్నాయి. ఈ ఖర్చులను తగ్గించి, జీతభత్యాల్లో కోత విధించి, పెన్షన్లు తగ్గించాల్సి ఉన్నా వాటిపై ఎవ్వరూ మాట్లాడడం లేదు. ఉద్యోగులకు లేని పెన్షన్లు వీరికెందుకన్నది చెప్పడం లేదు. ఒక్కొక్కరు రెండేసి పెన్షన్లు పొందుతు న్నప్పటికీ ఘనత వహించిన మోడీ ప్రభుత్వం గుర్తించడం లేదు. దీనిగురించి చట్టసభల్లో అడిగేవారు లేరు. ఇప్పుడు ఎంపిలు, ఎమ్మెల్యేల ఖర్చులు వేల కోట్లల్లో ఉంటోంది. దీనిని మరింతగా పెంచడం కన్నా తగ్గించాలి. ఒకవేళ సీట్లు పెంచాల్సి వస్తే ఓ 50 లేదా 60 వరకు పెంచి వుంటే బాగుండేది. కనీసం ఓ 600 వరకు పెంచి, అందులో 250 మహిళలకు కేటాయిస్తే మంచిది. ప్రజాప్రతినిధుల సంఖ్యను పెంచి జనం మీద బాదే బదులు తగ్గిస్తే మంచిది. సీట్లు పెంచడం లాభం కనుక పెంచుతున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. కానీ మహిళా భివృద్ధి కోసం పాటుపడే లక్ష్యంలో మాత్రం అభినందించాల్సిందే. మహిళల విద్యకు, ఆర్థికంగా ఎదిగేందుకు ఊతమివ్వాలి. విద్యారంగంలో మహిళలకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి. ఉదారంగా వారికి రుణాలు ఇవ్వాలి. ఇవన్నీ చేస్తూనే కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో కూర్చోబెట్టడానికి అవకాశం కల్పించాలి. డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్న పార్టీలు ఇవన్నీ చర్చించాలి. సీట్ల సంఖ్యను పరిమితం చేసి, జీతభత్యాలన ఎత్తేసి, పెన్షన్లను రద్దు చేసేలా చర్చ చేయాలి. కేవలం రాజకీయ లబ్ది కోసమే చేయడం అన్నది సరికాదు. బిజెపికి గత ఎన్నికల్లో కూడా మహిళా ఓటు బ్యాంకు చాలా కీలకంగా మారిందన్న గణాంకాలు ఉన్నాయి. 2014 నుంచి 2024 సార్వత్రిక ఎన్నికల్ని పరిశీలిస్తే.. మహిళల ఓట్ల వల్లే బిజెపి గెలిచిందనడంలో అతిశయోక్తి లేదు. 1998 ఎన్నికల్లో బిజెపికి మహిళా ఓటింగ్ 33 శాతం. అప్పుడు అటల్ బీహారీ వాజ్‌పేయి అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్‌కి 30 శాతమే. ఆ తర్వాత మళ్లీ బిజెపికి మహిళా ఓటింగ్ తగ్గినా.. 2014 నుంచి క్రమేణా పెరుగుతోంది. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్‌కి 22 శాతం అయితే.. బిజెపికి 36 శాతం మహిళా ఓటింగ్ నమోదైందని ఎన్ఇఎస్ గణాంకాలే వెల్లడించాయి. అంటే మహిళలు అండగా ఉన్నందున ప్రతి విషయంలోనూ బిజెపి వారికి అనుకూల నిర్ణయాలు తీసుకోవాలి. ఇబ్బడిముబ్బడిగా ఎంపి, ఎమ్మెల్యే సీట్లు పెంచి, మహిళల కోసమే అని చెప్పడం సరికాదు. సీట్ల సంఖ్యను పెంచకుండానే వారికి 33శాతం అమలు చేయవచ్చు. విపక్షాలు కూడా ఇదే కోరుతున్నాయి. 2019లో 89.6 కోట్ల మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో 46.5 కోట్ల మంది పురుషులు, 43.1 కోట్ల మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. 2024కి 96.8 కోట్ల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్లు 47.1 కోట్లకి చేరారు. అంటే 2019కి కంటే 2024కి నాలుగు కోట్లమంది మహిళా ఓటర్లు పెరిగారు. ఇక ఈ ఎన్నికల్లో కొత్త ఓటర్లు 2.63 పెరగగా వారిలో 1.41 కోట్ల మంది మహిళలు, 1.22 మంది పురుషుల ఓటర్లు పెరిగారు. 2019లో 12 రాష్ట్రాల్లో రికార్డు స్థాయిలో మహిళా ఓటర్లు పెరిగారు. అయితే 2024లో 36 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల్లో 19 రాష్ట్రాల్లో మహిళా ఓటింగ్ పెరిగింది. అందువల్ల న్యాయంగా వారికి దక్కాల్సిన సీట్లను ఇవ్వాల్సిందే. అయితే అందుకోసం ఉన్న పార్లమెంట్, అసెంబ్లీ సీట్లను భారీగా పెంచడం సరికాదు. ఇప్పుడున్న లోక్‌సభ సీట్లు 543 కాస్తా.. 816కి పెరుగుతాయని హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ సీట్ల కేటాయింపుల్లో కూడా ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకే ఎక్కువ సీట్లు వచ్చే అవకాశం ఉంది. లోక్‌సభ స్థానాల పరంగానూ, ఇటు రాష్ట్రాల పరంగానూ ఎంపి, ఎమ్మెల్యే సీట్లు పెరగడం ఓ రకంగా రాజకీయ పార్టీలకే తప్ప ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఉండదు. ఃూజకీయంగా మహిళలు ఎదగాలన్నది, పరిపాలనలో భాగస్వామ్యం కావాలన్న విషయంపై ఎవరికీ వ్యతిరేకత లేదు. రాజకీయాల్లో ధనబలం, కండబలం నిరోధించాలంటే మహిళలను రాజకీయాల్లోకి తీసుకుని రావాల్సిందే. ఆ విషయంలో మహిళకు ఆర్థిక స్వేచ్ఛను కూడా ఇవ్వాల్సిందే. ఆస్తిలో హక్కులు కల్పించాల్సిందే. ఒకవేళ గెలిచినా.. మహిళల్ని తమ ఆలోచనలకు తగ్గట్టుగా పనిచేయనివ్వాలి. సామాజిక, ఆర్థిక పరంగా మహిళలు చైతన్యవంతంగా ఉంటే మంచి సమాజాం ఏర్పడుతుంది. సీట్ల పెంపు వల్ల పెద్దగా ప్రయోజనం లేదు. మహిళా కోటాను అమలు చేయడం కోసం సీట్లు పెంచాలనుకోవడం సరికాదు. అందువల్ల ఉన్న సీట్లలో 33శాతం అమలు చేయడమో లేదా, ఇపుడు 542ను 200కు పెంచడమో సబబుగా ఉంటుంది. ఏకంగా 816కు పెంచడం దేశంపై ముఖ్యంగా పన్నులు కట్టే ప్రజలపై భారం మోపడమే అవుతుంది.

# రెండున్నర ఏండ్లలో ఎయిర్ పోర్టు పూర్తిచేస్తాం

మొదటిపేజీ తరువాయి..

ఉందని ఆయన చెప్పారు. ఆ దిలాబాద్‌లో ప్రతి పాదిత ఎ యిర్‌పోర్ట్ నిర్మాణం పై సాధ్య త అధ్యయనం కోసం రక్షణ శాఖ అధికారులు, పౌర విమా నయాన మంత్రిత్వ శాఖ అధి కారులు, ఎయిర్ పోర్ట్స్ అ థారిటీ ఆఫ్ ఇండియా (ఏఏ ఐ) అధికారులు, రాష్ట్ర ప్రభు త్వ అధికారులు శుక్రవారం సంయుక్తంగా ఫీల్డ్ విజిట్ ని ర్వహించారు. ఈ కార్యక్రమం లో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ ఆదిలాబాద్ లో ఎయిర్ పోర్ట్ నిర్మాణ సాధ్య తపై రక్షణ శాఖ, ఏఏఐ, రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త భాగస్వా మ్యంతో అధ్యాయనం చేయ డానికి కేంద్ర మంత్రిత్వ శాఖ లు ఈ ఫీల్డ్ విజిట్ ను ఏర్పా టు చేయడం ఆనందకరమని తెలిపారు. ఎయిర్పోర్ట్ నిర్మా ణానికి ప్రభుత్వం ఆశిస్తున్న 11 వందల ఎకరాలు అందు కు సిద్ధంగా ఉన్నప్పటికీ ఎయి ర్ఫోర్స్ నిర్మాణానికి మరో వె య్యి ఎకరాలు అవసరం ఉం దని కేంద్ర ప్రభుత్వం రక్షణ శాఖ అధికారులు అడుగుతు న్నారని అందుకు రాష్ట్ర ప్రభు త్వంతో చర్చించి ఏర్పాట్లు చే సే యోచనలో ఉన్నట్లు పేర్కొ న్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరో వెయ్యి ఎకరాలు సేకరించి ఇ చ్చినట్లయితే ఎయిర్ ఫోర్స్ కూడా ఏర్పాటు అయ్యే అవ కాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఎయిర్పోర్ట్, ఎ యిర్పోర్స్ అదిలాబాదు లో ఏర్పాటు అయినట్లయితే అ దిలాబాద్ అన్ని రంగాలలో అ భివృద్ధి చెందే అవకాశం ఉం దని అంతేకాకుండా ఇండ స్ట్రియల్ పార్క్ ఏర్పాటు యో చనలో కూడా కేంద్ర ప్రభుత్వం ఉందని, అందుకు ఏరియల్ సర్వే కూడా అయినట్లు ఆయ న పేర్కొన్నారు. ఎయిర్ పోర్ట్ స్థలం పక్కనే ఉన్న సిసి ఐ స్థ లాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం ఏయిర్ పోర్టు స్థలంలో విలీనం చేసేందుకు ఆలోచిస్తుందని పేర్కొన్నారు. ఈ కా ర్యక్రమా న్ని ఏర్పాటు చేసిన భారత ప్ర భుత్వం, సంబంధిత కేంద్ర మంత్రులు, తెలంగాణ ము ఖ్య మంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞ తలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఢిల్లీలో జరిగే త దుప రి మూడు శాఖల సమా వేశం లో ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ ప్రాజెక్ట్ పై మరింత స్పష్టత వ స్తుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో అధికారులు నా య కులు పాల్గొన్నారు.

### సర్వేలో పాల్గొన్న కాంగ్రెస్ నా యకులు

ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ కు సంబంధించి ల్యాండ్ సర్వే లొ డిఫెన్స్ ఎయిర్ ఫోర్స్ అథా రి టీ అఫ్ ఇండియాకు సంబం దించిన ఉన్నత అధికారులతో కలిసి ల్యాండ్ సర్వే లొ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కూ డా పాల్గొన్నారు. ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షులు డా నరేష్ జాదవ్ తో పాటు మాజీ డీసీ సీ అధ్యక్షులు సాజీత్ ఖాన్, మాజీ టీపీసీసీ జనరల్ సెక్రట రీ సుజాత, రాష్ట్ర కిసాన్ కాం గ్రెస్ జనరల్ సెక్రటరీ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నా యకులు దౌలత్ రావు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# వీగిన మహిళా రిజర్వేషన్ బిల్లు



మొదటిపేజీ తరువాయి..

528 మంది సభ్యులు పాల్గొన్నారు. బిల్లుకు అనుకూలంగా 298 మంది ఓటు వేయగా, వ్యతిరేకంగా 230 మంది ఓటేశారు. దీంతో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమైన 326 ఓట్లను ఎన్డీఏ సాధించలేకపోయింది. దీంతో మిగతా రెండు బిల్లులను వెనక్కి తీసుకుంటు న్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ప్రధాని మోడీ మనస్సాక్షిగా ఓటేయాలని పిలుపునిచ్చినా విపక్ష కూటమి తన బలిమిని చాటింది. ఒక్కరు కూడా అనుకూలంగా కలసి రాలేదు. రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. లోక్‌సభలో మొత్తం సభ్యుల సంఖ్య 540. అంటే బిల్లు ఆమోదం పొందాలంటే కనీసం 360 మంది మద్దతు కావాలి. అధికార ఎన్డీఏ కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. అందువల్ల మరో 68 మంది మద్దతు అవసరం. మరోవైపు విపక్షాల బలం 233. వీరు కాకుండా స్వతంత్రులు, తటస్థ పార్టీలకు చెందిన వారు కలిసి 15 మంది ఉన్నారు. ప్రతిపక్ష సభ్యులు ఎక్కువ మంది గైర్హాజరైతే బిల్లు గ్గటెక్కే అవకాశం ఉందని అధికార ఎన్డీఏ భావించింది. సాయంత్రం 6 గంటలకు లోక్‌సభలో హోం మంత్రి అమిత్‌షా ప్రసంగించాక, ఈ బిల్లులపై ఓటింగ్ జరిగింది. ఓటింగ్ సమయంలో ప్రధాని మోడీ కూడా సభలోనే ఉన్నారు. ఓటింగ్ అనంతరం కిరణ్ రిజిజు ప్రకటన చేశారు. దీంతో సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓంబిర్ల ప్రకటించారు.

# 2023లోనే ఆమోదించిన బిల్లును అమలు చేయండి



మొదటిపేజీ తరువాయి..

ఈ బిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. అంతగా కావాలంటే పాత మహిళా రిజర్వేషన్ల బిల్లును రద్దు చేసి.. ఇప్పుడు కొత్తగా మళ్లీ తీసుకురావాలని కేంద్రానికి సూచించారు. లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై లోక్‌సభలో చర్చ సందర్భంగా రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళా బిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోంది. అంతగా కావాలంటే పాత బిల్లును రద్దు చేసి.. మళ్లీ తీసుకురండి. మేం ఎలాంటి అభ్యంతరాలు చెప్పకుండా మద్దతిస్తాం. బీసీ, దళితులు, మైనార్టీలు, మహిళల పట్ల ఈ బిల్లు క్షమించరాని, క్రూరమైన చర్య. ఓబీసీ సోదరుల నుంచి అధికారం లాక్కునే ప్రయత్నం జరుగుతోందన్నారు.

కులగణన ప్రారంభమైందని హోంమంత్రి అమిత్ షా చెప్పారు. ఇప్పుడు కులగణనతో సంబంధం లేకుండా డీలిమిటేషన్ ఎందుకు జరుగుతోందని, విపక్షాలన్నీ దీన్ని ఓడిస్తాయని రాహుల్ గాంధీ అన్నారు.

న్యాయవ్యవస్థ, ప్రైవేటు రంగం వంటి కీలక రంగాల్లో ఓబీసీలు, దళితులు ఎక్కడున్నారు? దేశ అత్యున్నత బ్యూరోక్రసీలో వీరు ఎక్కడున్నారు? ఓబీసీలకు అధికారం, భాగస్వామ్యం ఇచ్చేందుకు భాజపా సిద్ధంగా లేదు. తన ప్రాబల్యం తగ్గిపోతోందన్న భయం ఆ పార్టీకి పట్టుకుంది. దక్షిణాది, ఈశాన్య, చిన్న రాష్ట్రాలను భాజపా గౌరవించడం లేదని రాహుల్ ధ్వజమెత్తారు. లోక్‌సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా మోదీని పరోక్షంగా ఇంద్రజాలికుడంటూ రాహుల్ వ్యాఖ్యానిం చడం సభలో గందరగోళానికి కారణమైంది. దీనిపై స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేయగా.. భాజపా సభ్యులు కూడా రాహుల్ తీరుపై మండిపడ్డారు. ప్రధాన మంత్రిని అవమానిస్తున్నారని, ఇందుకు రాహుల్ వెంటనే క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ద్వారా దేశంలో కులగణన డిమాండ్‌ను పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందన్నారు. 'ఈ బిల్లు ఆమోదం పొందదని బీజేపీకి కూడా తెలుసు. వాళ్లంత తెలివతక్కువ వాళ్లు కాదు. ఈ బిల్లును విపక్షంలోని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తారని వాళ్లకు తెలుసు. అయినా ప్రధాని రెండు సందేశాలు పంపాలనుకున్నారు. ఇందులో మొదటిది.. దేశ ఎలక్టోరల్ మ్యాప్‌ను ఆయన మార్చాలను కున్నారు. రెండవది.. తాను మహిళా పక్షపాతినని మరోసారి చాటిచెప్పాలని అనుకున్నారు. బాలాకోట్ మెజిషియన్, డీమోనిటైజేషన్ మెజియన్, సిందూర్ మెజిషియన్ అక్షస్మాత్తుగా పట్టుబడ్డారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రిని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధానిపై అభ్యంతరకరమైన భాష వాడటాన్ని తప్పుపట్టారు. బాలాకోట్ దాడులు, ఆపరేషన్ సిందూర్ ప్రస్తావనతో దేశాన్ని, మిలటరీని అవమానపరుస్తున్నారని అన్నారు. దేశ ప్రధానమంత్రి గురించి విపక్ష నేత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని, ఆ వ్యాఖ్యాలను రికార్డులను నుంచి తొలగించాలని స్పీకర్ ఓం బిర్లాను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోరారు. అందుకు స్పీకర్ అంగీకరించారు.

## సిగాచీ బాధితులను నట్టేటముంచారు

హైదరాబాద్,ఏప్రిల్17(ప్రజాజ్యోతి): సిగాచి ప్రమాద బాధితులకు ఇచ్చిన హామీని కూడా నిలుపుకోలేక తన అసమర్థతను సీఎం రేవంత్ రెడ్డి మరోసారి చాటుకున్నారని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. నాడు కోటి రూపాయల సాయం అంటూ సిగాచి బాధితులను నమ్మబలికి అందులో సగం కూడా వారికి చేర్చని రేవంత్ రెడ్డి నయవంచనలో తనను మించినవారు లేరని నిరూపించుకున్నారని అన్నారు. ఆ పూటకు మాటలు చెప్పడం.. ఆ తర్వాత తాను చెప్పిన మాటలకే విలువ ఇవ్వకపోవడం రేవంత్ రెడ్డికే చెల్లిందని విమర్శించారు. సిగాచి పరిశ్రమ అగ్నిప్రమాదంలో 54 మంది అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోతే, ఆ బాధితుల కుటుంబాలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు వివేక్, దామోదర రాజనర్సింహ.. మృతదేహాల సాక్షిగా ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించారని తెలిపారు. కానీ ఇదంతా కంటితుడుపు చర్యే అని, బాధితులకు జరిగిన న్యాయం శూన్యమని ప్రభుత్వం అసెంబ్లీలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంతో తేటతెల్లమైందని పేర్కొన్నారు. యాజమాన్యం, ప్రభుత్వం కుమ్మక్కై పరిహారం లెక్కల్లో చేస్తున్న మోసం అంతా ఇంతా కాదని హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వం అసెంబ్లీలో సమర్పించిన అధికారిక లెక్కల ప్రకారం, 54 మంది బాధితులకు కలిపి ఇప్పటివరకు చెల్లించిన రూ. 24.51 కోట్లను విభజించి చూస్తే, ఒక్కో కార్మికుడి కుటుంబానికి సగటున అందిన పరిహారం కేవలం రూ. 45.40 లక్షలు మాత్రమే అని తెలిపారు. అంటే ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన కోటి రూపాయల పరిహారంలో ఇంకా ఒక్కో కుటుంబానికి దాదాపు రూ. 54.60 లక్షల చొప్పున, మొత్తంగా రూ. 29.48 కోట్ల బకాయిని ఈ ప్రభుత్వం ఎగ్గొట్టి బాధితులను నట్టేట ముంచిందని మండిపడ్డారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ పేద బాధిత కుటుంబాలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. ఇక్కడ మరో మోసం దాగుందని విమర్శించారు. యాజమాన్యం తాము 40 నుంచి 42 లక్షలు ఇస్తున్నామని కోర్టుల ముందు ఒప్పుకుందని చెప్పారు. అసలు నిజమేంటంటే, వారు సొంతంగా ఇచ్చిన 25 లక్షలకు.. కార్మికులు చనిపోవడం వల్ల చట్టబద్ధంగా వారికి రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్సూరెన్స్ డబ్బులను కూడా కలుపుకుని ఈ లెక్కలు చూపిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, యాజమాన్య అమానవీయతకు, దిగజారుడుతనానికి పరాకాష్ట అని మండిపడ్డారు. అంతేకాదు, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన కార్మికుల వైద్య ఖర్చులను కూడా ఈ అరకొర పరిహారంలోనే కోత విధించడం దారుణమని అన్నారు. ఇక ప్రమాదంలో కాలి బూడిదై ఆచూకీ దొరకని 8 మంది కార్మికుల కుటుంబాలను డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పించుకున్న దుర్మార్గ ప్రభుత్వం ఇది అని విమర్శించారు. ఇది కేవలం ఒక ప్రమాదం కాదు, యాజమాన్యం నిర్లక్ష్యంతో జరిగిన సామూహిక హత్య అని హరీశ్‌రావు అన్నారు. ఫ్యాక్టరీలో భద్రతా ప్రమాణాలు గాలికొదిలేశారని విచారణలో ఆధారాలతో సహా స్పష్టంగా తేలిందని చెప్పారు.

# వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ టాప్

మొదటిపేజీ తరువాయి..

రైతుల నుంచి కొనుగోలు చేసిన 48 గంటల్లోనే మద్దతు ధర డబ్బులు వారి ఖాతాల్లో వేస్తున్నాం. ఈ రబీ సీజన్‌లో 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్



కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా తీసుకోవాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశాం. కేంద్రం నుంచి తెలంగాణకు రూ.1,400 కోట్లు రావాల్సి ఉంది. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆ నిధులను విడుదల చేయాలని కోరాం. కేంద్రం పోషకాహార పంపిణీ పథకాన్ని రద్దు చేసింది. ఇది సరైన విధానం కాదు' అని తెలిపారు. ఢిల్లీలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పర్యటన బిజీబిజీగా సాగుతోంది. డీలిమిటేషన్‌పై హైబ్రిడ్ మోడల్‌కు మద్దతు కూడగట్టేందుకు ఆయన ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు దక్షిణాది రాష్ట్రాల వాదనను జాతీయస్థాయిలో వినిపించేందుకు కృషి చేస్తున్నారు. ప్రోరేటాకు వ్యతిరేకంగా దక్షిణాది ముఖ్యమంత్రులను రేవంత్ సమన్వయం చేస్తున్నారు. అదే సమయంలో పలువురు కేంద్రమంత్రులను రేవంత్ రెడ్డి కలుస్తున్నారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, పథకాలపై చర్చిస్తున్నారు.

## రాజ్యసభ డిప్యూటి ఛైర్మన్‌గా మరోమారు హరివంశ్

మొదటిపేజీ తరువాయి..

మూడోసారి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ డిప్యూటీ ఛైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అనుభవం రాజ్యసభకు ఎంతో అవసరమని అన్నారు. ఆయన అందరినీ కలుపుకుని వెళ్లాలని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. హరివంశ్ నేతృత్వంలో సభ మరింత శక్తిమంతం అవుతుందని అన్నారు. రాజ్యసభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా నూతన ఉపసభాపతికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ప్రతిపక్షానికి కూడా తగిన ప్రాధాన్యం ఇస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఆయన అందరి వాడని అన్నారు. ఇటీవల ఆయన రాజ్యసభ పదవీకాలం ముగిసింది. దీంతో ఆయనను రాష్ట్రపతి కోటాలో నామినేట్ చేశారు.

## విమానాశ్రయ పరిధిలో నాయిస్ జోన్ ఎత్తివేత

మొదటిపేజీ తరువాయి..

పరిసరాల్లో భవన నిర్మాణాలపై ఉన్న ఆంక్షలను సవరిస్తూ తెలంగాణ ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. తెలంగాణ బిల్డింగ్ రూల్స్ 2012లో మార్పులు చేస్తూ జీవోఎంఎస్ నంబర్ 168 ద్వారా సవరణలను ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ విమానాశ్రయాల పరిసర ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు సంబంధించి కీలక ఉత్తర్వులను జారీ చేసింది. ఎయిర్‌పోర్ట్ నాయిస్ జోన్ నిబంధనలలో మార్పులు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రియల్ ఎస్టేట్ రంగానికి, సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగపడనుంది. ఃుమానాల రాకపోకల వల్ల కలిగే శబ్ద కాలుష్యం దృష్ట్యా, గతంలో నిర్మాణాలపై కఠినమైన నియంత్రణలు ఉండేవి. అయితే, మారుతున్న పట్టణాభివృద్ధి అవసరాలు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పులు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది.

## సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించిన ఆర్టిజన్లు

మొదటిపేజీ తరువాయి..

ఉంటుంది ఈ సమయంలో అకస్మాత్తుగా సమ్మెకు వెళ్లడం సరైనది కాదని డిప్యూటీ సీఎం తెలిపారు. చర్చల ద్వారానే సమస్యల పరిష్కారం జరుగుతుందని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు. ఆర్టిజన్ల సమస్యలపై మానవీయ కోణంలో ప్రజా ప్రభుత్వం ఆలోచన చేస్తుందని తెలిపారు. విద్యుత్ సంఘాల నేతలు ఎప్పుడు వచ్చినా ప్రభుత్వం చర్చలు చేస్తుంది, వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు పోతుందని జేఏసీ నాయకులకు డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. ఆర్థిక భారం లేకుండా మానవీయ కోణంలో పరిష్కరించగలిగే సమస్యలపై ఆర్టిజన్ల జేఏసీతో ట్రాన్స్కో సిఎండి చర్చలు జరుపుతారు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు. చర్చల్లో ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఆర్టిజన్ల కో చైర్మన్లు చంద్రారెడ్డి, శ్రీధర్ గౌడ్, చందర్ సింగ్ ఠాకూర్, వైస్ చైర్మన్ సంతోష్, కోశాధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# హోర్ముజ్ ఓపెన్..

మొదటిపేజీ తరువాయి..

జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్టు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ప్రకటించారు. కాల్పుల విరమణ ఒప్పంద కాలం ముగిసేవరకూ హోర్ముజ్ పూర్తిగా తెరిచి ఉంటుందని ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇరాన్ తాజా ప్రకటనతో.. హోర్ముజ్ జలసంధిలో ఇకపై అన్ని వాణిజ్య నౌకలకు ప్రవేశం ఉంటుంది. అంతర్జాతీయ వాణిజ్య రవాణాకు కీలకమైన ఈ జలమార్గంలో వాణిజ్య నౌకల ప్రయాణాలకు మార్గం సుగమమైంది. ఇరాన్, ఇతర దేశాల మధ్య వాణిజ్య సంబంధాలపై ప్రభావం చూపే ఈ జలమార్గంపై.. కొన్ని నెలలుగా వివాదాలు కొనసాగుతున్నప్పటికీ, కాల్పుల విరమణ సమయం ముగిసేవరకూ.. యథావిధిగా వాణిజ్య రవాణా కొనసాగించవచ్చని ఇరాన్ స్పష్టం చేసింది. కాగా.. హోర్ముజ్ జలసంధి ద్వారా రోజుకు సుమారు 20 శాతం ప్రపంచ క్రూడాయిల్ సరఫరా అవుతుందన్న విషయం తెలిసిందే. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నంత వరకు హర్మూజ్ జలసంధి తెరిచే ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. అమెరికా-ఇరాన్ మధ్య శాశ్వత శాంతి ఒప్పందం కుదిరేందుకు లెబనాన్-ఇజ్రాయెల్ కాల్పుల విరమణ అంగీకారం అంశం దోహదపడే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిందని అమెరికా అధ్యక్షుడ డొనాల్డ్ ట్రంప్ కూడా తన ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్నారు. దీంతో పూర్తిస్థాయిలో నౌకల రాకపోకలు కొనసాగను న్నాయని తెలిపారు. ఇరాన్ ప్రకటనతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా పతనం అయ్యాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 8 శాతం మేర క్షీణించి 90 డాలర్లకు చేరింది.

## ఘనంగా ప్రపంచ హేమోఫిలియా దినోత్సవ వేడుకలు



**నేరడిగొండ, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి):** నేరడిగొండ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో శుక్రవారం ప్రపంచ హేమోఫీలియా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మరియు పోలీస్ శాఖ ప్రతినిధులు పాల్గొని విద్యార్థినులకు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సద్దాం మాట్లాడుతూ.. హేమోఫీలియా అనేది ఒక జన్యుపరమైన లోపమని, దీనివల్ల గాయాలైనప్పుడు రక్తం త్వరగా గడ్డకట్టదని వివరించారు. ఇటువంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సరైన సమయంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సబ్ ఇన్స్పెక్టర్ నీల కృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ బ్రహ్మానంద రెడ్డి, హెచ్ఈఓ పవార్ రవీందర్, సబ్ యూనిట్ ఆఫీసర్ వేణు, హెల్త్ సూపర్ వైజర్ సంతోష్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఎల్. రాజీత, పీహెచ్‌సీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

## పాడి గేదెల పథకం దరఖాస్తు డెడ్‌లైన్ పొడిగింపు



**కొమురం భీం జిల్లా, ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి క్రైమ్ రిపోర్టర్) :** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి అమలు చేస్తున్న పాడి గేదెల పంపిణీ పథకానికి దరఖాస్తుల డెడ్‌లైన్‌ను ఈ నెల 23వ తేదీ వరకు పొడిగిం చినట్లు కార్యనిర్వాహక సంచాలకులు సురేష్ కుమార్ తెలిపారు. ఈ పథకం కింద లబ్ధి పొందదలచిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు కోసం ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, కుల ధృవీకరణ పత్రం (మీసేవ జారీ చేసినది), ఆదాయ ధృవీకరణ పత్రం (మీసేవ జారీ చేసినది) తప్పనిసరిగా ఉండాలి. దివ్యాంగులైతే సదరం సర్టిఫికెట్ సమర్పించాలి. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు తమ దరఖాస్తులను సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలో, పట్టణ ప్రాంతాల వారు మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలని అధికారులు సూచించారు. అర్హులైన షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

## ఆసిఫాబాద్‌లో బీజేపీకి షాక్

- 20 మంది నేతలు బీఆర్ఎస్‌లో చేరిక
- ఎమ్మెల్యే కోవ లక్ష్మి సమక్షంలో బీజేపీ నేతల బీఆర్ఎస్‌లోకి మార్పు
- గులాబీ కండువా కప్పి ఆహ్వానం – ఎమ్మెల్యే కోవ లక్ష్మి



**ఆసిఫాబాద్ ఏప్రిల్ 17 ప్రజా జ్యోతి :** ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని వాంకిడి మండలం ఎనోలి గ్రామంలో రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. గ్రామానికి చెందిన సుమారు 20 మంది బీజేపీ నాయకులు శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వాంకిడి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డాక్టర్ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే కోవ లక్ష్మి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె స్వయంగా గులాబీ కండువాలు కప్పి నాయకులను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ, ఎమ్మెల్యే కోవ లక్ష్మి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, కార్యకర్తల పట్ల చూపుతున్న ఆప్యాయతకు ఆకర్షితులై తాము బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాటగూడ సర్పంచ్ సోయం సంజీవ్, మాజీ సింగిల్ విండో చైర్మన్ జాబరి పేంటు, అలాగే శ్రీను, రాజ్ కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామానికి రక్షణ గోడ నిర్మాణం ప్రారంభం

- ముంపు సమస్యకు చెక్.. మాణిక్ గూడకు రక్షణ



**ఆసిఫాబాద్ ఏప్రిల్ 17 ప్రజా జ్యోతి :** ఆసిఫాబాద్ మండలంలోని కుమ్రం భీం ప్రాజెక్టు కుడి కాలువ వల్ల మాణిక్ గూడ గ్రామానికి ఎలాంటి నష్టం కలగకుండా పూర్తి స్థాయి రక్షణ కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. శుక్రవారం గ్రామంలో రూ.46 లక్షల వ్యయంతో నిర్మించనున్న రిటర్నింగ్ వాల్‌కు ఆమె ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఫిబ్రవరి నెలలో గ్రామాన్ని సందర్శించిన సందర్భంగా గిరిజనులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ప్రాజెక్టు కుడి కాలువ కారణంగా గ్రామానికి ప్రమాదం ఉందని వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించగా, రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామానికి శాశ్వత రక్షణ కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ముంపు ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ గోడ నిర్మాణం వల్ల భూమి కోత సమస్య తగ్గడమే కాకుండా భవిష్యత్తులో ముంపు నుంచి గ్రామస్తులకు పూర్తి భద్రత లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ గుణవంతరావ్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జె.ఏ.సి ఆధ్వర్యంలో నిరసన

- ఖానాపూర్ తాసిల్దార్ సుజాతకు వినతిపత్రం
- పాల్గొన్న వివిధ సంఘాలు
- కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో ఉపాధ్యాయ, ఉద్యోగ, రెవెన్యూ మున్సిపల్ విశ్రాంత ఉద్యోగుల ప్రదర్శన





**ఖానాపూర్ ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ ఉద్యోగ ,ఉపాధ్యాయ కార్మిక,పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టి.జి.ఏ.జె.ఏ.సి) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ తాసిల్దార్ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపి ఎమ్మార్వో సుజాతకు వినతి పత్రం సమర్పించారు పెండింగులో ఉన్న ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం భోజన విరామ సమయంలో స్థానిక జె.ఏ.సి నాయకులు, ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షనర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. పి.ఆర్.సి కమీషన్ నివేదికను తెప్పించి జూన్ 2 లోగా అమలు చేయాలని, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగులు, పెన్షనర్లలకు ఆరోగ్య కార్డులు మంజూరీ చేయాలని, రాష్ట్రంలో కాంట్రి బ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ స్కీం పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.ఆర్.టి.యు, ఎస్.టి.యు, టి.ఎన్.జి.ఓ,నాల్గవ తరగతి ఉద్యోగుల, తెలంగాణా ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్డ్ సంఘాల నాయకులు రవీందర్ సురేందర్ దురిశెట్టి శ్రీనివాస్ దాసరి నర్సయ్య మురళి ఎం గంగాధర్ భీమలింగం రాజేందర్ కారంగుల వెంకటేశ్వర్లు భువనగిరి కాంతారావు గణపతి రావు సామలక్ష్మీనారాయణ సిహెచ్ కిషన్ రావు తోట రవీందర్ వెంకటస్వామి పలు సంఘాల అధ్యక్ష కార్యదర్శులు,కార్యవర్గ సభ్యులు ప్రాథమిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎండలో ఎడారిలా మారిన మార్గం...

# సామెలలో చలివేంద్రంతో చల్లని ఊరట





**కొమురం భీం జిల్లా ప్రజా జ్యోతి క్రైమ్ రిపోర్టర్ ఏప్రిల్ 17 :** వాంకిడి, మండలంలో వేసవి వేడి తన ప్రభావాన్ని రోజురోజుకూ పెంచుకుంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వేళ, సామెల గ్రామంలో గ్రామపంచాయతీ తీసుకున్న చిన్న ప్రయత్నం పెద్ద ఉపశమనంగా మారింది. జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన చలివేంద్రం ఇప్పుడు ప్రయాణికులకు చల్లని నీటితో ఊరటనిస్తుంది. ఈ చలివేంద్రాన్ని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ఘనంగా ప్రారంభించగా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్రే అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం సందర్భంగా గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. సర్పంచ్ వాడ్ గురె సంతోష్ మాట్లాడుతూ, ఎండాకాలంలో తాగునీటి కోసం ప్రజలు పడుతున్న కష్టాలను గుర్తించి ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు, ముఖ్యంగా దూర ప్రాంతాల నుండి వెళ్లేవారికి ఇది ఎంతో ఉపయోగకరంగా మారుతుందని చెప్పారు. ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ, "ఎండాకాలం వచ్చినప్పుడల్లా తాగునీటి కోసం ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు మనకు తెలుసు. అలాంటి సమయంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అనేది కేవలం సేవ మాత్రమే కాదు, మానవత్వానికి నిదర్శనం కూడా," అని పేర్కొన్నారు. ప్రజలకు తక్షణ ఉపశమనం కలిగించే ఈ కార్యక్రమాన్ని ఆమె అభినందిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని గ్రామాల్లో కూడా చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుర్నులే నారాయణ, ఉప సర్పంచ్ రేపాక నాగభూషణం, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామపంచాయతీ చేపట్టిన ఈ చలివేంద్రం ప్రస్తుతం ప్రయాణికులకు చల్లని నీటిని అందిస్తూ, వేసవి వేడిలో ఒక చల్లని నీడలా నిలుస్తోంది.

# కామ్రేడ్ కూనంనేని సాంబశివరావుతో మర్యాదపూర్వక సమావేశం



### సింగరేణి సమస్యలపై ఏఐటీయూసీ, సీపీఐ నాయకుల చర్చ

### భవిష్యత్ ఉద్యమ కార్యాచరణకు సిద్ధం

**మంచిర్యాల, 17, ఏప్రిల్ (ప్రజా జ్యోతి) :** హైదరాబాద్‌లోని మఖ్దూమ్ భవన్‌లో కాలు ఆపరేషన్ అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును ఏఐటీయూసీ కేంద్ర నాయకత్వం, సీపీఐ రాష్ట్ర నాయకత్వం పరామర్శించింది. ఈసందర్భం గా సింగరేణి సంస్థలో నెలకొన్న సమస్యల పై మర్యాదపూర్వక సమావేశం నిర్వహించి పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్‌తో పాటు కేంద్ర, బ్రాంచ్ స్థాయి నాయకులు పాల్గొన్నారు. సింగరేణిలో కార్మిక సమస్యలు, కాంట్రాక్టు కార్మికుల వేతనాలు, నిలిపివేసిన మెడికల్ బోర్డు, విజిలెన్స్ కేసులు, సొంతింటి పథకం అమలు, డిస్మిస్ అయిన కార్మికులకు మరో అవకాశం కల్పించడం వంటి అంశాలతో పాటు పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్, ఫ్లక్టర్ కమిటీ సిఫారసులు, క్లర్క్ పోస్టుల భర్తీ, పెండింగ్ డిపెండెంట్లకు ఉద్యోగాలు, సహజ మరణానికి 25 లక్షల ఎక్స్‌గ్రేషియా వంటి విషయాలపై చర్చించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన సుమారు 50 వేల కోట్ల బకాయిల అంశంపై నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర కార్యాచరణ రూపొందించా లని నిర్ణయించారు.

**ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఘాటు విమర్శలు........!** సింగరేణి పరిరక్షణే తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ: వాసిరెడ్డి సీతారామయ్య : హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో జరిగిన ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు సింగరేణి యాజమాన్యంపై నాయకులు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ "సింగరేణిని కాపాడుకోవడం అంటే తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవడమే" అని స్పష్టం చేశారు. సేవ్ సింగరేణి పోరాటంలో భాగమైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేయాలని చూస్తున్న కార్మిక కోడ్లకు వ్యతిరేకంగా పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపు నిచ్చారు. ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు ఏకమై ముందుకు రావాలని సూచించారు. ప్రధాన డిమాండ్లలో మెడికల్ బోర్డు పునరుద్ధరణ, సొంతింటి పథకం అమలు, పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ యాజమాన్యమే భరించడం, .50 వేల కోట్ల బకాయిల చెల్లింపు, కొత్త గనుల ప్రారంభం, విజిలెన్స్ కేసుల పరిష్కారం, ఫ్లక్టర్ కమిటీ సిఫారసుల అమలు, క్లర్క్ పోస్టుల భర్తీ, 350 మంది డిపెండెంట్లకు ఉద్యోగాలు, డిస్మిస్ కార్మికులకు మరో అవకాశం, సహజ మరణానికి 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లింపు వంటి అంశాలు ఉన్నాయి.

**సింగరేణి భవిష్యత్తుపై ఆందోళన – ఏకం కావలసిన కార్మిక సంఘాలు.....!!** సింగరేణిలో పాత గనులు మూతపడటం, కొత్త గనుల ప్రారంభంలో ఆలస్యం, కార్మికుల సంఖ్య తగ్గిపోవడం, బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు నెరవేరకపోవడం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.50 వేల కోట్లకు పైగా బకాయిలు పెండింగ్‌లో ఉండటం వంటి అంశాలు సంస్థ భవిష్యత్తుపై ఆందోళనను పెంచుతున్నాయి. ప్రస్తుతం గుర్తింపు కార్మిక సంఘంగా ఏఐటీయూసీ కొనసాగుతుండగా, ఐఎన్‌టీయూసీ ప్రాతినిధ్య సంఘంగా ఉంది. ఇదే సమయంలో ఇతర కార్మిక సంఘాలు కూడా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాన్ని, యాజమాన్యాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో జాతీయ కార్మిక సంఘాలైన ఏఐటీయూసీ (సీపీఐ), ఐఎన్‌టీయూసీ (కాంగ్రెస్), బీఎంఎస్ (బీజేపీ), సిఐటీయూ (సీపీఐ ఎం), హెచ్‌ఎంఎస్ (జనతాదళ్––తెలంగాణ జాగృతి) వంటి సంఘాలు సింగరేణి పరిరక్షణపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని కార్మిక సంఘాలు తమ భేదాభిప్రాయాలను పక్కనబెట్టి ఒకే వేదికపైకి వచ్చి "సేవ్ సింగరేణి" ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని కార్మిక వర్గాల్లో స్పష్టమైన భావన వ్యక్తమవుతోంది. సింగరేణి సంస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను దృష్టిలో ఉంచుకుని, అన్ని కార్మిక సంఘాలు ఏకమై సమిష్టిగా పోరాడితేనే సంస్థ భవిష్యత్తు, కార్మికుల భవిష్యత్తు రక్షితంగా ఉంటాయని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. "సేవ్ సింగరేణి" ఉద్యమం మరింత బలపడే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర సహాధ్యక్షులు బండి రమేష్**



**మంచిర్యాల, 17,ఏప్రిల్ (ప్రజా జ్యోతి) :** ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరియు పెన్షనర్ల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీజీ జేఏసీ డిమాండ్ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్లకు వినతి పత్రాలు సమర్పించా లన్న పిలుపు మేరకు, మంచిర్యాలలో తహసీల్దార్‌కు (డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ ద్వారా) టీజీ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర సహాధ్యక్షులు బండి రమేష్ మాట్లాడుతూ, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించా లని పలుమార్లు కోరినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. దీంతో దశలవారీగా ఉద్యమాలకు పిలుపునివ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 2023 జూన్ నుంచి అమలు కావాల్సిన పిఆర్సి నివేదిక ఇప్పటికీ వెలువడకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పెండింగ్ డిఏలు, బిల్లుల చెల్లింపులు, హెల్త్ కార్డుల అమలు వంటి అంశాల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని ఎన్నికల మేని ఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ హామీలను అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల ను కుటుంబ సభ్యులుగా భావించి వారి సమస్యల పరిష్కారంపై తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భారతి అశోక్, పెన్షనర్ ఉద్యోగుల ప్రతినిధులు కే. సుధాకర్ రెడ్డి, కైరం జనార్ధన్, రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రి ముందు మెడికల్ ఉద్యోగుల నిరసన ప్రదర్శన



**ఖానాపూర్ ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి) :** జెసిపి మేరకు తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ ఉద్యోగ సంఘ తరపున న్యాయమైన కోరికలు వెంటనే నెరవేర్చలని పిఆర్సి పెండింగ్ డిఏ సిపిఎస్ పాత పెన్షన్ పద్ధతులు వైద్యశాస్త్ర శాఖలో అక్రమంగా బదులైన వారిని కోర్టు ఆర్డర్ ద్వారా అమలు చేయాలంటూ ఏఐటీయూసీ ఖానాపూర్ ప్రభుత్వ కమిటీ ఆసుపత్రి ముందు నల్ల బ్యాడ్జి లు ధరించి భోజన విరామ సమయంలో నిరసన జరిపారు మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రనాయకులు శ్రీనివాసచారి ఆరోగ్య మేరీ సంజాత మణి స్వరూప సుజాత కిరణ్మయి షేక్ పర్వీన్ సంగీత మంజుల భాగ్య పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణను పాకిస్తాన్‌తో పోలుస్తారా

### ఎంపీ తేజశ్రీ సూర్యా పై కాంగ్రెస్ నిప్పులు



**సోనాల, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ రాష్ట్రాన్ని పాకిస్తాన్‌తో పోలుస్తూ బిజెపి ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సోనాల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చౌహన్ వినోద్, డిసిసి కార్యదర్శి లోలపు పోశెట్టి మాట్లాడారు. పార్లమెంట్ వేదికగా ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి తెలంగాణను పాకిస్తాన్‌తో పోల్చడం తేజస్వి సూర్య అహంకారానికి నిదర్శనమని వారు మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని, బిజెపి నేతలు తమ మాటతీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను గౌరవించి తెలంగాణ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, ఆనాడు కాంగ్రెస్ వ్యవహరించిన తీరు దేశానికే ఆదర్శమని వారు గుర్తు చేశారు. బిజెపి నాయకులు బేషరతుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ అధ్యక్షుడు జుంగాల భోజన్న, మాజీ సర్పంచ్ సోయం బాపూరావు, సీనియర్ నాయకులు బాశెట్టి సుదర్శన్, రామయి రాము, మునేశ్వర్ సోమన్న, భీంరావు పాటిల్, సుధీర్ కుమార్, జి.భోజరాజు తదితరులు పాల్గొన్నారు.

## జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

### మార్క్ ఫెడ్ ఎం.డికి వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే



**నేరడిగొండ ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర మార్క్ ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మరియు ముధోల్ ఎమ్మెల్యే కలిసి హైదరాబాద్‌లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గ పరిధిలోని జొన్న రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే ఎం.డి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలోని పలు మండలాల్లో జొన్న పంట చేతికి వచ్చిందని, రైతులు తమ పంటను అమ్ముకోవడానికి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆయన కోరారు. ముఖ్యంగా ఈ క్రింది ప్రాంతాలలో యుద్ధ ప్రాతిపదికన కేంద్రాలను ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పించారు : ధన్నూర్,బోథ్ నెరడిగొండ,ఇచ్చొడ, తాంసి,భీంపూర్,బజార్ హత్నూర్,

**రైతులకు అండగా ఉంటాం :** జొన్న రైతులకు మద్దతు ధర కల్పించడంతో పాటు, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం ద్వారా త్వరితగతిన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు అయ్యేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా అనిల్ జాదవ్ హామీ ఇచ్చారు.

## మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన




**ఖానాపూర్ ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి) :** టిఇజేఏసీ పిలుపుమేరకు ఖానాపూర్ మండల పరిషత్ కార్యాలయం ముందు ఉద్యోగులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన జరిపారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాధా రాథోడ్ ఎంపీఓ రత్నాకర్ రావు పంచాయతీ కార్యదర్శుల రాష్ట్ర నాయకులు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

## తెలంగాణ ఉద్యోగుల జేఏసీ డిమాండ్

మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి, ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ రోజు తెలంగాణ ఎంప్లాయిస్ టీచర్స్ & పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈ జేఏసీ) పిలుపులో భాగంగా శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో మక్తల్ తహసీల్దార్ సతీష్ కుమార్ కు వినతిపత్రం అందించడం జరిగిందని జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారమే లక్ష్యంగా టీజీఈజేఏసీ ప్రకటించిన కార్యచరణలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో స్థానిక తహసీల్దార్ కు రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను సత్వరం పరిష్కరించ ాలని కోరారు.

టీజీఈ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి , సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్ళిన అనేక సమస్యలలో కొన్ని సమస్యలు పరిష్కారమైన ప్పటికీ ఇంకా అనేక సమస్యలు, నేటికి పెండింగ్‌లోనే ఉన్నాయని అవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని వివిధ రూపాలలో సీఎస్, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని వారు కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2004 సెప్టెంబర్ 1వ తేదీకి ముందు నోటిఫికేషన్ వేసి తర్వాత నియామకమైన ఉద్యోగులకు వెంటనే ఓపీఎస్ చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక



జూన్ 2వ తేదీ నాటికి ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించాలని 2026 జూన్ 2వ తేదీ నాటికి పీఆర్సీ అమలుతో పాటు పెండింగులో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్స్ అన్నీ క్లియర్ చేయాలని, అలాగే రిటైర్డ్ ఉద్యోగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ కార్డ్స్ జారీ చేసి తక్షణమే అమలు చేయాలని,. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానంను పునరుద్ధరించాలని, కేంద్ర విధానమును అమలు చేయాలని కోరారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏల వారసుల ఉద్యోగ నియామక సమస్యను సత్వరం పరిష్కరించాలని కోరారు. అలాగే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. త్వరలో జనాభా లెక్కల కార్యక్రమం ఉన్నందున ఉద్యోగ, ఉపాధ్యా యులకు సంబంధించిన సాధారణ బదిలీలు రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జేసి నాయకులు జిల్లా జెఏసి నాయకులు రవీందర్, నాగార్జున, ప్రహ్లాద్ మండలం జేఏసి నాయకులు నరసింహ రాకేష్ అనిల్ రెడ్డి,రాజ్ గోపాల్,ఆంజనేయులు,భాస్కర్, మల్లి కార్జున్,వెంకటయ్య, నరసింహులు, వెంకటేష్, నరసింహ, రాము, రాజ ఆంజనేయులు, జగదీష్, రవీందర్ రెడ్డి, రవి, కుర్మయ్య, ప్రవర్ధన్ రెడ్డి, నర్సింహా, మానస, బస్వరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# గోల్డెన్ అవర్ అవగాహనతో ప్రాణ రక్షణ

## డ్రైవర్లకు ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక శిక్షణ – రోడ్డు భద్రతపై దృష్టి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి బ్యూరో): ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా "అరివ్ అలైవ్ " రోడ్డు భద్రతా కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా ట్రాఫిక్ పోలీసులు ఆటో, టాక్సీ డ్రైవర్లకు గోల్డెన్ అవర్ మరియు సి పి ఆర్ పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిసి అర్ బీ డీఎస్పీ జి.వి. రమణ రెడ్డి హాజరై ప్రసంగించారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే మొదటి గంట అయిన గోల్డెన్ అవర్‌లో సరైన




ప్రథమ చికిత్స అందిస్తే ప్రాణాలను కాపాడవచ్చని ఆయన తెలిపారు. ప్రతి డ్రైవర్‌కు ప్రాథమిక వైద్య పరిజ్ఞానం, ముఖ్యంగా సీ పి ఆర్ విధానం తెలిసి ఉండటం అత్యంత అవసరమని సూచించారు.

అదేవిధంగా ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించాలి, కారులో సీట్ బెల్ట్ వినియోగించాలి, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ ప్రమాదాలకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు. "సురక్షితంగా వెళ్లి, సంతోషంగా ఇంటికి చేరడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని తెలిపారు. ఎస్ వి ఎస్ హాస్పిటల్ మహబూబ్‌నగర్‌కు చెందిన వైద్య బృందం డాక్టర్ మౌనిక, పవన్ కుమార్, చైతన్య రెడ్డి ప్రమాదాల సమయంలో చేయవలసిన ప్రథమ చికిత్సలు, సీపీఆర్ విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించి డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సి ఐ రాజేందర్ రెడ్డి, ఎస్ ఐ లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. సుమారు 100 మంది ఆటో, టాక్సీ డ్రైవర్లు పాల్గొని అవగాహన పొందారు. ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని పోలీసులు పేర్కొన్నారు.

# ఎస్ఎంఏ టైప్-1 వ్యాధితో పోరాడుతున్న చిన్నారి చైత్రికకు దాతల సహాయం


గద్వాల ఏప్రిల్ 17(ప్రజా జ్యోతి ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలోని గద్వాల మండలం పరుమాల గ్రామానికి చెందిన రమేష్,మౌనిక దంపతుల ఆరు నెలల చిన్నారి చైత్రిక ఎస్ఎంఏ టైప్–1 జన్యు వ్యాధితో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలతో పోరాడుతోంది.ఈ చిన్నారి పరిస్థితిపై వచ్చిన కథనానికి స్పందించిన దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం



అందించారు."మానవసేవే మాధవసేవ" గ్రూప్ ఆధ్వర్యంలో దాతలు అందించిన రూ.55,000లను ఏప్రిల్ 16, 2026న హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న చైత్రిక తల్లిదండ్రులకు అందజేశారు.ఈ సందర్భంగా చైత్రిక కుటుంబ సభ్యులు,తమ కష్టసమయంలో అండగా నిలిచిన ప్రతి దాతకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.చిన్నారి ఆరోగ్యంపై సమాచారం అందించిన వెంటనే స్పందించి సహాయం చేసినందుకు"మానవసేవే మాధవసేవ"గ్రూప్ ద్వారా అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మానవత్వంతో ముందుకు వచ్చి సహాయం చేసిన దాతల సహకారం చిన్నారి చికిత్సకు ఎంతో దోహదపడుతుం దని,మా అమ్మాయి చికిత్సకు కావలసిన డబ్బు కొరకు విషయం తెలిసిన వెంటనే స్పందించి,తన గ్రూప్ ద్వారా దాతల నుండి ఆర్థిక సహాయం,మానసిక ధైర్యాన్ని ఇచ్చిన గ్రూప్ అడ్మిన్ రామాంజనేయులకు(చిన్న మధు) ప్రత్యేక ధన్యవాదములు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

# తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే ఊరుకోం..

వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని తెలంగాణ రాష్ట్ర ఏఐసిసి అధ్యక్షులు డా. జిల్లెల ఆదిత్య రెడ్డి హెచ్చరించారు. ఈనెల 16, 17, 18 తేదీలలో పార్లమెంట్‌లో డీలిమిటేషన్, మహిళా బిల్లు అంశాలపై ప్రత్యేక సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో కర్ణాటకకు చెందిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పాకిస్తాన్ విభజనతో పోల్చడం తీవ్రంగా ఖండనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల ద్వారా తెలంగాణ సమాజాన్ని, అమరవీరుల త్యాగాలను అవమానించారని ఆయన మండిపడ్డారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం ఆర్థిక సంక్షోభాన్ని అధిగమిస్తూ ప్రజలకు ఆహార భద్రత కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని ఆయన గుర్తుచేశారు. గుండుసూది కూడా దొరకని స్థితి నుంచి అంతరిక్షంలోకి వెళ్లే స్థాయికి దేశాన్ని తీసుకువెళ్లడంలో కాంగ్రెస్ కృషి విశేషమని తెలిపారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు మద్దతుగా బీజేపీ 1997 కాకినాడ తీర్మానంలో హామీ ఇచ్చినా, అధికారంలోకి వచ్చిన తర్వాత ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, ఝార్ఖండ్ రాష్ట్రాలను ఏర్పాటు చేసి, తెలంగాణ విషయంలో మాత్రం కాలయాపన చేశారని విమర్శించారు.



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ప్రజల దీర్ఘకాల పోరాటం, అమరవీరుల త్యాగాలు కారణమని, ఆ భావోద్వేగాన్ని గుర్తించిన కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ఇచ్చిన మాట నిలబెట్టుకుని ప్రజాస్వామ్యబద్ధంగా తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ బలహీనపడినా, ప్రస్తుతం వైఎస్ షర్మిల నాయకత్వంలో పునరుద్ధరణ దిశగా పయనిస్తోందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్లమెంట్ సాక్షిగా చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ, ఇప్పుడు బీజేపీ నాయకులు విభజనను అవమానించేలా మాట్లాడటం విచారకర మని అన్నారు. తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు రాష్ట్ర ప్రయోజనాలపై స్పందించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అవమానిస్తున్న బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించిన ఆయన, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే, అభివృద్ధి చేసేది కూడా అదే పార్టీ అని స్పష్టం చేశారు.

# సిపిఆర్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

## –ఎదుటివారి ప్రాణాలు కాపాడడం అంటే సామాజిక బాధ్యత: సీఐ రాంలాల్ రాథోడ్

మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి, ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి): సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని మక్తల్ సిఐ రాంలాల్ రాథోడ్ పేర్కొన్నారు. శుక్రవారం "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత,ట్రాఫిక్ నియమాలు, ప్రమాదాల నివారణ కార్యక్రమంలో భాగంగా మక్తల్ పోలీస్ స్టేషన్లో అంబులెన్స్ ప్రసరణ అందడం ద్వారా, నోటి ద్వారా ఆక్సిజన్ అందించ డం వల్ల ప్రాణాలను రక్షించవచ్చన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉండే పోలీసులు, డ్రైవర్లు, యువకులు ఆకస్మికంగా గుండెపోటుకు గురయ్యే వ్యక్తులు తారస పడే అవకాశం ఉన్నందున సీపీ ఆర్ శిక్షణ ఇవ్వడం వలన అలాంటి వ్యక్తుల





డ్రైవర్లు, స్వయంసేవకులకు ఫస్ట్ ఎయిడ్,గోల్డెన్ అవర్ శిక్షణ మరియు ప్రమాదాల్లో ప్రాణాలు కాపాడేందుకు డ్రైవర్లకు, ప్రజలకు, పోలీస్ సిబ్బందికి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రాంలాల్ రాథోడ్ మాట్లాడుతూ గుండెపోటు వచ్చిన వ్యక్తికి తక్షణమే ప్రథమ చికిత్స అందించడం వల్ల ప్రాణాలు కాపాడవచ్చని పేర్కొన్నారు. ఇటీవల మన ప్రాంతంలోనే గుండెపోటుతో పలువురు మరణించడం బాధాకరమని, దీనిద్వారా ఎవరు మృతి చెందవద్దనే ఉద్దేశంతో సిపిఆర్ పై అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉన్నపుడే కార్డియా మరణాలు చాలా వరకు అదుపులోకి వస్తాయన్నారు. సీపీఆర్ విధానం ద్వారా గుండెకు రక్త ప్రాణాలు కాపాడే అవకాశం ఉందన్నారు. ఆటో డైవర్లకు, హోటళ్లలో పని చేసే సిబ్బందికి ఇవ్వడం ద్వారా గుండె మరణాలు చాలా వరకు నియంత్రణలోకి వస్తాయన్నారు. ఆకస్మికంగా గుండెపోటుతో కుప్పకూలితే వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చి వాహనం వచ్చే వరకు సీపీఆర్ చేస్తే నిండు జీవితాన్ని కాపాడిన వారమవుతామని చెప్పారు. సీపీఆర్‌పై అందరికి అవగాహన కల్పించినపుడే ప్రజలను గుండెపోటు నుంచి రక్షణ కల్పించ గలుగుతామని అని అన్నారు. సీపీఆర్ చేసే విధానంపై డాక్టర్ వినీత పోలీసులకు, డ్రైవర్లకు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ ఎస్ఐలు భాగ్యలక్ష్మి రెడ్డి, రేవతి,డాక్టర్ వినుత మెడికల్ సూపరింటెంట్, దీప గౌడ్, అంబులెన్స్ డ్రైవర్లు, యువతకులు,స్థానికులు పాల్గొన్నారు.

# ఇండియన్ గ్యాస్ కొరకు తిప్పలు

- రాని ఓటీపీలతో తీరని పడికాపులు
- వందల సార్లు ఫోన్ చేసిన రాని ఓటీపీ
- వంట గ్యాస్ కొరకు పేద ప్రజల ఎదురు చూపులు
- ఓటీపీల కొరతను సాల్వ్ చేయండి

కొల్లాపూర్ ఏప్రిల్ 17 ప్రజా జ్యోతి: కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలలో ఇండియా గ్యాస్ కొరత నెలకొంది. ఆయా మండలాల లోని ప్రజలు గ్యాస్ బుకింగ్ కొరకు ఫోన్లో ప్రయత్నించగా ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఓటిపి మాత్రం రావడం లేదని ప్రజలు తీవ్రస్థాయిలో ఆరోపిస్తున్నారు. అసలు రాష్ట్రంలో గ్యాస్ సిలిండర్లు ఉన్నాయా.....? లేవా....? అనవ



సరంగా ఓటీపీ పేరుతో పేద ప్రజలను మభ్య పెడుతున్నారా అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫోన్ చేస్తున్న క్రమంలో ఓటీపీకీ బదులుగా 8 గంటల వరకు మీకు ఓటీపీ వస్తుందని మెసేజ్ కూడా వస్తుంది తీరా చూస్తే ఎనిమిది గంటలు వేచి చూసినా రావడలేదని భాదితులు చెప్తున్నారు. మరి కొందరికి 4 గంటల్లో ఓటీపీ వస్తుందని మెసేజ్ వస్తుంది కానీ రావడం లేదు. ఇలా అవే మెసేజ్ లు దాదాపుగా ఒక నెల రోజుల పాటు రావడం చర్చనీయాంశం. ఇక నెల నుంచి బుకింగ్ నంబర్స్ కి డయల్ చేయగా ఓటీపీ మాత్రం రావడం లేదని నిరాశతో ప్రజలు కట్టెల పొయ్యితో సర్దుకుపోతు న్నారు. కావున ఇప్పటికైనా ఓటీపీ వంట గ్యాస్ సమస్య పై ఓటీపీ కొరత గ్యాస్ సిలిండర్ల కొరత తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. తక్షణ చర్యలు తీసుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్ అయిపోవడానికి ఒక నెల ముందు నుంచే బుకింగ్ చేయడం ఓటిపి రావడం లేదు. ఇలా గ్యాస్ అయిపోయే వరకు ప్రయత్నించినప్పటికీ ఓటుకి మాత్రం రావడం లేదు. ఇప్పటికే బుకింగ్ చేయడానికి కొన్ని వందల సార్లకు పైగా ప్రయత్నించినా ఓటిపి మాత్రం రాలేదు. అనేక గ్రామం లో గ్యాస్ సిలిండర్ అవస్థలు తిప్పలు పడుకున్న బాధితులు ప్రభుత్వానికి ఆవేదనలు వ్యక్తం చేస్తున్నారు.

# సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేయాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల ఏప్రిల్ 17(ప్రజా జ్యోతి ప్రతినిధి): ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 20 నుండి 26 వరకు నిర్వహించే సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు.సంక్షేమ వారోత్సవాల నిర్వహణపై 21న,మాజీ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కౌన్సిలింగ్ కార్యక్రమాలు మండల స్థాయిలో చేపట్టాలని,22న,వసతి గృహాల్లో నీటి,విద్యుత్,సీసీ కెమెరాలు,మరమ్మతులు తదితర అవసరాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. 23న,పేరెంట్స్–టీచర్స్ సమావేశాలు





ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ సంక్షేమ శాఖల జిల్లా అధికారులు, వసతి గృహాల వార్డెన్లతో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో ఉన్న సమస్యలను వార్డెన్లతో చర్చించారు.వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్నచోట అదనపు సౌకర్యాల కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు.ఎమ్మెల్యే, ఎంపీ తదితర నిధులతో వసతి గృహాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.సంక్షేమ వారోత్సవాల షెడ్యూల్ ప్రకారం——ఈనెల 20న సంక్షేమ పథకాలపై జిల్లా స్థాయిలో అవగాహన సమావేశం నిర్వహించాలని, నిర్వహించాలని,24న, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్,ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాలని అన్నారు.25న,అచ్చంపేటలో విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం,గద్వాల కలెక్టరేట్‌లో సిబ్బందికి ఆహార భద్రత,ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించా లన్నారు. 26న,పెద్ద గ్రామ పంచాయతీల్లో 'బడిబాట' కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత,బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా,డిడబ్ల్యుఓ సునంద,ఇతర అధికారులు,వార్డెన్లు పాల్గొన్నారు.

# బ్యాంక్ గ్యారంటీ, అగ్రిమెంట్ తప్పనిసరి – మిల్లర్లకు కలెక్టర్ హెచ్చరిక

## నిబంధనలు పాటించని రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపు లేదు – ఇతర చోట దింపితే చర్యలు

వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి): జిల్లాలో రైస్ మిల్లులకు ధాన్యం



కేటాయింపులో కఠిన నిబంధనలు అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. రైస్ మిల్లులకు ధాన్యం ఇవ్వాలంటే తప్పనిసరిగా 10 శాతం బ్యాంక్ గ్యారంటీ సమర్పించడంతో పాటు అగ్రిమెంట్ చేసుకో వాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ నిబంధనలు పాటించని మిల్లులకు ధాన్యం కేటాయించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. శుక్రవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం కోట్లాది రూపాయల విలువైన వరి ధాన్యాన్ని మిల్లులకు అడ్వాన్స్‌గా ఇస్తున్న నేపథ్యంలో భద్రతా చర్యగా 10 శాతం బ్యాంక్ గ్యారంటీ తప్పనిసరి అని పేర్కొన్నారు. రబీ సీజన్‌లో వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో త్వరలోనే కొనుగోళ్లు ప్రారంభించి, బ్యాంక్ గ్యారంటీ ఇచ్చిన మిల్లులకు మాత్రమే ధాన్యం కేటాయి స్తామని తెలిపారు. ఇప్పటివరకు కొంతమంది మిల్లర్లు గ్యారంటీ ఇచ్చారని, వారు సమర్పించిన గ్యారంటీ మేరకే వడ్లు కేటాయించడం జరుగుతుందని వివరించారు. గతంలో డిఫాల్ట్ అయిన మిల్లర్లు తమ పెండింగ్ అంశాలను వెంటనే క్లియర్ చేసుకుని ధాన్యం తీసుకోవాలని సూచించారు. గత సీజన్‌కు సంబంధించిన పెండింగ్ బియ్యాన్ని తక్షణమే ఎఫ్‌సీఐకి అప్పగించాలని ఆదేశించారు. ప్రభుత్వం ఇందుకు కొంత గడువు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికీ బ్యాంక్ గ్యారంటీ ఇవ్వని మిల్లర్లు త్వరితగతిన గ్యారంటీతో పాటు అగ్రిమెంట్ పూర్తి చేసి ధాన్యం స్వీకరించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అలాగే కేటాయించిన మిల్లులోనే ధాన్యం దించుకోవాలని, ఇతర చోట దింపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్, జిల్లా సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, డీఎం సివిల్ సప్లై ఆంజనేయులు, మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, మిల్లర్లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలోకి బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెండ్యాల తిరుపతి

– మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో చేరిక



**ఎల్కతుర్తి ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి) :** ఎల్కతుర్తి మండలం జగన్నాధపూర్ గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ సీనియర్ నాయకుడు ( హుజరాబాద్ నవ్య చికెన్ సెంటర్ యజమాని) పెండ్యాల తిరుపతి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. శుక్రవారం హైదరాబాదులోని మినిస్టర్స్ క్వాటర్స్ లో జగన్నాధపూర్ గ్రామ శాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు ముష్కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ లో చేరగా కండువా కప్పి సాధారణంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజాపాలనలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు పెండ్యాల తిరుపతి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో భాగ స్వామినై పార్టీ విధివిధానాలకు కట్టుబడి పని చేస్తానని గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా తిరుపతి తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షం లో పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు కాగా ప్రజాపాలనకు ఆకర్షితులై కాంగ్రెస్ కు మద్దతుగా ప్రజలు పార్టీలోకి రావడం అభినందనీయమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ లు ఆరేపల్లి సమ్మయ్య, ఆరేపల్లి రమేష్, వార్డు మెంబర్లు ఆరేపల్లి సమ్మయ్య, ఆరెపల్లి చిరంజీవి, పెండ్యాల కుమారస్వామి, సీనియర్ నాయకుడు మాజీ వార్డు మెంబర్లు పెండ్యాల భాస్కర్, బండి కుమారస్వామి, పెండ్యాల సామెల్, పంజాల చేటారి గౌడ్, నాయ కులు కేంసారపు సంపత్, పంజాల స్వామి, యువజన నాయకులు పెండ్యాల రాజేష్, మాటూరి శ్రీనివాస్, గుండాల మధు, గూటం శ్రీనివాస్ రెడ్డి, పాల్గొన్నారు.

## రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

– ఎమ్మార్వో కార్యాలయం ముందు నిరసన తెలిపిన ఉద్యోగులు

– పెండింగ్ బకాయిలు, ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి


– జిపిఓ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కంది శిరీష రెడ్డి




**కమలాపూర్ ఏప్రిల్ 17 ప్రజాజ్యోతి :** రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ ఉద్యోగుల పెండింగ్లో ఉన్న దీర్ఘకాలిక సమస్య లను, న్యాయబద్ధమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించా లని డిమాండ్ చేస్తూ హనుమకొండ జిల్లా కమలాపూర్ ఎమ్మార్వో కార్యాలయం ముందు టీజీఈ జాక్ పిలుపు మేరకు రెవెన్యూ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మార్వో సురేష్ కుమార్ కు అనంతరం ఉద్యోగులు న్యాయబద్ధమైన డిమాండ్ల వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం జిపిఓల రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కంది శిరీష రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా వెట్టి చాకిరి చేస్తూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రెవెన్యూ ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్, దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆవేదన చెందారు. రెవెన్యూ ఉద్యోగుల న్యాయబద్ధమైన డిమాండ్లను తక్షణమే ప్రభుత్వం నెరవేర్చి ఇచ్చిన హామీలను నెరవేర్చుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో రెవెన్యూ ఉద్యోగులు సమ్మె బాట పడతారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అనిల్, మండల అధ్యక్షులు దండ్రే భద్రయ్య, మండల ప్రధాన కార్యదర్శి కదారి వేణు, రాధిక, రమేష్, అనూష, షమీం, రాజశేఖర్, రామకృష్ణ మండల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## పర్వతగిరిలో భయానక క్షుద్రపూజలు..

ఖాళీ ఇంటిని టార్గెట్ చేసిన దుండగులు..!



**పర్వతగిరి, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి) :** పర్వతగిరి అల్లూరి కాలనీ ఒక్కసారిగా భయంతో వణికిపోయింది. తుంగ రవిందర్ ఇంటి ముందు గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు నిర్వహించడం తీవ్ర కలకలం రేపింది. బతుకుదెరువు కోసం కుటుంబంతో కలిసి హైదరాబాద్లో ఉంటున్న రవిందర్ ఇంట్లో ఎవరూ లేరని ముందుగానే గమనించిన దుండగులు ప్లాన్ ప్రకారమే ఈ దారుణానికి పాల్పడ్డారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి ముందు నిమ్మకాయలు, కొబ్బరికాయలు, రక్తం చిందించినట్లుగా కనిపించే పదార్థాలు, అనుమానాస్పద పూజా సామగ్రి కనిపించడం ప్రజల్లో గుబులు రేపుతోంది. ఈ ఘటన చూసిన వారంతా భయంతో ఇళ్లలో నుంచే బయటకు రావడానికి కూడా వెనుకాడుతున్న పరిస్థితి నెలకొంది. ఇది సాధారణ విషయం కాదు ఎవరో ఉద్దేశపూర్వకంగా భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు అంటూ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు దీనికి వెనుక వ్యక్తిగత కక్షలు ఉన్నాయా? లేక మరేదైనా పెద్ద కుట్ర ఉందా? అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వెంటనే పోలీసులు రంగంలోకి దిగి నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## మిత్రుడి మరణంతో దిగ్భ్రాంతి...



**ఆత్మకూరు, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి) :** మిత్రుడి మరణంతో తీవ్ర దిగ్భ్రాంతి లోనైన స్నేహితులు బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. హనుమకొండ జిల్లా ఆత్మకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 1995-96 విద్యా సంవత్సరానికి చెందిన మిత్రబృందంలో విషాదం చోటుచేసుకుంది. అదే బ్యాచ్‌కు చెందిన బయ్య పైడి అనుకోకుండా మరణించడంతో తోటి స్నేహితులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలు, కలిసి గడిపిన రోజుల్ని గుర్తు చేసుకుంటూ మిత్రులు భావోద్వేగానికి లోనయ్యారు.

**కుటుంబానికి అండగా నిలిచిన చిన్న నాటి స్నేహితులు..**

ఈ దుర్ఘటన నేపథ్యంలో, "మన మిత్రుడి కుటుంబం కష్టాల్లో ఒంటరిగా ఉండకూడదు" అనే సంకల్పంతో అందరూ ఒక్కటయ్యారు. ఆత్మీయతతో, బాధ్యతతో ముందుకొచ్చిన మిత్రబృందం రూ.40,000లను సమీకరించి భయ్య పైడి కుటుంబానికి ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సహాయం ద్వారా కుటుంబానికి కొంతమేరకు ఉపశమనం కలిగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ.. "పాఠశాల రోజులలో ఏర్పడిన స్నేహం జీవితాంతం నిలుస్తుంది. ఇలాంటి క్లిష్ట సమయంలో ఒకరికి ఒకరు తోడుగా నిలవడం మన కర్తవ్యంగా భావించాము" అని తెలిపారు. స్థానికులు, గ్రామ పెద్దలు కూడా మిత్రబృందం చేసిన ఈ సహాయాన్ని ప్రశంసిస్తూ, ఇలాంటి సంఘటనలు సమాజంలో మానవత్వం ఇంకా బతికే ఉందనే విషయాన్ని గుర్తు చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. భయ్య పైడి మరణంతో వారి కుటుంబానికి తీరని లోటు ఏర్పడగా, మిత్రుల ఈ సహాయం వారికి కొంతమేర ధైర్యం ఇచ్చిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

## అక్రిడిటేషన్ కమిటీలో నల్లాల బుచ్చిరెడ్డి

• సీనియర్ జర్నలిస్టుకు గుర్తింపు • పాత్రికేయ వర్గాల హర్షం



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 17, (ప్రజా జ్యోతి) :** హనుమకొండ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడిగా సీనియర్ జర్నలిస్టు నల్లాల బుచ్చిరెడ్డి నియమితులయ్యారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన గుర్తింపులో కీలక పాత్ర పోషించే ఈ కమిటీలో ఆయనకు చోటు కల్పించడం విశేషంగా భావిస్తున్నారు. గత రెండు దశాబ్దాలకు పైగా పత్రికా రంగంలో సేవలందిస్తున్న బుచ్చిరెడ్డి అనుభవాన్ని ప్రభుత్వం గుర్తించింది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పనిచేసే ఈ కమిటీలో ఆయన సభ్యత్వం పొందడం పట్ల పాత్రికేయ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. 2004 నుండి ప్రింట్ మీడియాలో కొనసాగుతున్న ఆయన ప్రస్తుతం 'ప్రజా తంత్ర' దినపత్రికలో పనిచేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలపై లోతైన అవగాహన కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. టీయూడబ్ల్యూజే యూనియన్‌లో బాధ్యతలు నిర్వహించడంతో పాటు ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు) నేషనల్ కౌన్సిల్ సభ్యుడిగా రెండు పర్యాయాలు కొనసాగారు. జిల్లా స్థాయిలో పనిచేసే జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల మంజూరు, అర్హులైన జర్నలిస్టులను గుర్తించడం, ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం వంటి కీలక బాధ్యతలు ఈ కమిటీ పరిధిలో ఉంటాయి. అలాగే మీడియా ప్రతినిధుల హక్కులు, సంక్షేమం అంశాలపై కూడా కమిటీ నిర్ణయాలు తీసుకుంటుంది. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని బుచ్చిరెడ్డి తెలిపారు. ఆయన నియామకంపై ఎడిటర్లు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి నిలయాలు







క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్సీ పోచంపల్లి

**పరకాల, ఏప్రిల్ 17, (ప్రజాజ్యోతి) :** నడికూడ మండలం కౌకొండ గ్రామంలో పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌పీఎల్ (నడికూడ ప్రీమియర్ లీగ్) క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా రూ.30,000, రెండవ బహుమతిగా రూ.20,000తో పాటు మెడల్స్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంలో ఇలాంటి టోర్నమెంట్లు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. యువత క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతి జట్టుకు క్రికెట్ సామగ్రి అందజేస్తామని తెలిపారు. గ్రామాభివృద్ధికి తన ఎమ్మెల్సీ నిధుల నుంచి రూ.20 లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే పోచంపల్లి ఫౌండేషన్ ద్వారా గ్రామీణ మహిళలకు ఇప్పటికే కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్లు, ఆత్మకూర్, దామెర మండలాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరకాల, నడికూడ మండలాల్లో మరిన్ని గ్రామాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో నిరుద్యోగ యువత కోసం కౌకొండ గ్రామంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. తన స్వగ్రామం వరికోల్, నడికూడ మండల అభివృద్ధికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ కే. వాసుదేవ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ వై. సతీష్ రెడ్డి, కౌకొండ సర్పంచ్ ఓదెల శ్రీలత-భాస్కర్, పోచంపల్లి ఫౌండేషన్ కన్వీనర్ చందా కుమార్ స్వామి, బీఆర్ఎస్ నాయకులు మేడిపల్లి శోభన్ తదితరులు పాల్గొన్నారు.

## గోల్డెన్ అవర్‌లో ప్రాణాలను కాపాడవచ్చు

**– గోల్డెన్ సమయంలో సరైన చికిత్స అందించాలి – జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి) :** రోడ్డు ప్రమాదాల సమయంలో డ్రైవర్లు 'గోల్డెన్ అవర్' మీద పూర్తి అవగాహన కలిగి ఉండాలని, క్షతగాత్రులకు అవసరమైన చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పోలీస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న 'అరైవ్ - అలైవ్' కార్యక్రమం నేపథ్యంలో శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో "గోల్డెన్ అవర్" అంశంపై డ్రైవర్ లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు భయపడి అక్కడి నుంచి వెళ్లిపోకుండా, బాధితులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి, దగ్గరలోని ఆసుపత్రికి క్షతగాత్రులను తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో "గోల్డెన్ అవర్ ఎంతో కీలకమని, ఆ సమయంలో సరైన చికిత్స అందితే ప్రాణాలను కాపాడే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఏదైనా ప్రమాదాన్ని చూసిన వ్యక్తులు వెంటనే స్పందించి, ప్రాథమిక చికిత్స అందించడం ద్వారా ప్రాణాలను రక్షించవచ్చన్నారు. ప్రమాదం చేసి పారిపోవడం తీవ్రమైన నేరమని, భారతీయ న్యాయ సంహిత ప్రకారం కఠిన శిక్షలు అమల్లో ఉన్నాయన్నారు. హిట్ అండ్ రన్ కేసుల్లో 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడుతుందని, ప్రమాదం గమనించిన వారు అక్కడే ఉండి పోలీసులకు సమాచారం ఇవ్వడం ప్రతి పౌరుడి బాధ్యత అని వివరించారు. ప్రమాద బాధితులను ఆసుపత్రికి తరలించే వారికి ప్రభుత్వం అమలు చేస్తోన్న "రాహవీర్", "పీఎం రాహత్" పథకాల ద్వారా ప్రోత్సాహకాలను అందిస్తోందని, ప్రజలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాధితులను రక్షించడం ఒక మానవతా ధర్మమని, ఆ సమయంలో సహాయం చేయడం వల్ల మన ద్వారా దేవుడే ఆ పని చేయిస్తున్నాడని భావించాలన్నారు. అంబులెన్స్ సేవలను నిర్వహిస్తోన్న ఈఎంఆర్ఐ మార్గదర్శకాలను పాటిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో సమయానికి స్పందించటం ద్వారా ప్రాణాలను కాపాడాలని కలెక్టర్ కోరారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ ప్రజలు సురక్షితంగా ప్రయాణించి తమ గమ్యస్థానాలకు క్షేమంగా చేరుకోవాలన్న లక్ష్యంతో "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం జరిగే రోడ్డు ప్రమాదాల్లో అధిక సంఖ్యలో ప్రాణ నష్టం చోటు చేసుకుంటోందని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు నిర్లక్ష్యం వహించడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. అందువల్ల ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వెనుక కూర్చునే వ్యక్తులు కూడా ఖచ్చితంగా హెల్మెట్ వినియోగించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు "గోల్డెన్ అవర్" అత్యంత కీలకమని, ఆ సమయంలో చాకచక్యంగా స్పందించి, గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలను కాపాడవచ్చని వివరించారు. అదే విధంగా, బాధితులకు "పీఎం రాహత్ పథకం" ద్వారా ఆరోగ్య భద్రత కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం బయటకు వెళ్లిన ప్రతి వ్యక్తి సురక్షితంగా తిరిగి ఇంటికి చేరడం అని, మానవ తప్పిదాలను నివారించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, అవసర సమయంలో తోటి వారికి సహాయం చేయడానికి ముందుకు రావాలని కోరారు. తదనంతరం ఏసిపి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల సమయంలో "గోల్డెన్ అవర్" అత్యంత ప్రాముఖ్యత కలిగిన సమయమని తెలిపారు. ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఒక ప్రాణాన్ని కాపాడవచ్చని అన్నారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తులకు తక్షణమే సహాయం అందించి, అవసరమైతే సీపీఆర్ చేయడం ద్వారా వారి ప్రాణాలను నిలబెట్టవచ్చని వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రాథమిక చికిత్స గురించి అవగాహన కలిగి ఉండటం అవసరమని పేర్కొన్నారు. అదే విధంగా పాఠశాల బస్సుల భద్రతపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. అంతకుముందు రోడ్ ప్రమాదాలు జరిగినప్పుడు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్న క్షతగాత్రులను గోల్డెన్ అవర్ లో సీపీఆర్ చేసే విధానాన్ని వైద్యాధికారులు రవి కృష్ణ, సరిత, అలాగే 108 సేవలపై 108 ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ రాము, అదే విధంగా రాహవీర్ పథకం, పీఎం రాహత్ పథకాలపై ఐఆర్‌పీడీ డీఎం (ఎన్ఐసి) టీ. శివ ప్రసాద్ డ్రైవర్లకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చి, పూర్తి అవగాహన కల్పించారు. అనంతరం లారీ, ఆటో అసోసియేషన్ సభ్యులు, పాఠశాల బస్, ఆటో, లారీ డ్రైవర్లకు లైసెన్స్ లను అందించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ పండరి చేతన్, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి మల్లిఖార్జున రావు, ఆర్టీఏ మెంబర్ అభి గౌడ్, వైద్యాధికారులు, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, ఆటో, లారీ, బస్ డ్రైవర్ లు, తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రంను ప్రారంభించిన కౌన్సిలర్ పూర్ణ చారి



**పరకాల, ఏప్రిల్ 17, (ప్రజాజ్యోతి) :** పరకాల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 9వ వార్డులోని బస్టాండ్ సర్కిల్లో శుక్రవారం స్థానిక కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి చలివేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రాలు చాలా ఉపయోగపడతాయని, ఈ అవకాశాన్ని అందరు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, కౌన్సిలర్లు బండి శ్రీధర్, కొయ్యడ శ్రీనివాస్, కుక్కల విజయ్ కుమార్, ఆకుల లావణ్య శ్రీధర్, సుధమల రమేష్, మున్సిపాలిటీ సిబ్బంది వెంకట్ రెడ్డి, జవన్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి అధికారుల నిర్వాకం..

ఊరు ఒకటి బోర్డు మరొకటి..




**ఆత్మకూరు, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి) :** జాతీయ రహదారి అధికారుల నిర్వాహకంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి 163 పనులు జరుగుతున్న క్రమంలో రహదారిపై ఏర్పాటు చేసిన సూచిక బోర్డు ప్రయాణికులను గందరగోళానికి గురిచేస్తుంది. ఒక గ్రామ పరిధిలో ఇంకో గ్రామం పేరుతో సూచిక బోర్డు లను ఏర్పాటు చేశారు. ఆత్మకూరు మండలంలోని కటాక్షపూర్ గ్రామ ప్రారంభంలో ఏర్పాటు చేయాల్సిన బోర్డు కటాక్షపూర్ కు బదులు మమ్మద్ గౌస్ పల్లి అని ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సూచిక బోర్డు తో పాటు బస్టాండ్ కూడా ఏర్పాటు చేయాలని స్థానికులు చెబుతున్నారు.

## బీజేపీ రైతు వ్యతిరేక విధానాలకు వెంటనే వెనక్కి తీసుకోవాలి

– తెలంగాణ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈనెల 18న చలో హైదరాబాద్


– యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మోడెం ఎల్లాగౌడ్



**నర్సంపేట ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి) :** రైతు అంటే దేశానికి వెన్నెముక కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత 10 ఏళ్లుగా రైతు నడ్డి విరిచే చట్టాలే చేస్తోంది. దీనికి నిరసనగానే తెలంగాణ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో 10రోజులు కిసాన్ న్యాయ్ సత్యాగ్రహ దీక్ష వరంగల్ జిల్లా పోచమ్మ మైదానంలో చేయడంజరిగింది. ముగింపు దీక్ష ఈ నెల 18న, హైదరాబాద్ ఇందిర పార్క్ లో ధర్నా చౌక్ లో పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుంది కావున ఈ కార్యక్రమానికి యువజన కాంగ్రెస్ నాయకుల పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మోడెం ఎల్లాగౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకొని నల్ల వ్యవసాయ చట్టాలను పూర్తిగా రద్దు చేసి రైతుల ఉసురు పోసుకుంటున్న రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దుచేసి ఇండో-యూఎస్ వ్యవసాయ ఒప్పందాలు అమెరికా నుంచి గోధుమలు, పప్పుధాన్యాలు దిగుమతి చేసుకుని మన రైతు పండించిన పంటకు ధర లేకుండా చేస్తున్నా. ఈ దేశద్రోహ ఒప్పందాలు వెంటనే రద్దుచేయాలనీ. రైతు పొలంలో విత్తనం నాటితే పంట పండుతుంది. రైతు గుండెల్లో ఆగ్రహం నాటితే ప్రభుత్వాలే కూలుతాయనీ మోడీ ప్రభుత్వం దిగొచ్చి రైతుతో చర్చలు జరపాలీ. లేదంటే దేశవ్యాప్తంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమం చేపడతాం మని డిమాండ్ చేశారు.

## పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి..

– మాజీ సర్పంచ్ కోల్లూరి వెంకటేశ్వర్లు



**పర్వతగిరి, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి) :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం దౌలత్ నగర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కోల్లురి వెంకటేశ్వర్లు మండల కేంద్రములో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సర్పంచ్ పిరియడ్ లో చేసిన అభివృద్ధి పనుల సంబంధించిన పెండింగ్ బిల్లులు నేటి వరకు రాకపోవడంతో ఆర్థికంగ సామాజికంగా సమాజంలో తిరుగలేకపోతున్నామని వడ్డీలు తేచ్చి మరి చేసిన పనులకు కక్ష సాధింపు చర్యల్లో భాగంగా బిల్లులు చెల్లించకపోవడంతో సరికాదని అన్నారు. చేసిన పనులకు యంబిలు, పాలకవర్గం చేసిన తీర్మానాలు, దసరా పండుగలకు నిర్వహించిన పనులకు పెండింగ్ బిల్లుల తో సహా ఉన్న చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రసుతం ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీకి నిధులు మంజూరు అయ్యాయి అని అధికారులు పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా ఉన్నత అధికారులు ప్రత్యేక చోరవ తీసుకొని పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించే విధంగా కృషి చేయాలని కోరారు.

# రైస్ మిల్లర్లు ధాన్యం అన్ లోడింగ్ వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

నల్గొండ ఏప్రిల్ 17(ప్రజా జ్యోతి ప్రతినిధి): రబీ ధాన్యం అన్ లోడ్ ను రైస్ మిల్లర్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం అయన తన ఛాంబర్ లో జిల్లాలోని రైస్ మిల్లర్లు, ధాన్యం సేకరణ కు సంబంధించిన సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలకు రబీ ధాన్యం పెద్ద ఎత్తున వస్తున్నందున రైస్ మిల్లర్లు జాప్యం చేయకుండా మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెనువెంటనే అన్లోడ్ చేసుకోవాలని ఆదేశించారు. వివిధ కారణాలతో మిల్లుల వద్ద లారీలు అన్లోడ్ కాకుండా నిలిచిపో కూడదన్నారు. రబీ ధాన్యం సేకరణలో మిల్లర్లు రైతుల పక్షాన నిలబడి వారికున్న పూర్తి సామర్థ్యంతో వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లు అన్లోడ్ చేసుకోవాలని కోరారు. జిల్లాలో ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలలో సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉందని, మరో 15 రోజుల్లో మరో 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున మిల్లర్లు పూర్తి సామర్థ్యంతో పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. తాలు, లారీలు తదితర కారణాలతో ఎలాంటి కొర్రీలు విధించకుండా ధాన్యాన్ని దించుకోవాలని, ఈ విషయంలో రైతులకు పూర్తి సహకారం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి నోటిఫైడ్ లారీలను ఏర్పాటు చేయమని పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ను ఆదేశించారు. ఈ విషయంలో మిల్లర్లతో పాటు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సహకరించాలన్నారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు పంపించేందుకు పూర్తిస్థాయిలో లారీలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మిల్లర్ల సమస్యలను సానుకూలంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, బ్యాంకు గ్యారెంటీ, మిల్లర్ అగ్రిమెంటు సమర్పించని మిల్లర్లు తక్షణమే ఇవ్వాలని ఆదేశించారు. ధాన్యం సేకరణలో ఎట్టి పరిస్థితులలో రైతులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించవద్దని ఆయన తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు, వర్ష సూచనలను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాలకు వచ్చిన దాన్యం తడవకుండా, పాడవకుండా ముందుగానే కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ధాన్యం లోడింగ్ లో ఒకే వెరైటీని మాత్రమే లోడ్ చేసి పంపించాలని, "ఏ" గ్రేడ్ ధాన్యంతో కామన్ వెరైటీలు కలిపి పంపించకూడదని చెప్పారు. ఇప్పటివరకు ఆయా మిల్లుల వారిగా దిగుమతి చేసుకున్న ధాన్యం వివరాలపై నివేదిక ఇవ్వాలని జిల్లా పౌర సరఫరాల అధికారిని కలెక్టర్ ఆదేశించారు. యుద్ధ ప్రాతిపదికన వారం రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ధాన్యం అన్లోడింగ్ వేగవంతం చేయాలని చెప్పారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, రబీ ధాన్యం సేకరణ పై మిల్లర్లకు పలు సూచనలు చేశారు. పౌరసరఫరాల జిల్లా అధికారులు వెంకటేశం, రామ్ పతి నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, డి సి ఓ పత్యా నాయక్ ,జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.





# బంగారం సాక్షిగా సామాన్యుడిపై బ్యాంకుల బాదుడు!

**పేదవాడి అవసరాన్ని వ్యాపారంగా మార్చుకున్న ప్రైవేట్ సంస్థలు**

**₹2.50 లక్షల దాటితే ఐటీ రిటర్న్స్ ఉండాల్సిందే..**

**ప్రభుత్వ బ్యాంకుల కొర్రీలతో బెంబేలెత్తుతున్న గ్రామీణ జనం**

**అప్పు పుట్టక ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల చెంతకు పరుగు**

**మధ్యతరగతిపై ఆంక్షల కత్తి, ఆపదలో అండగా నిలవని బ్యాంకులు**

**పేద, మధ్యతరగతి వర్గాలకు తప్పని అన్యాయం,ప్రైవేట్ దోపిడీకి రెడ్ కార్పెట్?**

**చేతిలో పసిడి ఉన్నా,బ్యాంకు మెట్లెక్కాలంటేనే బెంబేలెత్తుతున్న గ్రామీణ జనం!**

కోదాడ రూరల్,ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి): ప్రభుత్వ బ్యాంకుల్లో బంగారం తాకట్టు పెట్టిన వినియోగదారుల పరిస్థితి ఇప్పుడు 'ముందు నుయ్యి.. వెనుక గొయ్యి'లా మారింది. కొత్తగా అప్పు పుట్టకపోవడమే ఒక సమస్య అయితే, ఇప్పటికే ఉన్న అప్పును విడిపించుకుందామన్నా, లేదా వడ్డీ కట్టి గడువు పెంచుకుందామన్నా బ్యాంకులు పెడుతున్న కొర్రీలు సామాన్యుడికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సామాన్యుడి గోడు వినేవారే కరువయ్యారు."అపత్కాల బాంధవుడు.. ఆపదలో ఆదుకునే ప్రాణస్నేహితుడు.." ఇవన్నీ ఒకప్పుడు, బంగారం గురించి విన్న మాటలు. కానీ ఇప్పుడు ప్రభుత్వ బ్యాంకుల నిబంధనలు చూస్తుంటే, ఆ పసిడి సామాన్యుడి పాలిట 'శత్రువు'గా మారుతోంది. బ్యాంకు మెట్లెక్కిన పేదవాడిని ఆదుకోవాల్సిన బ్యాంకర్లు, అర్థం పర్థం లేని ఆదాయ పన్ను నిబంధనలతో వారిని బయటకు గెంటివేస్తున్నారు. పరోక్షంగా సామాన్యుడిని ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల కోరల్లోకి నెట్టేస్తూ, ప్రభుత్వ బ్యాంకులు బడా కార్పొరేట్ సంస్థలకు తొత్తులుగా మారుతున్నాయా? అన్న అనుమానం కలగక మానదు.కష్టమొచ్చినా, కన్నీళ్లొచ్చినా సామాన్యుడికి తక్షణమే గుర్తుకు వచ్చేది ఇంట్లోని పసిడి నగలే. తన రక్తాన్ని చెమటగా మార్చి, రూపాయి రూపాయి కూడబెట్టి చేయించుకున్న ఆ నగలే తన కష్టాలను తీరుస్తాయని సామాన్యుడు నమ్ముతాడు. కానీ, ఇప్పుడు ఆ నమ్మకంపై ప్రభుత్వ బ్యాంకులు నీళ్లు చల్లుతున్నాయి. "బంగారం మీది,భరోసా మాది" అని గొప్పలు చెప్పుకునే బ్యాంకులు, తీరా రుణం కోసం వెళ్తే సామాన్యుడికి అర్థం కాని కొత్త నిబంధనలను తెరపైకి తెస్తున్నాయి. ముఖ్యంగా రెండున్నర లక్షల రూపాయల రుణ పరిమితి నిబంధన ఇప్పుడు మధ్యతరగతి ప్రజల పాలిట మరణశాసనంగా మారుతోంది.

### కొంపముంచుతున్న ₹2.50 లక్షల నిబంధన!

గతంలో బంగారం విలువను బట్టి, తాకట్టు పెట్టిన వెంటనే రుణం ఇచ్చే ప్రభుత్వ బ్యాంకులు ఇప్పుడు నిబంధనలను కఠినతరం చేశాయి. ఒక వ్యక్తికి ₹2.50 లక్షల లోపు గోల్డ్ లోన్ కావాలంటే ఎటువంటి ఇబ్బంది లేదు. కానీ, ఒక్క రూపాయి ఆ పరిమితి దాటినా సరే,కచ్చితంగా ఐటీ రిటర్న్స్ ఉండాలని బ్యాంకర్లు భీష్మిస్తున్నారు. ఐటీ పత్రాలు ఉంటేనే ₹5 లక్షల వరకు లోన్ ఇస్తామని, లేదంటే కుదరదని ఖరాకండిగా చెబుతున్నారు. అసలు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం చేసుకునే రైతుకు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి ఈ 'ఐటీ' అంటే ఏంటో కూడా తెలియదు. అలాంటి వారిని ఈ నిబంధన పేరుతో బ్యాంకులు దూరం పెడుతున్నాయి.

### గుడిబండగా మారిన పసిడి భాగ్యం!

ఆపదలో అండగా ఉండాల్సిన బంగారం, ఇప్పుడు నిబంధనల ఉచ్చులో చిక్కుకుంది. అత్యవసర వైద్య ఖర్చులు వచ్చినా, పిల్లల పెళ్లిళ్లు చేయాలన్నా, వ్యవసాయ పెట్టుబడి కావాలన్నా ఇప్పుడు లక్షల్లో డబ్బు అవసరమవుతోంది. చేతిలో తగినంత బంగారం ఉన్నప్పటికీ, ఈ ఐటీ నిబంధన వల్ల ప్రభుత్వ బ్యాంకులు రుణం ఇచ్చేందుకు నిరాకరిస్తున్నాయి. దీంతో మధ్యతరగతి వ్యక్తులు తమ అవసరాల కోసం దొడ్డిదారిన ప్రైవేట్ సంస్థలను ఆశ్రయించాల్సి వస్తోంది.




### ప్రైవేట్ సంస్థల పంట.. సామాన్యుడికి వడ్డీ మంట!

ప్రభుత్వ బ్యాంకుల కొర్రీలు ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలకు, వడ్డీ వ్యాపారులకు వరంగా మారాయి.ప్రభుత్వ బ్యాంకుల్లో బంగారం తాకట్టు పెట్టిన వినియోగదారుల పరిస్థితి ఇప్పుడు 'ముందు నుయ్యి.. వెనుక గొయ్యి'లా మారింది. కొత్తగా అప్పు పుట్టకపోవడమే ఒక సమస్య అయితే, ఇప్పటికే ఉన్న అప్పును విడిపించుకుందామన్నా, లేదా వడ్డీ కట్టి గడువు పెంచుకుందామన్నా బ్యాంకులు పెడుతున్న కొర్రీలు సామాన్యుడికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సామాన్యుడి గోడు వినేవారే కరువయ్యారు.

### విడిపించుకోవాలన్నా.. ఐటీ కొర్రీలే!

సాధారణంగా గడువులోపు అప్పు తీర్చలేని రైతులకు లేదా మధ్యతరగతి వారికి బ్యాంకులు కొంత వెసులుబాటు ఇవ్వాలి. కానీ ఇప్పుడు పరిస్థితి తిరగబడింది.గడువు దాటిన ఒక్క రోజు నుండే 'పెనాల్టీ వడ్డీ' పేరుతో అదనపు భారాన్ని మోపుతున్నారు.పాత వడ్డీ రేటుకు, ప్రస్తుత రేటుకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పెనాల్టీగా మారుస్తూ రుణగ్రహీతలను నిలువునా దోచుకుంటున్నారు.ఇదే అన్నిటికంటే దారుణమైన విషయం. ఒక వ్యక్తి తన పాత రుణాన్ని చెల్లించి, అదే బంగారాన్ని మళ్ళీ తాకట్టు పెట్టి అప్పు తీసుకోవాలనుకుంటే బ్యాంకులు కొత్త నిబంధనలు చూపిస్తున్నాయి. ₹3 లక్షలు ఉందనుకుందాం,ఇప్పుడు దానిని విడిపించి మళ్ళీ పెట్టాలంటే, ఐటీ రిటర్న్స్ ఉంటేనే ₹3 లక్షలు ఇస్తామని, లేదంటే కేవలం ₹2.25 లక్షలే ఇస్తామని బ్యాంకర్లు చెబుతున్నారు.ఈ లెక్కన మిగిలిన ₹75 వేలు సామాన్యుడు ఎక్కడి నుండి తేవాలి? చేతిలో పైసా లేకనే కదా మళ్ళీ తాకట్టు పెట్టేది! ఈ వింత నిబంధన వల్ల పాత అప్పులు తీరక, కొత్త అప్పు పుట్టక వేలాది మంది ప్రజలు తమ బంగారాన్ని బ్యాంకుల్లోనే వదిలేయాల్సిన పరిస్థితి వస్తోంది.

### అడ్డగోలు వడ్డీలు:

ప్రభుత్వ బ్యాంకుల్లో 8% నుండి 9% వడ్డీ ఉంటే, ప్రైవేట్ సంస్థలు 18% నుండి 24% వరకు వడ్డీ వసూలు చేస్తున్నాయి.ప్రాసెసింగ్ ఫీజులు, నోటీసుల పేరుతో సామాన్యుల రక్తాన్ని జుర్రుకుంటున్నాయి.వడ్డీ కట్టడం భారమై చివరకు పసిడిని వేలంలో పోగొట్టుకుని చాలా కుటుంబాలు వీధిన పడుతున్నాయి.ప్రభుత్వ బ్యాంకుల ఈ మొండి వైఖరి వల్ల సామాన్యులు తమ బంగారాన్ని కాపాడుకోవడానికి ఊరిలో ఉన్న వడ్డీ వ్యాపారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. అక్కడ 3 నుంచి 5 రూపాయల వడ్డీకి అప్పు తెచ్చి బ్యాంకులో కడుతున్నారు. తీరా బ్యాంకులో బంగారం విడిపించాక, మళ్ళీ అక్కడ అప్పు పుట్టకపోవడంతో ఆ నగలను వడ్డీ వ్యాపారికే అప్పగించాల్సి వస్తోంది. అంటే, ప్రభుత్వ బ్యాంకులు పరోక్షంగా పేదవాడి బంగారాన్ని ప్రైవేట్ వ్యక్తుల పరం చేస్తున్నాయనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

### ప్రభుత్వానిది నిర్లక్ష్యమా.. కుట్రనా?

డిజిటల్ లావాదేవీలు, పారదర్శకత పేరుతో ప్రభుత్వం తెస్తున్న ఇటువంటి నిబంధనలు క్షేత్రస్థాయిలో సామాన్యుడికి శాపంగా మారుతున్నాయి. కోట్లాది రూపాయలు ఎగ్గొట్టే బడా బాబులకు రెడ్ కార్పెట్ వేసే బ్యాంకులు, గ్రాము బంగారం తాకట్టు పెట్టి అప్పు తీసుకునే పేదవాడిని మాత్రం ఈ నిబంధనల పేరుతో వేధిస్తున్నాయి. ఇది చాలా దారుణమైన విషయమని, మధ్యతరగతి ప్రజల ఆర్థిక మూలాలను దెబ్బతీయడమేనని ఆర్థిక నిపుణులు సైతం అభిప్రాయపడుతున్నారు

### తక్షణమే నిబంధనలు సడలించాలి!

కనీసం ₹5 లక్షల రూపాయల వరకు ఎటువంటి ఐటీ రిటర్న్స్ అవసరం లేకుండా, కేవలం బంగారు నాణ్యత ఆధారంగా రుణం ఇచ్చేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలి. గ్రామీణ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ "గోల్డ్ లోన్ ఆంక్షలను" వెంటనే ఎత్తివేయాలి. లేనిపక్షంలో సామాన్యుడి ఆగ్రహానికి ప్రభుత్వాలు బలికాక తప్పదు. ఆపదలో ఆదుకునే బంగారం గుడిబండగా మారకముందే పాలకులు స్పందించాలి.అసలు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం చేసుకునే రైతుకు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే కూలీలకు ఈ 'ఐటీ' అంటే ఏంటో కూడా తెలియదు. అత్యవసరంగా లక్షల్లో డబ్బు అవసరమైనపుడు, తమ సొంత బంగారాన్ని తాకట్టు పెట్టి అప్పు తీసుకోవాలనుకునే వారిని ఈ నిబంధన పేరుతో బ్యాంకులు దూరం పెడుతున్నాయి.

### 'ముత్తూట్' వైపు పరుగులు,తప్పని వడ్డీ మంట

ప్రభుత్వ బ్యాంకుల ఈ నిరంకుశ నిర్ణయాలు సామాన్యులను దొడ్డిదారిన ప్రైవేట్ సంస్థల వైపు నెట్టేస్తున్నాయి. ముత్తూట్ ఫైనాన్స్ వంటి ప్రైవేట్ గోల్డ్ లోన్ సంస్థలు ఇదే అదునుగా తమ వ్యాపారాన్ని విస్తరించుకుంటున్నాయి. "అన్‌లిమిటెడ్ గోల్డ్ లోన్స్" ఆకర్షణ: ముత్తూట్ ఫైనాన్స్ ప్రకటనలో ప్రధానంగా "అన్‌లిమిటెడ్ గోల్డ్ లోన్స్" పరిమితి లేని బంగారు రుణాలు ఇస్తామని నమ్మిస్తున్నాయి.

ఐటీ పత్రాలు అవసరం లేదు,ఇక్కడ రుణం పొందడానికి ఎటువంటి ఆదాయ ధృవీకరణ పత్రాలు అవసరం లేదని, కేవలం బంగారం విలువ ఆధారంగానే ₹50 లక్షలు, ₹1 కోటి, అంతకంటే ఎక్కువ కూడా రుణం ఇస్తామని వాగ్దానం చేస్తున్నాయి.

ప్రభుత్వ బ్యాంకుల్లో వడ్డీ తక్కువగా ఉదాహరణకు 8%-9% ఉంటుందని ఆశపడే సామాన్యులకు ఈ ఆంక్షలు శాపంగా మారాయి. బ్యాంకుల్లో రుణం దొరక్కపోవడంతో, గ్రామీణ ప్రజలు తమ ఆపదను తీర్చుకోవడానికి తప్పనిసరి పరిస్థితుల్లో ముత్తూట్ లాంటి సంస్థలను ఆశ్రయిస్తున్నారు. కానీ ఇక్కడ వడ్డీ రేట్లు ఉదాహరణకు 18%-24% ప్రభుత్వ బ్యాంకుల కంటే చాలా ఎక్కువగా ఉంటాయి. ప్రాసెసింగ్ ఫీజులు, చక్రవడ్డీలతో జనాన్ని ముంచేస్తున్న ఈ సంస్థల తీరు సామాన్యుడికి గోరుచుట్టుపై రోకలిపోటులా మారుతోంది.ప్రభుత్వ బ్యాంకులు సామాన్యుడికి తలుపులు మూసేయడంతో, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు పండుగ చేసుకుంటున్నాయి. "ఐటీ వద్దు, శాలరీ స్లిప్పులు వద్దు,రండి బాబూ రండి.. కోట్లు అప్పు ఇస్తాం" అంటూ అన్‌లిమిటెడ్ ఆఫర్లతో ఊరిస్తున్నాయి.

### మధ్యతరగతికి తప్పని దగా.. పాలకులు స్పందించాలి!

పిల్లల చదువుల ఫీజులు కట్టాలన్నా, అత్యవసరంగా ఆస్పత్రి ఖర్చులు వచ్చినా మధ్యతరగతి మనిషికి గుర్తొచ్చేది ఇంట్లోని బంగారమే. కానీ బ్యాంకుల తాజా వైఖరి చూస్తుంటే "పేదవాడు అప్పు తీసుకోవద్దు" అన్నట్లుగా ఉందని జనం మండిపడుతున్నారు. లక్షల్లో ఆదాయం చూపించే వాళ్లకే బ్యాంకులు రెడ్ కార్పెట్ వేస్తున్నాయని, రెక్కాడితే గానీ డొక్కాడని సామాన్యుడిని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్న ఇటువంటి నిబంధనలను వెంటనే తొలగించాలని, కనీసం ₹5 లక్షల వరకు ఐటీ నిబంధన లేకుండా గోల్డ్ లోన్ ఇచ్చేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

లేనిపక్షంలో సామాన్యుడి ఆగ్రహానికి పాలకులు బలికాక తప్పదు. ఆపదలో ఆదుకునే బంగారం.. గుడిబండగా మారకముందే పాలకులు స్పందించాలి.

## రోడ్డు భద్రతపై జాగ్రత్తలు తప్పనిసరి

### ఎంఈఓ చత్రు నాయక్

గరిడేపల్లి, ఏప్రిల్ 17(ప్రజా జ్యోతి): రోడ్డు భద్రతపై జాగ్రత్తలు పాటించాలని అని ఎంఈఓ చత్రు నాయక్ అన్నారు.శుక్రవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్ లో రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ఎన్ఫోర్స్మెంట్,బ్లాక్ స్పాట్ పరిశీలన కార్యక్రమం




నిర్వహించారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి పానుగోతు చత్రు నాయక్ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అప్రమత్తం గా ఉండాలని సూచించారు. మోటార్ సైకిల్ నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వినియోగం ప్రమాదకరమని, దీనివల్ల జరిగే ప్రమాదాలు కుటుంబాలకు తీవ్ర నష్టం కలిగిస్తాయని హెచ్చరించారు తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని ప్రత్యేకంగా సూచించారు.రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకర మని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు జి.సాయిలు,ఖాజా మోహినిద్దీన్,ఉపాధ్యాయుని, ఉపాధ్యాయురాల్లు,సీఆర్పీలు రాతికింది రామకృష్ణ,అమరవరపు అశోక్ కుమార్,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్ఎఫ్‌బీఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### ఎంపీడీవో సరోజ

గరిడేపల్లి,ఏప్రిల్ 17(ప్రజా జ్యోతి): గ్రామీణ మరియు పట్టణ పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్ఎఫ్‌బీఎస్ (నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్) పథకాన్ని అర్హులైన వారు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని గరిడేపల్లి ఎంపీడీవో సరోజ సూచించారు. కుటుంబంలో ప్రధాన ఉపాధి పొందే వ్యక్తి ఆకస్మికంగా మరణించినప్పుడు ఆ కుటుంబం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందని,అటువంటి పరిస్థితుల్లో ఈ పథకం ద్వారా ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు.ఈ పథకం కింద అర్హులైన కుటుంబాలకు రూ.20,000 ఒకసారి ఆర్థిక సహాయం అందజేస్తారు. సాధారణంగా 18 నుండి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన కుటుంబ ప్రధానుడి మరణం సంభవించినప్పుడు ఈ పథకం వర్తిస్తుంది.బీపీఎల్ (పేదరిక రేఖ కింద) కుటుంబాలు ఈ పథకానికి అర్హులు. గ్రామ స్థాయి సిబ్బంది ప్రజలకు ఈ పథకం గురించి అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి కుటుంబానికి సహాయం అందేలా కృషి చేయాలని సూచించారు. ఈ పథకానికి డెత్,ఫ్యామిలీ మెంబర్, ఇన్కమ్,ఆధార్ కార్డు,బ్యాంకు అకౌంట్,పాస్ ఫోటో,రెసిడెన్షియల్ సర్టిఫికెట్ తో ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## విదేశాల్లో ఐటి గ్రాడ్యుయేషన్ గ్రామానికి గర్వకారణం


గరిడేపల్లి, ఏప్రిల్ 17(ప్రజా జ్యోతి): గరిడేపల్లి మండలం కీతవారి గూడెం గ్రామానికి చెందిన బీసీ ముద్దుబిడ్డ దీపక్ కుమార్ గౌడ్ విదేశాల్లో ఉన్నత విద్యను పూర్తి చేసి తన గ్రామానికి గర్వకారణంగా నిలిచాడు.ఆస్ట్రేలియాలోని ప్రముఖ ఫ్లిండర్ యూనివర్సిటీలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) గ్రాడ్యుయేషన్ను విజయవంతంగా



పూర్తిచేసిన సందర్భంగా శుక్రవారం గిరిజనులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గరిడేపల్లి ప్రెస్ క్లబ్ చైర్మన్,బీసీ నాయకులు కొండ సైదులు గౌడ్ కుమారుడైన దీపక్ సాధించిన ఈ ఘనత గ్రామీణ యువతకు మార్గదర్శకంగా నిలుస్తుందని గిరిజన నాయకులు పేర్కొన్నారు.సాధారణ కుటుంబం నుంచి వచ్చి విదేశీ విశ్వవిద్యాలయంలో చదువును పూర్తి చేయడం గొప్ప విషయమని,కృషి, పట్టుదల ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని వారు అన్నారు. బిఆర్ఎస్ నాయకులు,హుజూర్నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుగులోతు నీలా హేమ్లా నాయక్ మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులు కూడా ప్రపంచస్థాయిలో ప్రతిభ చాటగలరని దీపక్ నిరూపించాడని, అతని విజయం మరెందరో యువతకు ప్రేరణగా నిలవాలి అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ ఎస్టీ మండల అధ్యక్షులు సందీప్ నాయక్, నరేందర్,బాలు,శ్రీను నాయక్,మాజీ విద్యా కమిటీ చైర్మన్ కోటయ్య,నాగరాజు తదితరులు పాల్గొని దీపక్ కుమార్ గౌడ్‌ను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## ఉపాధి హామీ కూలీల లకు ఓ ఆర్ఎస్ ప్యాకెట్లు అందజేత

నార్కట్ పల్లి, ఏప్రిల్ 17 ( ప్రజా జ్యోతి): మండుటెండలో ఉపాధి హామీ పనులు నిర్వర్తిస్తున్న కూలీల ఆరోగ్య దృష్ట్యా అక్కినపల్లి గ్రామ సర్పంచ్ నవ్య రాజు యాదవ్ ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, మంచినీటి వసతులు కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు అక్కినపల్లి సత్యనారాయణ, మిడిదొడ్డి



లింగస్వామి, శివశంకర్, మంద నరేష్, పాల్గొన్నారు.

## ఎమ్మార్వోకు మెమొరండం అందించిన ఉద్యోగుల సంఘం అధ్యక్షులు భార్గవ్




ఇందల్వాయి ( ప్రజా జ్యోతి) ఏప్రిల్.17 ఇందల్వాయి మండల కేంద్రంలోని టీ జి ఈ జే ఏ సి రాష్ట్ర కమిటీ తీర్మానం మేరకు ఈరోజు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నాలుగు ప్రధాన సమస్యల్ని పరిష్కరించాలని నల్ల బ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేసి తహసిల్దార్ ఇందల్వాయి గారికి మెమోరండం అందజేయడం జరిగింది. టి జి ఈ జె ఏ సి ఇందల్వాయి మండలంలో పి ఆర్ టి యు ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు కే భార్గవ ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్ గార్లు నాలుగు ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేయడం జరిగింది పి ఆర్ సి కమిషన్ రిపోర్ట్ తెప్పించి జూన్ రెండు లోపు అమలు చేయాలి పెండింగ్ బిల్లుల బకాయిలను వెంటనే విడుదల చేయాలి ఉద్యోగుల పెన్షనర్ల ఆరోగ్య కార్డులు వెంటనే మంజూరు చేయాలి సిపిఎస్ రద్దుచేసి దాని స్థానంలో పాత పెన్షన్ స్కీం ను పునరుద్ధరణచేయాలి ఈ నిరసన కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులు, మండల పరిషత్ ఉద్యోగులు ,ఆరోగ్య వ్యవసాయ శాఖ ఉద్యోగులు ,తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షులు గంగా ప్రసాద్ గారు,శంకర్ గారు, బి సి టి యు సంగం మండల అధ్యక్షులు గంగా మోహన్ గారు ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రతినిధి విజయ్ కుమార్ గారు ఇంకా పిఆర్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సాయి కృష్ణ గారు, కర్లమ్ రాజుగారు, రాజేశ్వర రావు ,రూప మేడం ,విజయరామ్ గారు ,వంశీకృష్ణ గారు, శ్యామలశ్రీ మేడం గారు, స్రవంతి గారు ఇంకా మండలంలో పనిచేసే ఉపాధ్యాయులు ఉద్యోగులు పాల్గొన్నారు .

## సికిల్ సెల్ ఎనీమియా పై అవగాహన కార్యక్రమం

### నిర్వహించిన వైద్యులు శంకర్



ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) ఏప్రిల్. 17 ఇందల్వాయి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రము ఇందల్వాయి పరిధిలో గల మాక్లూర్ తండాలోని ఏకలవ్య మోడల్ స్కూల్లో విద్యార్థులకు సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ ఆదేశానుసారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా అనేదిహొకఒక వంశపారంపర్య రక్త రుగ్మత. ఇది ఒక జన్యు మార్పు (ఎమో జన్యువు) వలన సంభవిస్తుంది, దీనివల్ల ఎర్ర రక్త కణాలు గట్టిగా, జిగురుగా మరియు నెలవంక ఆకారంలో తయారవుతాయి. ఈ కణాలు రక్త ప్రవాహాన్ని అడ్డుకోవడం వల్ల దీర్ఘకాలిక నొప్పి, తీవ్రమైన రక్తహీనత, ఇన్ఫెక్షన్లు మరియు అవయవాల నష్టం కలుగుతాయి. దీనికి జీవితాంతం నిర్వహణ అవసరం అయినప్పటికీ, స్టెమ్ సెల్ మార్పిడి వంటి చికిత్సలతో కొన్నిసార్లు దీనిని నయం చేయవచ్చు. ఇది ఒక వారసత్వ రుగ్మత. ఇది హెచ్ బి ఎస్ అనే అసాధారణ జన్యువు వల్ల సంభవిస్తుంది. ఈ జన్యువు లోపభూయిష్టమైన హిమోగ్లోబిన్‌ను ఉత్పత్తి చేస్తుంది, దీనివల్ల ఎర్ర రక్త కణాలు గట్టిపడి "కొడవలి" ఆకారంలోకి మారతాయి. ఎర్ర రక్త కణాల కొరత కారణంగా అలసట, పాలిపోయిన చర్మం మరియు నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వాపు:చేతులు మరియు పాదాలు నొప్పిగా వాపు రావడం (డాక్టిలైటిస్), ఇది తరచుగా శిశువులలో కనిపించే తొలి లక్షణం. తరచుగా వచ్చే ఇన్ఫెక్షన్లు:ప్లీహము యొక్క పనితీరు దెబ్బతినడం వల్ల ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం పెరుగుతుంది. లి కామెర్లు:చర్మం లేదా కనుగుడ్ల తెల్లటి భాగం పసుపు రంగులోకి మారడం. అనేవి సికిల్ సెల్ ఎనిమియా యొక్క లక్షణాలు.హొవిద్యార్థులకు రక్త పరీక్షలు చేసి రక్తహీనతగల విద్యార్థులను గుర్తించడానికి తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ నిజామాబాద్ కు రక్తపు నమూనాలను పంపించడం జరిగింది ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సంతోష్ శుక్ల, వైస్ ప్రిన్సిపాల్ సునీత,నర్సింగ్ ఆఫీసర్ కల్పన, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, ఆనంద్,పాల్గొన్నారు.

## తెలంగాణ ఏర్పాటుపై బీజేపీ ఎంపీ వ్యాఖ్యల పట్ల మైలారం సుధాకర్ ఆగ్రహం



కమ్మర్‌పల్లి (ప్రజాజ్యోతి ) ఏప్రిల్ - 17 : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్థాన్‌తో పోలుస్తూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎం పి టి సి మైలారం సుధాకర్ తీవ్రంగా మండిపడ్డారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ బీజేపీ తీరును తప్పుబట్టారు. తెలంగాణ అస్తిత్వం కోసం, హక్కుల కోసం రాజ్యాంగబద్ధంగా చేసిన పోరాటాన్ని దేశ విభజనతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టుకుందని ఆయన విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో వేలాది మంది త్యాగాల ఫలితంగా సిద్ధించిన తెలంగాణపై బీజేపీ మొదటి నుంచి విషం కక్కుతూనే ఉందని ఆరోపించారు. తేజస్వి సూర్య తన అభ్యంతరకర వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సుధాకర్ డిమాండ్ చేశారు. పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తుంటే.. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఖండించకుండా మౌనంగా ఉండడం సిగ్గుచేటని ఆయన ధ్వజమెత్తారు.

## 1000 సంవత్సరాల చరిత్ర కలిగిన కోడూరు ఆంజనేయస్వామి క్షేత్రం

### - పూర్వం పల్లవులు, కాకతీయ రాజులు దర్శించిన పుణ్యక్షేత్రం - చరిత్ర, భక్తి, పోరాటాలతో వెలుగొందిన పవిత్ర స్థలం




కామారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 17. (ప్రజాజ్యోతి) మన తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి పట్టణం కోరికలు తీర్చే పరమపావన క్షేత్ర సముదాయంతో విరాజిల్లుతున్నదని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ పట్టణం అభివృద్ధి చెందకముందు "కోడూరువారి పల్లె"గా ప్రసిద్ధి పొందింది. ఆనాటి పల్లవులు, కాకతీయులు, తదనంతరం దోమకొండ సంస్థానాధీశుల పరిపాలనలో ప్రజల సంక్షేమం, గ్రామ రక్షణ, సస్యశ్యామల జీవనానికి అనేక దేవాలయాలు స్థాపించబడ్డాయి. ఆ క్రమంలోనే కోడూరు ఆంజనేయస్వామి ఆలయం ఏర్పడింది. అప్పట్లో సంస్థానాధీశులు గుర్రపు బగ్గీలపై సంచరిస్తూ ప్రజల రక్షణ కోసం కిష్టమ్మ గుడి సమీపంలో పెద్ద రాగిచెట్టు కింద ఆంజనేయస్వామి విగ్రహాన్ని శిల్పులచే చెక్కించి ప్రతిష్టించారు. ఆస్థాన పండితులచే నిత్య పూజలు నిర్వహించేవారు. కాలక్రమేణ ఎండ, వానల నుండి రక్షణ కోసం చిన్న గుడి నిర్మించబడింది. తరతరాలుగా "కర్పూర మంగళ హారతి"తో స్వామికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించడం ఆనవాయితీగా కొనసాగింది. ఈ హారతి గీతం నేటికీ తెలుగు భక్తుల నోట నిత్యం వినిపిస్తుండటం విశేషం. ఆనాటి పాలకులు స్వామి అనుగ్రహంతో వర్షాలు కురిసి, చెరువులు నిండిపడి, పంటలు పండే సస్యశ్యామల కాలాన్ని ఆస్వాదించారని చెబుతారు. ప్రజల సంక్షేమాన్ని కాపాడుతూ శాంతియుత పరిపాలన కొనసాగింది. కాలక్రమంలో సంస్థానాలు అంతరించగా "కామినేనిపురం"గా ఉన్న పేరు "కామారెడ్డి"గా మారింది. అయితే కాలంతో పాటు కోడూరువారి పల్లె మరుగున పడినా, భక్తి మాత్రం తగ్గలేదు. నేటికీ శ్రీరామనవమి, హనుమాన్ జయంతి సందర్భంగా పట్టణం నుండి సుమారు ఒక కిలోమీటరు దూరంలో ఉన్న ఈ ఆలయానికి భక్తులు భారీగా కవాతులు, ర్యాలీలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. అయితే కొంతకాలంగా ఆలయ పరిసరాల్లో ఆక్రమణలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో హిందూ యువతలో చైతన్యం పెరిగి, క్షేత్ర పరిరక్షణ కోసం పోరాటం ప్రారంభమైంది. అనేక కష్టాలు, గాయాలు, జైలుశిక్షలు ఎదుర్కొన్నప్పటికీ, స్వామి సేవగా భావించి యువత వెనుకడుగు వేయలేదు. తదనంతరం పరిస్థితులు సద్దుమణిగాయి. గత కొన్నేళ్లుగా ఆలయ అభివృద్ధి కోసం ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. కిష్టమ్మ గుడి జీర్ణోద్ధరణకు చర్యలు చేపట్టగా, అదే స్ఫూర్తితో యువత ముందుకు వచ్చింది. యజ్ఞం పవన్ శర్మ ఆధ్వర్యంలో గోదావరి జలాలతో భద్రాద్రి సీతారామ పాదుకా సంచార యాత్ర నిర్వహించి, కోడూరు ఆంజనేయస్వామి గుడి ప్రాంగణాన్ని శుద్ధి చేశారు. ఇప్పటికైనా ఈ ప్రాచీన క్షేత్రాన్ని అభివృద్ధి చేసి భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించాలని, భారీ దేవాలయ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ పవిత్ర స్థలం మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే కాలంతో పాటు కోడూరువారి పల్లె మరుగున పడినా, భక్తి మాత్రం తగ్గలేదు. నేటికీ శ్రీరామనవమి, హనుమాన్ జయంతి సందర్భంగా పట్టణం నుండి సుమారు ఒక కిలోమీటరు దూరంలో ఉన్న ఈ ఆలయానికి భక్తులు భారీగా కవాతులు, ర్యాలీలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. అయితే కొంతకాలంగా ఆలయ పరిసరాల్లో ఆక్రమణలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో హిందూ యువతలో చైతన్యం పెరిగి, క్షేత్ర పరిరక్షణ కోసం పోరాటం ప్రారంభమైంది. అనేక కష్టాలు, గాయాలు, జైలుశిక్షలు ఎదుర్కొన్నప్పటికీ, స్వామి సేవగా భావించి యువత వెనుకడుగు వేయలేదు. తదనంతరం పరిస్థితులు సద్దుమణిగాయి. గత కొన్నేళ్లుగా ఆలయ అభివృద్ధి కోసం ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. కిష్టమ్మ గుడి జీర్ణోద్ధరణకు చర్యలు చేపట్టగా, అదే స్ఫూర్తితో యువత ముందుకు వచ్చింది. యజ్ఞం పవన్ శర్మ ఆధ్వర్యంలో గోదావరి జలాలతో భద్రాద్రి సీతారామ పాదుకా సంచార యాత్ర నిర్వహించి, కోడూరు ఆంజనేయస్వామి గుడి ప్రాంగణాన్ని శుద్ధి చేశారు. ఇప్పటికైనా ఈ ప్రాచీన క్షేత్రాన్ని అభివృద్ధి చేసి భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించాలని, భారీ దేవాలయ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ పవిత్ర స్థలం మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## నిజామాబాద్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌ను సన్మానించిన సిరికొండ సర్పంచ్ల ఫోరం



నిజాంబాద్ రూరల్ ( ప్రజా జ్యోతి ) ఏప్రిల్ 17: మన ఊరు మన భద్రత మరియు బాధ్యత కార్యక్రమంలో భాగంగా ఈరోజు నిజామాబాద్ కమిషనర్ ఆఫ్ పోలీస్ గారి ఆధ్వర్యంలో నిజాంబాద్ లో జిల్లా సర్పంచుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా సిపి సాయి చైతన్య గారు మాట్లాడుతూ డ్రాక్స్ రోడ్డు భద్రత గంజాయి వల్ల కలిగే నష్టాల గురించి వివరించడం జరిగింది అలాగే యువత జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని హెల్మెట్ ధరించాలని సీట్ బెల్ట్ ధరించి డ్రైవింగ్ చేయాలని యువకులు ఎటువంటి మారకద్రవ్యాలకు అలవాటు పడకూడదు అని ఈ బాధ్యత అన్ని గ్రామాల సర్పంచులపై ఉన్నదని సిపి సాయి చైతన్య గారు అన్ని గ్రామాల సర్పంచ్లకు సూచనలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో సిరికొండ మండలం సర్పంచులు ఫోరం ఆధ్వర్యంలో సి పి గారిని ఘనంగా సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు

## గౌడ జనాభాను తగ్గించి చూపిస్తున్నారంటూ జై గౌడ ఉద్యమం ఆరోపణలు

### - అసమగ్ర సర్వే రిపోర్ట్‌పై మండిపడ్డ జై గౌడ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు - రంగోళ్ళ మురళి గౌడ్

కామారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 17. (ప్రజాజ్యోతి) రాష్ట్రంలో గౌడ కుల జనాభాను కావాలనే తగ్గించి చూపిస్తూ రాజకీయంగా అణగదొక్కే ప్రయత్నం జరుగుతోందని జై గౌడ ఉద్యమం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రంగోళ్ళ మురళి గౌడ్ ఆరోపించారు. ఇటీవల విడుదలైన సమగ్ర సర్వే నివేదికలో గౌడ కుటుంబాల సంఖ్యను వాస్తవానికి విరుద్ధంగా చూపించారని ఆయన విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు ఉన్న గౌడ సమాజాన్ని కేవలం తక్కువ సంఖ్యలో ఉన్నట్లు పేర్కొనడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందన్నారు.గ్రామాలు, మండలాలు, జిల్లాల్లో ఎక్కడ చూసినా గౌడల సంఖ్య గణనీయంగా కనిపిస్తుందని, అలాంటి పరిస్థితిలో వారిని మైనార్టీ వర్గంలా చూపించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. గౌడ సమాజం బలపడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, బహుజన వర్గాల గొంతు మరింత బలంగా వినిపిస్తుందని పేర్కొన్నారు. అందుకే ఆ వర్గాన్ని బలహీనపర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. చరిత్రను విస్మరించొద్దని వ్యాఖ్య గౌడ సమాజం చరిత్రాత్మకంగా పోరాట స్ఫూర్తి కలిగిన వర్గమని మురళి గౌడ్ అన్నారు. మహారాజ్ పాపన్న గౌడ్ కాలం నుంచే దోపిడీ శక్తులకు వ్యతిరేకంగా గౌడలు పోరాడారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యోద్యమం, రజాకారుల వ్యతిరేక పోరాటం, తెలంగాణ ఉద్యమాలు, సామాజిక న్యాయ పోరాటాల్లో గౌడల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆలయాలు, విగ్రహాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, ఉద్యమాలకు గౌడ సమాజం ఆర్థికంగా అండగా నిలిచిందని చెప్పారు. కష్టపడి సంపాదించిన సంపదను సమాజ హితానికి వినియోగించిన వర్గం గౌడలేనని పేర్కొన్నారు.

**ఆర్థిక మూలాలపై దాడి చేశారంటూ ఆరోపణ**

గౌడల సంప్రదాయ వృత్తి అయిన కల్లు, తాటి, ఈత చెట్ల ఆధారిత జీవన విధానాన్ని గత దశాబ్దాలుగా దెబ్బతీసే ప్రయత్నాలు జరిగాయని ఆయన ఆరోపించారు. వృత్తిని బలహీనపరిస్తే సమాజాన్ని బలహీనపరచవచ్చనే ఉద్దేశంతో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. ప్రమాదాలకు గురైన గౌడ కార్మికులకు సరైన పరిహారం ఇవ్వడం లేదని, యువతకు విద్యా, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు కూడా పరిమితమవుతున్నాయని అన్నారు.గ్రామాల వారీగా నివేదిక విడుదల చేయాలని డిమాండ్జనాభా లెక్కలపై అనుమానాలు నివృత్తి చేయాలంటే గ్రామాల వారీగా, మండలాల వారీగా పూర్తి నివేదిక విడుదల చేయాలని మురళి గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయి గణాంకాలు మాత్రమే వెల్లడించడం ద్వారా వాస్తవాలను దాచిపెడుతున్నారని ఆరోపించారు. ప్రతి గ్రామంలో ఏ కులం ఎంత జనాభా కలిగి ఉందో స్పష్టంగా ప్రకటిస్తే అసలు నిజాలు బయటపడతాయని అన్నారు.బహుజన వర్గాలు ఐక్యంగా ఉండాలన్న పిలుపుఈరోజు గౌడ సమాజంపై జరిగిన అన్యాయం రేపు ఇతర బీసీ, బహుజన వర్గాలపై కూడా జరగవచ్చని ఆయన హెచ్చరించారు. యాదవ్, ముదిరాజ్, పద్మశాలి, మున్నూరు కాపు తదితర వర్గాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జనాభా ఆధారిత హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం కోసం అన్ని బహుజన వర్గాలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. గౌడ సమాజాన్ని తక్కువ చేసి చూపించే ప్రతి ప్రయత్నాన్ని తిప్పికొడతామని, నిజమైన గణాంకాలు వెలుగులోకి వచ్చే వరకు ఉద్యమం కొనసాగిస్తామని మురళి గౌడ్ స్పష్టం చేశారు.



## రమేష్ గౌడ్ పై ఆరోపణలు సరికాదు

### - అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడం సిగ్గు చేటు
### - ఎస్సీ, ఎస్టీ, బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదు



కామారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 17. (ప్రజాజ్యోతి) జిల్లా కేంద్రంలోని ఆర్. అండ్. బి. అతిథి గృహం కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం పరిధి పేట గ్రామ అంబేద్కర్ బహుజన నాయకులు శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజన బిడ్డ అయిన పల్లె రమేష్ గౌడ్ పై కొంతమంది తమ స్వార్థం కోసం ఆరోపణలు చేస్తూ చేసిన ఫిర్యాదును వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే దళిత, బహుజనుల ఆగ్రహానికి గురికాక తప్పదని దళిత, బహుజన సంఘాల నాయకులు హెచ్చరించారు.పాల్వంచ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పల్లె రమేష్ గౌడ్ ప్రజా సేవకుడు అని, అతడు దళితులను అవమానించే వ్యక్తి కాదన్నారు. కులమతాలకు అతీతంగా అందరితో కలసి ఉండే వ్యక్తి అని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తిపై కొంతమంది తప్పుడు ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. ఆయనపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే వారు గ్రామంలో మాట్లాడుకోవాలి తప్ప ఇలా కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. తనతో రాజకీయ విభేదాలు ఉంటే గ్రామంలో చూసుకోవాలే తప్ప కొంత మందిని ఉసిగొలిపి ఇలా కేసులు పెట్టించడం తగదని ఫరీద్ పేట గ్రామ సర్పంచ్ నర్సింహ రెడ్డి కి సూచించారు. గ్రామంలో ప్రతీ యేటా జరిగే సీతారాముల కళ్యాణోత్సవంలో దళితులను ప్రత్యేకంగా పిలిచి బట్టలు పెట్టి పూజలో కూర్చుండబెట్టిన రమేష్ గౌడ్ పైన దళితులను కించపరిచేలా మాట్లాడాడని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. గ్రామంలో అభివృద్ధి ఎవరి ద్వారా చేశారో గ్రామంలో నిరూపించుకోవాలని గుర్తు చేశారు ఇప్పటికైనా రమేష్ గౌడ్ పై చేసిన ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని లేనియెడల తమ ఇండ్లను ముట్టడిస్తామని డిమాండ్ చేశారు. అనంతరం ఏఎస్పి చైతన్య రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సమావేశంలో దళిత, బహుజన సంఘాల నాయకులు దేవుళ్ళ రాములు, బైండ్ల రామస్వామి, విష్ణు, లక్ష్మీనర్సు, భూమవ్వ, కొంగల లక్ష్మి, రాజమణి, వరలక్ష్మి, తగిరంచ రాజిరెడ్డి, పెరుమాండ్ల నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## నాగిరెడ్డిపేట నూతన తహశీల్దార్‌గా బిక్షపతి

### - బాధ్యతలు స్వీకరణ



నాగిరెడ్డిపేట్,ఏప్రిల్17(ప్రజాజ్యోతి): నాగిరెడ్డిపేట నూతన తహశీల్దారుగా బిక్షపతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.గతంలో ఇక్కడ పని చేసిన తహసీల్దార్ శ్రీనివాస్ రావు ఏసీబీ వలలో చిక్కడంతో,డిప్యూటీ తహశీల్దార్ రాజేశ్వర్ కు ఇంచార్జి తహసీల్దార్ గా బాధ్యతలు అప్పగించారు. పెద్ద కొడపగల్ మండలంలో తహశీల్దార్ గా విధులు నిర్వహించిన బిక్షపతిని జిల్లా ఉన్నతాధికారులు నాగిరెడ్డిపేట్ కు బదిలీ చేయడంతో శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఆయన తహశీల్దార్ గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలను పారదర్శకంగా వేగవంతంగా అందించే దిశగా కృషి చేస్తానని,రెవెన్యూ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది నూతన తహశీల్దార్‌కు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కామారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో చలివేంద్రం ప్రారంభం



కామారెడ్డి, రూరల్ ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి): వేసవి కాలంలో ప్రజలకు చల్లని తాగునీరు అందించాలనే లక్ష్యంతో కామారెడ్డి మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) హెప్సిబా. రాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో హెప్సిబా రాణి మాట్లాడుతూ, రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కార్యాలయానికి వచ్చే ప్రజలు, ప్రయాణికులు, కార్మికులు దాహార్తిని తీర్చుకునేందుకు చలివేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే కార్యాలయ పరిధిలోకి వచ్చే ప్రతి ఒక్కరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని, పరిశుభ్రతను కాపాడుతూ చలివేంద్రాన్ని సంరక్షించాలని కోరారు. వేసవి కాలంలో తాగునీటి అవసరం అధికంగా ఉండటంతో నిరంతరం నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏం పి ఓ త్రివేద్ సూపరింటెండెంట్ ప్రమోద్, సీనియర్ అసిస్టెంట్ రమేష్, జూనియర్ అసిస్టెంట్ లలిత, టైపిస్టు వేణు, మండల పరిషత్ సిబ్బంది, కార్యాలయ ఉద్యోగులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం హాజరైన వారందరికీ చల్లని తాగునీరు పంపిణీ చేశారు.

## బోధన్‌లో పోలీసు అక్క మహిళ హాస్టల్లో పోలీసుల భాస



ప్రజా జ్యోతి బోధన్ ఏప్రిల్ 17.. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని జిల్లా సిపి ఆదేశాల మేరకు బస కార్యక్రమం మొదలైంది మహిళ పోలీసులు యాదమ్మ లావణ్య రాకస్పేట్ లో బాలికల హాస్టల్ను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల సమస్య అడిగి తెలుసుకున్న సిబ్బంది ధైర్యం నింపేందుకు హాస్టల్లోనే మహిళా పోలీసులు బస చేస్తున్నారు ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని బోధన్ ఎస్హెచ్ఓ వెంకట్ నారాయణ తెలిపారు

# అక్షర హాస్పిటల్‌పై చర్యలు తీసుకోవాలి

– సీపీఎం పార్టీ డిమాండ్



**కొమురవెల్లి, ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి):-** చేర్యాల పట్టణంలోని అక్షర హాస్పిటల్ యజమాని డాక్టర్ ఎడవల్లి సంతోష్ కుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని హాస్పిటల్‌ను సీజ్ చేయాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి తాడూరి రవీందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కొమురవెల్లిలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేర్యాల ప్రాంతంలో అక్షర హాస్పిటల్ నిర్వహణలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మెడికల్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న డాక్టర్ సంతోష్ కుమార్, స్థానిక కాంగ్రెస్ నాయకుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి అండదండలతో ఆర్ఎంపీ డాక్టర్లను వేధిస్తూ, వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో తనపై వచ్చిన ఆరోపణలు నిరూపితమైతే హాస్పిటల్‌ను మున్సిపాలిటీకి స్వచ్ఛందంగా అప్పగిస్తానని డాక్టర్ సంతోష్ కుమార్ ప్రకటించారని గుర్తుచేశారు. ప్రస్తుతం అవినీతి ఆరోపణలు బయటపడిన నేపథ్యంలో ఆయన తన మాట నిలబెట్టుకుని అక్షర హాస్పిటల్‌ను మున్సిపాలిటీకి రాసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి, ఆరుట్ల రవీందర్, సున్నం యాదగిరి, కానుగుల రాజు, చింతల అజయ్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నకోడూరులో ఉచిత కంటి వైద్య శిబిరం





**చిన్నకోడూరు, ఎప్రిల్17,(ప్రజా జ్యోతి):-** గ్రామీణ ప్రాంతాల్లో కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని వంగ రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని రెడ్డి సంఘంలో కుండె తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని రాజేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూనిపుణులైన వైద్యులు పాల్గొని, ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆపరేషన్ అవసరమైన వారికి తదుపరి చికిత్స కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై శిబిరాన్ని వినియోగించుకున్నారు.

# రైతు మార్కెట్‌ను పున:ప్రారంభిస్తాం

**చిన్నకోడూరు, ఎప్రిల్16,(ప్రజాజ్యోతి):-** మండల కేంద్రంలో మూతపడిన రైతుబజార్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్ మీసం మహేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా బజార్‌లో ఉన్న సదుపాయాలు, సమస్యల గురించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు మరియు వినియోగదారులకు ఉపయోగపడే విధంగా రైతు బజార్‌ను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. బజార్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేసి త్వరలోనే రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. రైతులు నేరుగా తమ పంటలను విక్రయించుకునే అక్షయపాత్ర రైతు బజార్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారం ద్వారా

# ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యం

– సీడీపీఓ ఎల్లయ్య









**దౌల్తాబాద్, ఏప్రిల్ 17: (ప్రజా జ్యోతి)** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పోషకాహారం ఎంతో కీలకమని దుబ్బాక సీడీపీఓ ఎల్లయ్య పేర్కొన్నారు. దౌల్తాబాద్, ఇందుప్రియాల్ సెక్టార్ పరిధిలోని దౌల్తాబాద్, తిర్మలాపుర్ అంగన్వాడీ కేంద్రాల్లో సోమవారం పోషణ మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గర్భంలో శిశువు ఎదుగుదల నుంచి జననం అనంతరం పిల్లల పెరుగుదల వరకు సరైన పోషకాహారం అందించడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సమతుల్య ఆహారం అందించడం ఎంత ముఖ్యమో వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సంక్షేమం కోసం పలు ప్రతిష్టాత్మక పథకాలను అమలు చేస్తున్నాయని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా రోజువారీ కూలీల కుటుంబాల్లో పోషణపై తగిన శ్రద్ధ లేకపోవడం గమనించినట్లు పేర్కొన్నారు. అలాంటి కుటుంబాలను ప్రత్యేకంగా గుర్తించి పోషణ మాసోత్సవాల ద్వారా అవగాహన కల్పిస్తూ, అవసరమైన పోషకాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమాజంలో పోషణపై చైతన్యం పెంపొందించడం ద్వారా ఆరోగ్యవంతమైన తరాలను నిర్మించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు ముచ్చమర్రి అనురాధ రమేష్, బండారు లాలు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు గిరిజా, రేణుకా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పడాల మల్లేశం, ఉప సర్పంచ్ ఆది బాలకృష్ణ,రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ సుదర్శన్, క్రై జిల్లా కోఆర్డినేటర్ రాజలింగం, బ్లాక్ కోఆర్డినేటర్ భాస్కర్,అంగన్వాడీ సిబ్బంది, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## 43 మంది లబ్ధిదారులకు

# ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

– నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి





**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) ఏప్రిల్ 17:** వెల్దుర్తి మండలం ఉప్పు లింగాపూర్ గ్రామంలో ఇంద్రమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 43 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి చేతుల మీదుగా మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజలకు, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంద్రమ్మ ఇళ్లను అందించేందుకు కృషి చేస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచ్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రైతు సమస్యలు పట్టని వ్యవసాయ శాఖ

– అధికారుల నిర్లక్ష్యంతో పథకాల అమలుకు బ్రేక్ – కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న అన్నదాతలు



**దౌల్తాబాద్, ఏప్రిల్ 17: (ప్రజా జ్యోతి)** మండల వ్యవసాయ శాఖ పనితీరు రోజురోజుకూ దిగజారిపోతుండడంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తిర్మలాపూర్, ముబారాస్‌పూర్ క్లస్టర్లలో వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో లేకపోవడం, సమస్యలను పట్టించుకోకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు "నిమ్మకు నీరెత్తినట్టు" వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పీఎం కిసాన్, రైతు భరోసా, రైతు బీమా వంటి ప్రభుత్వ పథకాల అమలు సక్రమంగా జరగకపోవడంతో అర్హులైన రైతులు లబ్ధి కోల్పోతున్న పరిస్థితి నెలకొంది.

**ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధికారిక వివరాలు**

వ్యవసాయ అధికారుల వద్ద ఉండాల్సిన అధికారిక ఫోన్ నంబర్లు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉండటం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. దీనివల్ల రైతుల వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ ఖాతాల వివరాలు భద్రత కోల్పోయే ప్రమాదం ఉందని పలువురు అంటున్నారు.

**అప్డేట్ కాని పీఎం కిసాన్ జాబితాలు**

గత రెండేళ్లుగా పీఎం కిసాన్ లబ్ధిదారుల జాబితా అప్డేట్ చేయకపోవడం వల్ల కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు నమోదు కావడం లేదని రైతులు వాపోతున్నారు. ఎన్నిసార్లు కార్యాలయానికి వెళ్లినా స్పందన లేదని చెబుతున్నారు.

**రైతు వేదికల వద్దే జీవ ఎరువులు**

ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయాల్సిన జీవ ఎరువులు, వేప నూనె రైతులకు అందకుండానే రైతు వేదికల వద్ద నిల్వ ఉండటం విమర్శలకు తావిస్తోంది. సీజన్ ముగిసేలోపు పంపిణీ చేయకపోతే పంటలకు నష్టం తప్పదని రైతులు అంటున్నారు.

**రైతుల ఆవేదన**

ముబారాస్‌పూర్ గ్రామానికి చెందిన రైతు కోటి రాజు మాట్లాడుతూ.."పీఎం కిసాన్ కోసం సంవత్సరం క్రితం దరఖాస్తు చేసుకున్నాను. నాలుగు సార్లు పత్రాలు సమర్పించినా నా పేరు జాబితాలో చేర్చలేదు. అధికారులపై చర్యలు తీసుకోవాలి" అని కోరారు. అదే గ్రామానికి చెందిన బొక్క శ్యామల మాట్లాడుతూ,"నేను దివ్యాంగురాలిని. రెండేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నాను. పలుమార్లు పత్రాలు ఇచ్చినా ఇప్పటికీ డబ్బులు రావడం లేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఉన**వ్యవసాయ శాఖలో నెలకొన్న నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రైతులకు సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# మాదిగ హక్కుల కోసం మరో పోరాటం

– మాదిగలకు 11% రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే – ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు యాదగిరి మాదిగ



**తూప్రాన్ (ప్రజాజ్యోతి) ఏప్రిల్ 17:** తూప్రాన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా కమిటీ మాదిగలకు జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్ల శాతం పెంచాలని గట్టిగా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు, సీనియర్ నాయకుడు యాదగిరి మాదిగ మాట్లాడుతూ,ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు కేవలం 9% కేటాయించడం సరైంది కాదని, కనీసం 11% రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ గతం నుంచే మాదిగల జనాభా అధికంగా ఉందని, అందుకు తగినట్లుగా రిజర్వేషన్ శాతం పెంచాలని ఉద్యమం నడిపిస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కుల గణన సర్వేలో కూడా మాదిగల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తేలిందని, ఆ ఆధారంగా రిజర్వేషన్లు పెంచాలని మళ్లీ ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు. జనాభా ప్రకారం రిజర్వేషన్ కేటాయించకపోతే మాదిగ సమాజానికి తీవ్రమైన అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి 11% రిజర్వేషన్ అమలు చేయాలని, లేని పక్షంలో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మరింత తీవ్ర ఉద్యమానికి దిగాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షులు ఉషన్న గళ్ళ మురళీ మాదిగ, మాదిగ జిల్లా అధికార ప్రతినిధి తాడపు మహేందర్ మాదిగ, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు పల్లె పాటి మాధవి మాదిగ, ఢిల్లీ పుష్ప మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సర్గాల నర్సింలు మాదిగ, శివొళ్ల భాస్కర్ మాదిగ, కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు, జిల్లా ప్రతినిధులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖర్గేపై అవమాన వ్యాఖ్యలు సహించం

– హిమాంత్ బీస్వా శర్మ పై కేసు నమోదు చేయాలంటూ ఫిర్యాదు

– అంబేద్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి మన్నే భాను, మాల మహానాడు నాయకుడు శ్యామల అశోక్



**తూప్రాన్ (ప్రజాజ్యోతి) ఏప్రిల్ 17:** జాతీయ దళిత నాయకుడు, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పై అస్సాం ముఖ్యమంత్రి హిమాంత్ బీస్వా శర్మ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా, దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి మన్నే భాను, మాల మహానాడు నాయకుడు శ్యామల అశోక్ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలో విభేదాలను రెచ్చగొట్టే ప్రమాదం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో హిమాంత్ బీస్వా శర్మపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైకు ఫిర్యాదు చేయడంతో పాటు, తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. దళితుల గౌరవాన్ని కాపాడే వరకు పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.

# ఘనంగా శ్రీ లలిత సేవా సమితి 29వ వార్షికోత్సవం

– అంగరంగ వైభవంగా 1325వ చండీయాగం

– దేవి ఉపాసకులు, సహస్రాదిక చండీయాగ నిర్వాహకులు సోమయాజుల రవీంద్ర శర్మ







**తూప్రాన్ (ప్రజాజ్యోతి) ఏప్రిల్ 17 :** తూప్రాన్ మండలం వెంకటాపురం గ్రామంలోని శ్రీ లలిత పరమేశ్వరి దేవాలయం భక్తుల రద్దీతో ఆధ్యాత్మిక క్షేత్రంగా కళకళలాడింది. శ్రీ లలిత సేవా సమితి 29వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆలయంలో అంగరంగ వైభవంగా 1325వ చండీయాగం ఘనంగా నిర్వహించారు. దేవి ఉపాసకులు, సహస్రాదిక చండీయాగ నిర్వాహకులు సోమయాజుల రవీంద్ర శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాయాగంలో వేద మంత్రోచ్చారణల మధ్య విశేష పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. యాగశాల అంతా భక్తి, శాంతి, పవిత్రతతో నిండిపోయింది. స్థానికంగా విశేషమైన ఈ శ్రీ లలిత పరమేశ్వరి అమ్మవారిని నమ్ముకున్న వారికి కొంగు బంగారంగా కాపాడుతుందని, సంతానం కోసం ప్రార్థించిన వారికి సంతానం ప్రసాదిస్తుందని భక్తుల నమ్మకం. అమ్మవారిని దర్శించుకున్న ప్రతి భక్తుడికి ఆశీర్వాదాలు లభించి, వారి కోరికలు నెరవేరుతాయని విశ్వాసంతో భక్తులు తరలివస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తి, ప్రత్యేక పూజలు, హోమాలు, మంగళహారతులతో కార్యక్రమం భక్తిశ్రద్ధలతో విజయవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో పండితులు సాయిరాం శర్మ తో పాటు ఇతర పండితులు పాల్గొన్నారు.

# అర్హులకే 'ఇందిరమ్మ' ఇళ్లు: ఎమ్మెల్యే



**నర్సాపూర్, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి)** నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. నియోజకవర్గానికి ప్రభుత్వం మంజూరు చేసిన 3,500 ఇళ్లలో, ఎమ్మెల్యే కోటా కింద 1400 ఇళ్ల నుంచి తొలి విడతగా శుక్రవారం 50 మంది లబ్ధిదారులకు ఇళ్ల పత్రాలను అందజేశారు. రాజకీయాలకు తావులేకుండా, ముఖ్యంగా పూరిగుడిసెలు, రేకుల షెడ్లలో ఉండేవారికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు. అలాగే ప్రజా సమస్యలను నేరుగా వినేందుకు ప్రతి శుక్రవారం నర్సాపూర్‌లోని తన నివాసంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది కలగొద్దు



**చిన్నకోడూరు, ఎప్రిల్17,(ప్రజా జ్యోతి):-** పొద్దుతిరుగుడు పంట కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని నాయకుడు రాజేశ్వర్ రెడ్డి అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట అమ్మకం విషయంలో ఎక్కువసేపు వేచిచూడకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట కుండె తిరుపతి, బట్టు వంశీ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు

# కేంద్రాన్ని ప్రారంభించిన చైర్మన్



**చిన్నకోడూరు, ఎప్రిల్17,(ప్రజా జ్యోతి);-** మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ మీసం మహేందర్ ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పంటలకు సరైన గిట్టుబాటు ధర లభిస్తుందని ఆయన తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఉపసర్పంచ్ కన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పి.జి., ఎంబిఎ, ఎంసిఎ నాల్గవ సెమిస్టర్ పరీక్ష రుసుము గడువు విడుదల

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి ):
శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల్లో చదువుతున్న




పీజీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల విద్యార్థులకు నాల్గవ సెమిస్టర్ పరీక్ష రుసుము గడువును అధికారులు ప్రకటించారు.
విశ్వవిద్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, ఈ కోర్సుల నాల్గవ సెమిస్టర్ పరీక్షలు జూన్ 2026లో నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ పరీక్ష రుసుమును ఈ నెల 27లోపు చెల్లించాలని సూచించారు.అలాగే, గడువు తర్వత 300 రూపాయల అపరాధ రుసుముతోఈ నెల 29 వరకు ఫీజు చెల్లించే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.ఇతర వివరాల కోసం విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు లేదా సంబంధిత కళాశాలలను సంప్రదించాలని పరీక్షల నియంత్రణ అధికారి డా. డి. సురేష్ కుమార్ సూచించారు.

## తేజస్వి సూర్య వ్యాఖ్యలపై కాంగ్రెస్ నిరసన

కరీంనగర్ టౌన్,ఏప్రిల్ 17(ప్రజాజ్యోతి )
తెలంగాణ రాష్ట్రాన్ని పాకిస్తాన్‌తో పోల్చుతూ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య పై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు కరీంనగర్ నగరంలోని ఇందిరా చౌక్ వద్ద కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమానికి నాయకత్వం వహించిన కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమం ద్వారా సాధించిన రాష్ట్రాన్ని అవమానించేలా



చేసిన వ్యాఖ్యలు అసహ్యకరమని మండిపడ్డారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడిన తేజస్వి సూర్య వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.నిరసనలో భాగంగా కాంగ్రెస్ నాయకులు తేజస్వి సూర్య దిష్టిబొమ్మను దహనం చేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జరిగిన త్యాగాలను గుర్తుచేస్తూ, ఆ త్యాగాలకు గౌరవంగా సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రం కల్పించారని పేర్కొన్నారు.అంజన్ కుమార్ మాట్లాడుతూ, "తెలంగాణ రాష్ట్ర ప్రజలను పాకిస్తాన్ వాదులతో పోల్చడం తీవ్రంగా ఖండనీయము. బీజేపీ దీనిపై స్పష్టత ఇవ్వాలి. తేజస్వి సూర్య వెంటనే క్షమాపణలు చెప్పకపోతే ఆయనపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తాము" అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాచకొండ ప్రభాకర్, పర్వత మల్లేశం, ఇమ్రాన్, వీర దేవేందర్, హైమద్ అలీ, హాజీ, నిహాల్, వంగల విద్యాసాగర్, రూపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కుంభాల రాజకుమార్, గడప శ్రీనివాస్, అమీర్, ములకల కవిత, హస్తపురం తిరుమల, స్వప్నశ్రీ, జ్యోతి రెడ్డి, ఊకంటి రవీందర్ రెడ్డి, బషీరుద్దీన్, మాజీద్ అలీ ఖాన్, కర్రె పావని, వసీం, కిరణ్ రెడ్డి, పాషా, మెతుకు కాంతయ్య, సుధాకర్ నాయక్, కోలగాని అనిల్, సుదర్శన్, కన్నయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 19 న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

చొప్పదండి, ఏప్రిల్ 17 ( ప్రజా జ్యోతి):
చొప్పదండి మండలం రుక్మాపూర్ ఆదర్శ పాఠశాల 6, 7 8, 9, 10 తరగతిలకు




ప్రవేశ పరీక్ష ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. 2026– 27 విద్యా సంవత్సరానికి ఈ ప్రవేశ పరీక్ష జరుగుతుందని, ఆరవ తరగతి విద్యార్థులకు ఆరోజు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, 7, 8 9, 10 తరగతి లకు మధ్యాహ్నం రెండు గంటల నుండి నాలుగు గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు.

## అనాధ పిల్లల పట్ల ఔదార్యం

చొప్పదండి, ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి):
అనాధ పిల్లల పట్ల కరీంనగర్ వన్ హాస్పిటల్ అధినేత మర్రి మహేష్ రెడ్డి



ఔదార్యం చాటారు.చొప్పదండి మండలం చాకుంట గ్రామంలో టీ వల్ల అనారోగ్యంతో మృతి చెందిన దంపతులు తిరుపతి లావణ్య ఇద్దరు కుమారులు ఆదిత్య, శ్రీనివాస్ లకు పూర్తి విద్య, వైద్య ఖర్చులు భరిస్తానని హామీ ఇచ్చారు. అనాధ పిల్లలను అక్కున చేర్చుకున్న హాస్పిటల్ అధినేత ను గ్రామస్తులు అభినందించారు.

# రోడ్డు భద్రత..అందరి బాధ్యత

**రోడ్డు ప్రమాదాల్లో ఏడాదిలో 7,500 ప్రాణాలు బలి**

**హత్యలకంటే ప్రమాదాలే భయంకరం**

**డిఫెన్సివ్ డ్రైవింగ్ లేకపోతే ప్రమాదం తప్పదు**

**హెల్మెట్,సీట్ బెల్ట్ తప్పనిస రిగా ఉపయోగించాలి**

**మైనర్ల డ్రైవింగ్,డ్రంక్ డ్రైవ్‌పై కఠిన**

**చర్యలు తప్పవు**

**'అరైవ్ అలైవ్'తో యాక్షన్‌లోకి పోలీస్ శాఖ**

**తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి శివధర్ రెడ్డి**

కరీంనగర్ క్రైం,ఏప్రిల్ 17,ప్రజాజ్యోతి:
రాష్ట్రంలో హత్యల కంటే రోడ్డు ప్రమాదాలే భయంకర రూపం దాల్చాయని తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి శివధర్ రెడ్డి అన్నారు.శుక్ర వారం కరీంనగర్‌లో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి శివధర్ రెడ్డి హాజరయ్యారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది హత్యల వల్ల 800 మంది మృతి చెందగా,రోడ్డు ప్రమాదాల్లో ఏకంగా 7,500 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని సామాజిక ఉద్యమంగా ముందుకు తీసుకెళ్తున్నామని స్పష్టం చేశారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.వార్డు సభ్యుడి నుంచి ముఖ్యమంత్రి వరకు అందరూ ఇందులో భాగస్వాములు కావాల్సిన అవసరం





ఉందన్నారు.

హెల్మెట్ లేకపోతే ప్రాణం గాల్లోకి...

జిల్లాలో జరిగే ప్రమాదాల్లో 70 శాతం మరణాలు ద్విచక్ర వాహనదారులవేనని వెల్లడించారు.బైక్‌పై వెళ్తున్న వారు మాత్రమే కాదు వెనుక కూర్చున్న వారు కూడా తప్పనిస రిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని సూచించారు.స్ట్రాప్ పెట్టుకోకపోతే ప్రమాద సమయంలో హెల్మెట్ ఎగిరిపోయి ప్రాణాపాయం తప్పదని హెచ్చరించారు.

సీట్ బెల్ట్ లేకపోతే ఎయిర్‌బ్యాగ్ కూడా పనికిరాదు..

కారు ప్రయాణికులు సీట్ బెల్ట్ ధరించకపోతే ఎయిర్‌బ్యాగ్‌లు కూడా రక్షణ ఇవ్వవని తెలిపారు. ప్రమాద సమయంలో వాహనం బయటకు ఎగిరిపోకుండా కాపాడేది సీట్ బెల్ట్ మాత్రమేనన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్... కుటుంబాల్ని రోడ్డున పడేస్తోంది..

మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, రాంగ్ రూట్‌లో వెళ్లడం, ఓవర్ కాన్ఫిడెన్స్‌తో డ్రైవింగ్ చేయడం వల్ల ఎన్నో కుటుంబాలు దిక్కుతోచని పరిస్థితికి చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు తప్పవు...

లైసెన్స్ లేకుండా మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులను హెచ్చరించారు.పిల్లల ఒత్తిడికి లోనై వారి ప్రాణాలతో ఆటలాడవద్దన్నారు.

డిఫెన్సివ్ డ్రైవింగ్ తప్పనిసరి...

స్కూల్స్, గ్రామ జంక్షన్ల వద్ద వేగం తగ్గించాలని, పాదాచారులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.రోడ్డు దాటే వారు వాహనాలు వచ్చే దిశను ఎదురుగా చూసుకుంటూ నడవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భాగంగా 'అరైవ్ అలైవ్' స్కెబెలూన్,పోస్టర్లు,పాట సీడీని ఆవిష్కరించారు.హెల్మెట్లు పంపిణీ చేశారు. పాల్గొన్న వారితో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు.
జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ రహవీర్,ఉచిత వైద్యం,హిట్ అండ్ రన్ పరిహారం వంటి పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కరీంనగర్ సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 600 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి,ప్రమాద మరణాలను 16 శాతం తగ్గించగలిగామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థలు అశ్విని,డి ఎం హెచ్ ఓ వెంకటరమణ,ఎం వి ఐ చక్రవర్తి,ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్,అడిషనల్ డీసీపీ వెంకటరమణ తో పాటు ఇతర అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

## వానకాలం పంటల సాగుకు సన్నద్ధం కావాలి

### జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి

కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి )
రాబోయే వానకాలం (ఖరీఫ్) సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని పంటల సాగుకు అధికారులు, రైతులు ముందస్తుగా సన్నద్ధం కావాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమతి భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. కరీంనగర్ ఏ డి ఏ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.వానకాలం ప్రారంభానికి ముందే రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సాంకేతిక మార్గదర్శకాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటు



న్నామని తెలిపారు. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సబ్సిడీలు పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి అవుతుందని స్పష్టం చేశారు. అందువల్ల ప్రతి రైతు తమ రిజిస్ట్రీని పూర్తి చేసుకోవాలని, ఏ ఈ ఓ లు గ్రామ స్థాయిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని 100 శాతం నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానికంగా లేని రైతులు కూడా మీ సేవా కేంద్రాల ద్వారా ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు.
అలాగే డిజిటల్ క్రాప్ బుకింగ్ కార్యక్రమాన్ని సమయానికి పూర్తి చేయాలని సూచిస్తూ, పంటల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడం ద్వారా నష్టపరిహారం, ఇతర ప్రయోజనాలు సులభంగా అందుతాయని తెలిపారు. ఏ ఈ ఓ లు,డి సి ఎస్ లు వాలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పంటల మార్పిడి విధానంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ముఖ్యంగా పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాలు, నూనె గింజల సాగును ప్రోత్సహించాలని రైతులకు సూచించారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో మూడు మంది సోయిల్ వాలంటీర్లను ఎంపిక చేసి మట్టి పరీక్షలు, మట్టి ఆరోగ్యం, సమతుల ఎరువుల వినియోగంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. దీంతో రైతులు ఖర్చులను తగ్గించుకొని దిగుబడులను పెంచుకోవచ్చన్నారు. రైతులు తమ మొబైల్ నంబర్లను ఏ ఈ ఓ ల వద్ద అప్డేట్ చేసుకోవాలని, తద్వారా యూరియా యాప్, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, వ్యవసాయ సలహాలు నేరుగా అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ఉద్యానవన శాఖ ద్వారా వెజిటేబుల్ వాలంటీర్లను నియమించి, వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సహాయ వ్యవసాయ సంచాలకులు రణధీర్ రెడ్డి, కరీంనగర్ అర్బన్, రూరల్, కొత్తపల్లి మండల వ్యవసాయ అధికారులు వంశీ కృష్ణ, సత్యం, సంతోష్ కుమార్ తదితరులు, ఏ ఈ ఓ లు పాల్గొన్నారు.

## ఉద్యోగుల హక్కుల కోసం గర్జించిన కరీంనగర్ జేఏసీ

కరీంనగర్ టౌన్,ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి )
ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఉద్యోగులు భారీ నిరసన చేపట్టారు. ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నిరసనలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు, నాలుగో తరగతి సిబ్బంది, డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, డీఏలు, పీఆర్సీ, పెండింగ్ బిల్లులు, సరెండర్ లీవ్, మెడికల్, ఇన్సూరెన్స్ బిల్లులు, జీపీఎఫ్ వంటి హక్కుల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. 2023 జూలై 1 నుండి అమలు కావాల్సిన పీఆర్సీ ఇప్పటికీ అమలు కాకపోవడం, ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండడం ఉద్యోగులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతోందన్నారు.మా కష్టార్జిత సొమ్ము కోసం మేమే రోడ్లపైకి వచ్చి నిరసనలు చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరం. మేము ఎలాంటి ఉచితాలు కోరడం లేదు... ఇవి మా హక్కులు" అని భావోద్వేగంగా పేర్కొన్నారు.అలాగే పాత పెన్షన్ పథకం పునరుద్ధరణ, హెల్త్ కార్డుల అమలు, కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ వంటి అంశాల్లో ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.తరువాత జేఏసీ నాయకులు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ మడిపల్లి కాళిచరణ్, కటకం రమేష్, పేంద్యల కేశవ రెడ్డి,



కరుణాకర్ రెడ్డి, తిరుపతిరావు, జావిద్, రామ్మోహన్, ఆడేపు శ్రీనివాస్, కోట శ్యాం కుమార్, రేకం శంకర్, జయపాల్ రెడ్డి, సుంకిశాల ప్రభాకర్ రావు, చకినాల రామ్మోహన్, జాలి మహేందర్ రెడ్డి, చంద్రమౌళి, చింతపల్లి అశోకరావు, గోనె శ్రీనివాస్, ఎండి సలీం, దోనికేన సునీల్ కుమార్, చంద్రశేఖర్, ఆంజనేయరావు, సత్యనారాయణ రెడ్డి, గడ్డం సుధాకర్, డా. అరవింద్ రెడ్డి, సర్దార్ హర్మీందర్ సింగ్, కిరణ్ కుమార్, శారద, సునీత, సబిత, సరిత, కోట రామస్వామి, శంకర్, గూడ ప్రభాకర్ రెడ్డి, రాగి శ్రీనివాస్, రమేష్ గౌడ్, ప్రసాద్ రెడ్డి, జలాలోద్దీన్ అక్బర్, శైలజ, వీణ, సుస్మిత, మారుపాక రాజేష్, భరద్వాజ్, పూలు కిషన్, వాస్తవి గౌడ్, కొమ్మెర శ్రీనివాసరెడ్డి, విజయ్ కుమార్, వెలిచాల సుమంతరావు, అజ్గర్ అలి, లవ కుమార్, కమలాకర్, కరుణాకర్, నగేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## గంభీరావుపేట సెక్షన్‌లో 3.0 కి.మీ. 33కేవీ ఇంటర్‌లింక్ లైన్ విజయవంతంగా చార్జ్

గంభీరావుపేట ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి):
గంభీరావుపేట సెక్షన్ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో నీ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా నిరంతరాయంగా అందించే మహత్తర లక్ష్యంతో 3.0 కిలోమీటర్ల పొడవైన 33కేవీ ఇంటర్‌లింక్ లైన్‌ను విజయవంతంగా శుక్రవారం చార్జ్ చేశామని ఎన్పీడీసియల్ చీఫ్ ఇంజినీర్ (ఆపరేషన్స్–1), బి. అశోక్ తెలిపారు.విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలనే



సంకల్పంతో చేపట్టిన ఈ ఇంటర్లీకింగ్ లైన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఆపరేషన్స్), సిరిసిల్ల టి. వేణు మాధవ్ గారి ప్రత్యక్ష పర్యవేక్షణలో, వారి సమక్షంలో అత్యంత విజయవంతంగా నిర్వహించబడిందనీ అన్నారు.
ఈ ఇంటర్‌లింక్ లైన్ ప్రారంభంతో కొత్తపల్లి, శ్రీగాధ, కొల్లమద్ది, రాజుపేట గ్రామాలకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఇప్పుడు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిందని శ్రీ అశోక్, స్పష్టం చేశారు. ఏదైనా సాంకేతిక లోపం ఏర్పడినప్పుడు లేదా భారీ వర్షాలు, ఈదురుగాలులు, ఉరుములు మెరుపులు వంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా ప్రధాన విద్యుత్ లైన్లలో అంతరాయాలు సంభవించినప్పుడు, ఈ ఇంటర్‌లింక్ లైన్ ద్వారా ప్రత్యామ్నాయ మార్గంలో నిరవధికంగా విద్యుత్ సరఫరా కొనసాగించడం సాధ్యమవుతుందని ఆయన వివరించారు. దీని వలన గ్రామీణ ప్రాంత వినియోగదారులకు కరెంటు అంతరాయాలు గణనీయంగా తగ్గుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.గృహవినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్ సేవలు లభిస్తాయని, అశోక్ వివరించారు.ఈ ఇంటర్‌లింక్ లైన్ ఏర్పాటు వలన విద్యుత్ వ్యవస్థలో రెండు మార్గాల సరఫరా ( డ్యూయల్ సెక్యూర్ ఫీడింగ్ ) అందుబాటులోకి వచ్చిందని, ఇది ఆధునిక విద్యుత్ పంపిణీ వ్యవస్థకు ఒక మైలురాయి అని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్ణీత సమయంలో, అత్యంత నేర్పుతో విజయవంతంగా పూర్తిచేసిన గంభీరావుపేట సెక్షన్ సిబ్బందిని,సంబంధిత ఇంజినీర్లను సీఈ శ్రీ బి. అశోక్ గారు , ఎస్ఈ శ్రీ టి. వేణు మాధవ్ అభినందించారు. గ్రామీణ ప్రాంత వినియోగదారులకు అంతరాయాలు లేని నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ విభాగపు అత్యున్నత లక్ష్యమని, ఆ దిశగా నిరంతరం శ్రమిస్తామని వారు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో సర్కిల్ పరిధిలోని ఇతర సబ్‌స్టేషన్లకు కూడా ఇలాంటి ఇంటర్‌లింక్ లైన్లు ఏర్పాటు చేయాలని ప్రణాళికలురూపొందిస్తున్నామని ఆయన తెలిపారు.
ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్లసర్కిల్సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఆపరేషన్స్) టి. వేణు మాధవ్ , డివిజినల్ ఇంజినీర్ ఎన్. అంజయ్య , అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్ శ్రీ శ్రీనివాస్ , అసిస్టెంట్ ఇంజినీర్లు ఆనంద్ , పద్మ మరియు గంభీరావుపేట సెక్షన్ సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చల్ల చల్లగా చలివేంద్రం నీరు



**ఖమ్మం వైరా ఏప్రిల్ 17 ప్రజా జ్యోతి** వైరా పట్టణంలో ప్రజల దహర్తి తీర్చడానికి మున్సిపల్ అధికారులు ప్రధాన కుడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుండి ఎండలు మండిపోతుండడంతో ప్రజలు భానుడి తాపాన్ని తట్టుకోలేక చల్లని పానీయాలు, కొబ్బరి బొండాలు, పండ్ల రసాలు, నిమ్మ సోడాలు, కూల్డ్రింకులు ఇతర పానీయాలను సేవిస్తున్నారు మండుతున్న ఎండలతోపాటు పానీయాల రేట్లు కూడా పెరిగాయి. వివిధ గ్రామాల నుండి పనుల మీద వైరా వస్తున్నవారికి చల్లటి మంచినీళ్లు తాగాలంటే డబ్బులు పెట్టి కొనుక్కోవాల్సి వస్తుంది. ప్రతిగా మున్సిపల్ కమిషనర్ గురులింగం ప్రజలకు ప్రయాణికులకు చల్లటి మట్టి కుండ నీళ్ళ అందించడంతో, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 57వ డివిజన్‌లో ఘనంగా
# షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** రాష్ట్ర మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు,ఖమ్మం నగరం 57వ డివిజన్‌లో లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాల కింద మంజూరైన చెక్కులను 57వ డివిజన్ కార్పొరేటర్ రఫీదా బేగం ముస్తఫా అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రఫీదా బేగం ముస్తఫా మాట్లాడుతూ,పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే గొప్ప ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్గదర్శకత్వంలో నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే కుటుంబాలకు ఈ చెక్కులు గొప్ప ఊరటనిస్తాయని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనిఆమె కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, లబ్ధిదారులు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# చల్లగుండ్ల సేవలు అమోఘము: ఎమ్మెల్యే రాగమయి



**సత్తుపల్లి ఏప్రిల్17(ప్రజా జ్యోతి)** ఉపాధ్యాయ వృత్తిలో ఎందరకో విద్య నేర్పి,వేల మంది విద్యార్థులను తీర్చిదిద్ది,వారి జీవితాన్ని ఉపాధ్యాయునిగా అంకితం చేసి పదవీ విరమణ పొందిన చల్లగుండ్ల అప్పారావు ను సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ వారి స్వగృహానికి వెళ్లి ఆ దంపతులను అభినందించారు. పదవీ విరమణ చేసిన వారిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి,శేష జీవితాన్ని గడిపేందుకు ఆ భగవంతుడు అష్టైశ్వర్యాలు, ఆరోగ్యాన్ని ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్, వైస్ చైర్ పర్సన్ బొంతు సుమలత, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, వార్డ్ కౌన్సిలర్ గ్రాండ్ మౌలాలి, చల్లగుండ్ల నరసింహారావు, గాదె చెన్నారావు, టోపీ శ్రీను, వీరివాడ నాగభూషణం, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## పలు కుటుంబాలను
# పరామర్శించిన ఎమ్మెల్యే రాగమయి



**సత్తుపల్లి ఏప్రిల్17(ప్రజా జ్యోతి)** మున్సిపాలిటీ పరిధిలోని ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందిన పలువురిని సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శుక్రవారం పరామర్శించారు. మసీదు రోడ్లో కిరాణా షాప్ యజమాని మట్టా కృష్ణ ఇటీవల మృతిచెందగా, 17వ వార్డులో మోడీది రమేష్ వారి తండ్రి సత్యనారాయణ, 16 వార్డులో నల్లమోతు సత్యనారాయణ మృతిచెందగా, 23వ వార్డులో కొల్లు వెంకటేశ్వరరావు రిటైర్డ్ టీచర్ ఇటీవల మృతి చెందగా, తుమ్మూరు రామారావు రోడ్డు అక్కిరాజు శివరాజు వారి మాతృమూర్తి అక్కిరాజు రాధాకుమారి ఇటీవల మృతి చెందగా, 18 వ వార్డులో కందులూరి దుర్గ వెంకట సత్యనారాయణ ఎలక్ట్రీషియన్ ఇటీవల మృతి చెందగా,6 వ వార్డు కొమ్మినేని కృష్ణవేణి ఇటీవల మృతిచెందగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మృతికి గల కారణాలు తెలుసుకొని కుటుంబ సభ్యులకు సంతాపం సానుభూతి వ్యక్తం చేశారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో మున్సిపల్ చైర్ పర్సన్ రెహనా కమల్, వైస్ చైర్ పర్సన్ బొంతు సుమలత, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, దూదిపాల రాంబాబు జొన్నలగడ్డ తోట సుజల రాణి,మట్టా ప్రసాద్, విరివాడ అపర్ణ,హకీమ్, పరస మానస రాము, జగన్నాథం శ్రీను,నసీమా షరీఫ్, కర్ణాటి విజయలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,మహిళలు, యూత్ సభ్యులు ఎన్ ఎస్ యు ఐ ఉన్నారు.

# ఉద్యోగులకు పీఆర్‌సీ వెంటనే అమలు చేయాలి
- ఉపాధ్యాయలు భోజన విరామ సమయంలో నిరసన
- ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలపై తాసిల్దార్‌కు టీజిఈజెఎసి నాయకులు వినతి పత్రం అందజేత




**టేకులపల్లి,ఏప్రిల్17, ప్రజాజ్యోతి:** ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పీఆర్‌సీ వెంటనే అమలు చేయాలని కోరుతూ ఉద్యోగులు శుక్రవారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం ఎమ్మార్వో వీరభద్రంకు టీజిఈజెఎసి మండల శాఖ అధ్యర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీజిఈజేఏసీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు,ఉపాధ్యాయులకు ఇచ్చే రెండవ పిఆర్సిని 51 శాతం సెంటిమెంట్తో వెంటనే అమలు చేయాలని జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయ,ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో అలసత్వం విధానం మానుకోవాలని వారు అన్నారు.వచ్చే సాధారణ ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని తగిన గుణపాఠం తెలుపుతామని సందర్భంగా హెచ్చరించారు. రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన న్యాయపరమైన బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన డిఏలు పిఆర్సి లను సకాలంలో అందేటట్లు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి. ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని ప్రధానంగా ప్రభుత్వం దృష్టిలో ఉన్న 61 డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ సంఘాల తోటి చర్చలకు జరపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి టీజీఈజెఏసిమండల బాధ్యులు, పిఆర్టియు అధ్యక్ష కార్యదర్శులు రమేష్, రమణ, మోతీలాల్ యూటీ ఫ్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, హరికుమార్, సిపిఎస్ సంఘము నాగునాయక్, పులసింగ్, వెంకట్రాం, దివ్యాంగ ఉద్యోగ , ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాణోత్ లక్ష్మా నాయక్, బోడ సుజాత,ఇంకా వివిధ సంఘాల జిల్లా నాయకులు రామచందర్, మాన్సింగ్, బాలాజీ,రవీందర్,పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు, మహి ళా ఉపాధ్యాయులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు

# తేజస్వీ యాదవ్ మాటలు ఉపసంహరించుకోవాలి
జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఏ పి తెలంగాణ విభజనపై పార్లమెంట్ సాక్షిగా బీజేపీ పార్లమెంట్ సభ్యులు తేజస్వి యాదవ్ మాట్లాడిన మాటలపై మండి పడ్డారు. ఏపి - తెలంగాణ విభజన అత్యంత ప్రామాణికంగా ,అన్న దమ్ముల వలె విభజన ప్రక్రియ జరిగిందన్నారు.విభజనపై పార్లమెంట్ సాక్షిగా బీజేపీ పార్లమెంట్ సభ్యులు తేజస్వి యాదవ్ మాట్లాడిన మాటలను ఉపసంహరించుకోవాలని,రికార్డ్ ల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈరోజు పార్లమెంట్ దగ్గర కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు.తెలంగాణాకు చెందిన బిజెపి పార్లమెంట్ సభ్యులు తెలంగాణపై పార్లమెంట్ లో ఇతర పార్లమెంట్ సభ్యులు అనవసర వ్యాఖ్యలు చేస్తుంటే మిన్నకుండ ఉండిపోయారని,గతంలో ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా, ఏ పి ఎంపీ ఒకరు తెలంగాణ ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడినపుడు కూడా మౌనంగా ఉన్నారని ,తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని భవిష్యత్లో తగిన గుణపాఠం చెపుతారని,ఇప్పుడైనా స్పందించకుంటే తల్లికి ద్రోహం చేసిన వారిగా మిగిలిపోతారని అన్నారు.తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలు స్పందించాలని కోరారు. అదే విధంగా నిన్న వైరాలో జరిగిన ఒక కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులపై మాట్లాడిన మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. టెండర్ ల గురించి,అవినీతి గురించి,పోలీసుల గురించి మాట్లాడిన అజయ్ కుమార్ మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని అన్నారు.కాంగ్రెస్ పార్టీ గురించి, జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల గురించి మాట్లాడే కనీస అర్హత కూడాలేదన్నారు.మీరేంటో , బి ఆర్ ఎస్ పార్టీ ఏంటో విజ్ఞత గల ఖమ్మం జిల్లా ప్రజలకు బాగా తెలుసని,ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గత మూడు పర్యాయాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, మొన్న జరిగిన గ్రామ పంచాయతీ ,మున్సిపాల్టీ ఎన్నికల ఫలితాలే ముగ్గురు మంత్రుల అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలు నిదర్శనం అని అన్నారు.ఇకనైనా పువ్వాడ అజయ్ కుమార్ అనవసర ఆరోపణలు,ప్రగల్భాలు మానుకొని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అభివృద్ధిని పరుగు పెట్టిస్తూ ,అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజా పాలన గావిస్తున్న ప్రభుత్వానికి మంచి సలహా సూచనలు చేసి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ కోరారు.

# ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయాలి

- ప్రజా ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి
- మండల కేంద్రంలో నిరసన చేపట్టిన పీజీ ఈజెఎస్‌సి నాయకులు
- పి ఆర్ సి ని వెంటనే అమలు చేయాలి
- టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ
- హెల్త్ స్కీమును వెంటనే అమలు చేయాలి
- టీఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రత్నాకర్
- తాహసిల్దార్‌కు అందజేసిన టీజీ ఈజె ఎస్ నాయకులు




**బోనకల్, ఏప్రిల్ 17(ప్రజా జ్యోతి):** ఉపాధ్యాయ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీజీఈజెఏసి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం బోనకల్ మండల కేంద్రంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు, ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రదర్శన నిర్వహించి బోనకల్ తహసిల్దార్ మద్దెల రమాదేవికి 64 డిమాండ్లతో కూడిన మెమోరాడం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, పి ఆర్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రత్నాకర్ మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పిఆర్సి ని వెంటనే 51% ఫిట్మెంట్తో అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న డిఎలను విడుదల చేయాలని, హెల్త్ స్కీమును వెంటనే అమలు చేయాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, గురుకుల పాఠశాలల టైం టేబుల్ మార్చాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం స్కేల్ ఇవ్వాలని, పెండింగ్ బిల్లుల చెల్లింపుకు నెలకు 1500 కోట్లు అయినా కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా నాయకులు సదా బాబు ,టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు చిన్న రంగారావు, పి ఆర్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు కాంతారావు, కె రామ్మోహన్, రెవెన్యూ ఉద్యోగుల సంఘంనాయకులు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, సెక్రెటరీల సంఘం నాయకులు ఎస్కే సైదులు,టీఎస్ యుటిఎఫ్ మండల ఉపాధ్యక్షులు, పి. గోపాలరావు, మండల కోశాధికారి పి .నరసింహారావు, మండల ఉపాధ్యక్షురాలు సౌభాగ్య లక్ష్మి, టిపిటిఎఫ్ నాయకులు యాకూబ్ పాషా, నరేంద్ర సింహ, పిఆర్టియు నాయకులు ఝాన్సీ, యుటిఎఫ్ నాయకులు అల్వాల నాగేందర్, ఎం నాగ మహేష్, కే లక్ష్మణరావు, , పీజీహెచ్ఎంఏ నాయకులు గోపీచంద్, సిహెచ్ కోటేశ్వరరావు, శ్రీరామారావు, తదితరులు పాల్గొన్నారు.



# సామాన్యులు మూడు పూటలా అన్నం కూడా తినలేకపోతున్నారు
- పేద ప్రజల నడ్డి విరిచే విధంగా ధరలు పెరిగిపోతుంటే ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి
- చాప కింద నీరులా పెరుగుతున్న నిత్యవసర సరుకులు
- నిత్యవసరాల ధరలను నియంత్రించాలి - మాదిగ ఐక్యవేదిక అధ్యక్షులు వేల్పుల భాస్కర్ డిమాండ్



**సుజాత నగర్ ప్రజాజ్యోతి ఏప్రిల్ 17 :** మండలం లో మాదిగ ఐక్యవేదిక లో అధ్యక్షులు వేల్పుల భాస్కర్ నిత్యవసరాల ధరల గురించి మాట్లాడుతూ మండిపడ్డారు. రోజురోజుకు చాప కింద నీరులా పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలను నియంత్రించాలని ఇప్పుడున్న వాటి ధరలను వెంటనే తగ్గించాలని మాదిగ ఐక్యవేదిక సుజాతనగర్ మండల అధ్యక్షులు వేల్పుల భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, మంచి నూనె,చింతపండు, కందిపప్పు,కారం,పసుపు,పిండి దినుసులు తదితర సరుకుల ధరలు నిరంతరం పెరుగుతున్న పరిస్థితుల్లో పేద సామాన్య మధ్య తరగతి కుటుంబాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, గతంతో పోలిస్తే ఇప్పుడు మూడు రెట్లు నిత్యవసరాల ద్వారా ప్రజల కుటుంబాలపై ఆర్థిక భారం పడుతున్నదని, దానిద్వారా కుటుంబ పోషణ భారమై అప్పులు చేయవలసిన పరిస్థితి వస్తున్నదని, కాలం గడుస్తున్న కొద్దీ సరుకుల ధరలు అయితే పెరిగిపోతున్నాయి గాని సామాన్య ప్రజల ఆర్థిక స్థితి గతి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నదని అన్నారు. పండించే రైతుకు సరైన గిట్టుబాటు ధర దక్కటం లేదు కానీ ఆ రైతు దగ్గర కొనుగోలు చేసే కార్పొరేట్ దందా దారులు వారు నిర్ణయించిన ధరలకే కొనుగోలు చేయవలసి వస్తున్నదని ఆ భారం మరల ప్రజలపైనే పడుతున్నదని అన్నారు. పేద ప్రజల నడ్డి విరిచే విధంగా ధరలు పెరిగిపోతుంటే ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు, గత ఆరు నెలలుగా నిత్యవసరాల ధరలు ఎంత పెరిగాయో ఒక్కసారి ప్రభుత్వాలు విశ్లేషించుకోవాలన్నారు, పెరుగుతున్న ధరల వలన సామాన్యులు మూడు పూటలా తిండి కూడా తినలేక పోతున్నారని మండిపడ్డారు, వెంటనే ప్రభుత్వాలు స్పందించి అడ్డగోలుగా పెరుగుతున్న సరుకుల ధరలను తగ్గించక పోతే ప్రజలు బ్రతికే పరిస్థితి లేదని తెలిపారు. ధరలను అదుపు చేసే ప్రక్రియ వెంటనే ప్రభుత్వాలు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే నిత్యవసర సరుకుల విక్రయ కల్తీదారులపై అధికార యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాలని వాటి ద్వారా ప్రజలు అనేక అనారోగ్యాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ధరల పెరుగుదల అంత చిన్న విషయమేమీ కాదని ఇదో మరో ఉద్యమం కాకముందే స్పందించి నియంత్రించకపోతే ప్రజల ఆగ్రహానికి ప్రభుత్వాలు గురికాక తప్పదు అన్నారు.

# గోల్డెన్ హావర్ పై అవగాహన
- ఇల్లందు డిఎస్పి వెంకన్నబాబు



**టేకులపల్లి:** టేకులపల్లి మండలం లోని లారీ యూనియన్ ఆఫీస్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజు ప్రజాపాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏరైవ్ -ఏలైవ్ కార్యక్రమంలో గోల్డెన్ అవర్స్ అవగాహన టేకులపల్లి సిఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సై ఆలకుంట రాజేందర్, బోడు ఎస్ఐపి.శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం గోల్డెన్ అవర్స్ నిర్వహించి, ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఇల్లందు డిఎస్పి వెంకన్నబాబు పాల్గొని మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే తొలి ఒక గంటను గోల్డెన్అవర్స్ గా పేర్కొంటారని,ఈ సమయంలో సరైన వైద్య సహాయం అందితే ప్రాణాలను కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆలస్యం చేయకుండా బాధితులను సమీప ఆసుపత్రికి తరలించడం ఎంతో కీలకమని,అంబులెన్స్ సేవలు వినియోగించడం ద్వారా వేగంగా చికిత్స అందించవచ్చని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అలాగే రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సై ఆలకుంట రాజేందర్, బోడు ఎస్ ఐ పి. శ్రీనివాస్ రెడ్డి,పోలీస్ సిబ్బంది, 60మంది లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి
# రూ.2 లక్షల విరాళం: చలసాని



**సత్తుపల్లి ఏప్రిల్17(ప్రజా జ్యోతి)** కొత్తూరు గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా మిస్ట్ కళాశాల అధినేత రూ..2 లక్షల రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఈ విధంగా ఆలయ నిర్మాణానికి వారి సహాయం అందించడం అభినందనీయమని,శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి కృప వారిపై ఎల్లప్పుడూ ఉండి, విద్యాసంస్థలు అభివృద్ధి చెందాలని, ఆలయ కమిటీ సభ్యులు మనస్ఫూర్తిగా వేడుకొన్నారు.

# ప్రభుత్వంలో కదలిక చిగురి స్తున్న ఆర్టీజన్ ల ఆశలు

## ఉప ముఖ్యమంత్రి బట్టి హామీ సమ్మె విరమించిన ఆర్టిజన్ లు

ఆదిలాబాద్ బ్యూరో, ఏప్రిల్ 17, (ప్రజా జ్యోతి)
సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఆర్టిజన్ లుగత పది రోజులుగా చేస్తున్న సమ్మె కు ప్రభుత్వంలో కదలిక వ చ్చింది. చర్చల ద్వారా సమ స్యలు పరిష్కరిస్తామని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క హామీ ఇవ్వడంతో విద్యుత్ ఆర్టిజన్లు సమ్మె విరమిస్తున్న ట్లు





ప్రకటించారు. దీంతో వి ద్యుత్ శాఖ ఆర్టిజన్ లలో ఆశ లు చిగురుస్తు న్నాయి. ప్రజా భవన్ లో శుక్రవారం విద్యుత్ శాఖ ఆర్టిజన్ల జేఏసీ నాయకు లు ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మల్లుని కలిసి త మ సమస్యలను వివరించా రు. సమస్యల పరిష్కారానికి చర్చల ద్వారానే ముందుకు వెళ్లాలని, ట్రాన్స్కో సిఎండితో వెంటనే సమావేశమై అంశాల పై చర్చించాలని ఉప ముఖ్య మంత్రి బట్టి ఆదేశించారు.
ఈ సందర్భంగా ఆర్టిజన్ల జేఏ సీ చైర్మన్ సతీష్ రెడ్డి మాట్లా డుతూ, ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ట్రాన్స్కో సి ఎండితో చర్చలు జరగనున్న నేపథ్యంలో వెంటనే సమ్మె విర మిస్తున్నట్లు ప్రకటించారు. తమ సమస్యలపై సానుకూ లంగా స్పందించి, ఉన్నతాధి కారులతో చర్చలకు అవకాశం కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమా ర్కమల్లు మాట్లాడుతూ, ఉ ద్యోగులు ప్రజలను మెప్పించే విధంగా పనిచేయాలని సూ చించారు. వేసవిలో విద్యుత్ డిమాండ్ అత్యధికంగా ఉన్న ఈ సమయంలో అకస్మాత్తుగా సమ్మెకు వెళ్లడం సరికాదని పేర్కొన్నారు. సమస్యలన్నీ చ ర్చల ద్వారానే పరిష్కారం అ వుతాయని, ప్రజా ప్రభుత్వం మానవీయ కోణంలో ఉద్యో గుల సమస్యలను పరిశీ లి స్తుందని తెలిపారు.విద్యుత్ శాఖ ఉద్యోగ సంఘాల నాయ కులు ఎప్పుడు వచ్చినా ప్రభు త్వం చర్చలకు సిద్ధంగా ఉం టుందని, ఆర్థిక భారం లేకుం డా పరిష్కరించగలిగే అంశాల పై ట్రాన్స్కో సిఎండి కృష్ణ భా స్కర్ తో చర్చలు జరిపి సమ స్యల పరిష్కారానికి కృషి చే స్తామని ఉప ముఖ్య మంత్రి హామీ ఇచ్చారు.ఈ సమావే శంలో ఎమ్మెల్సీ అద్దం కి ద యాకర్, ఆర్టిజన్ల జేఏసీ నా యకులు పాల్గొన్నారు.

## జాతీయ విపత్తును నివారించిన రోజు

మొదటిపేజీ తరువాయి..

వీగిపోయిన నేపథ్యంలో రేవంత్‌రెడ్డి స్పందించారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో జాతీయ విపత్తును అడ్డుకున్నారు. దేశ చరిత్రలో సువర్ణదినంగా ఇవాళ గుర్తుండిపోతుంది. నల్ల బిల్లులను ఓడించేందుకు ఏకమైన మిత్రపక్షాల నేతలకు ధన్యవాదాలు అని రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు చేశారు. లోక్‌సభలో చోటుచేసుకున్న తాజా పరిణామాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. విపక్ష నేతలందరూ ఏకమై ఒక 'జాతీయ విపత్తును' నివారించారని సీఎం ఈ సందర్భంగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తన సందేశంలో ప్రధానంగా మూడు అంశాలను ప్రస్తావించారు. భారత దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఇది చిరస్థాయిగా నిలిచిపోయే ఒక మరపురాని రోజని సీఎం అభివర్ణించారు. లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నాయకత్వంలో ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి రావడంపై రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య శక్తుల ఐక్యతే ఈ విజయాన్ని సాధించిందని తెలిపారు. ఈ బిల్లులను 'నల్ల బిల్లులు'గా పేర్కొంటూ.. వీటిని ఓడించేందుకు కఠిన పరిస్థితుల్లోనూ సాహసంతో నిలబడినందుకు విపక్ష కూటమిలోని మిత్రపక్షాల నాయకులకు సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పోరాటంలో అండగా నిలిచిన దేశంలోని ప్రముఖ రాజకీయ నాయకులందరినీ సీఎం రేవంత్ రెడ్డి పేరుపేరునా ప్రస్తావించారు. వీరిలో ఎం.కే. స్టాలిన్ తమిళనాడు, మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్, అఖిలేశ్ యాదవ్, ఉత్తర్ ప్రదేశ్ శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే (మహారాష్ట్ర), లాలు ప్రసాద్ యాదవ్ బిహార్ ,హేమంత్ సోరెన్ జార్ఖండ్, అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ వీరితో పాటు ఫరూఖ్ అబ్దుల్లా, నవీన్ పట్నాయక్, కమ్యూనిస్ట్ పార్టీల నాయకులకు కూడా ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రకటన జాతీయ రాజకీయాల్లో తెలంగాణ పోషిస్తున్న క్రియాశీలక పాత్రను స్పష్టం చేస్తోంది. ఈ బిల్లు వీగిపోవడం కేంద్ర ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బగా విపక్షాలు భావిస్తున్నాయి. దక్షిణాది నుంచి రేవంత్ రెడ్డి జాతీయ స్థాయి మిత్రపక్షల నేతలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రతిపక్షాలన్నీ ఏకమవ్వడం శుభ పరిణామమని సీఎం అభిప్రాయపడ్డారు. ఇదిలావుంటే భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా.. ఢిల్లీలోని అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. రాధాకృష్ణన్ దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. భారతదేశపు మొట్టమొదటి ఉపరాష్ట్రపతిగా సేవలందించారన్నారు. భారతదేశం గర్వించదగ్గ గొప్ప తత్వవేత్త, విద్యావేత్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి పాల్గొన్నారు.

# భర్త హత్యకు భార్య సుపారి

- మిస్సింగ్ కేసు మర్డర్‌గా వెలుగులోకి
- అక్రమ సంబంధం నేపథ్యంలో కుట్ర
- రూ.5 లక్షల ఒప్పందం
- దారుణంగా హత్య చేసి ఆధారాల నాశనం

పరకాల, ఏప్రిల్ 17 , (ప్రజాజ్యోతి):
హనుమకొండ జిల్లా పరకాల పరిధిలో సంచలనం రేపిన మిస్సింగ్ కేసు హత్యగా తేలింది. ఈ నెల 8వ తేదీన మడికొండ సాంబయ్య తన కుమారుడు సుమన్ భరత్ కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి అసలు నిజాన్ని వెలికితీశారు. పోలీసుల విచారణలో బయటపడిన వివరాల ప్రకారం... పరకాలకు చెందిన సుమన్ భరత్ (38)కు 2012లో లావణ్యతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇదిలా ఉండగా, లావణ్యకు ఇమ్మడి నరేశ్‌తో పరిచయం ఏర్పడి, అది అక్రమ సంబంధానికి దారి తీసింది. ఈ నేపథ్యంలో భర్త తరచూ మద్యం సేవించి వేధింపులకు గురిచేస్తున్నాడని భావించిన లావణ్య, అతన్ని హత్య చేయాలని నిర్ణయించింది.ఈ కుట్రలో భాగంగా తన తమ్ముడు పెండల రాజు, ప్రియుడు నరేశ్‌లతో కలిసి గోవిందరావుపేటకు చెందిన చిరంశెట్టి వెంకటేశ్వర్లును సంప్రదించి రూ.5 లక్షలకు సుపారి ఇచ్చారు. ముందుగా రూ.4.59 లక్షలు చెల్లించారు.ఏప్రిల్ 3న రాత్రి సుమన్ భరత్‌ను ములుగు ప్రాంతానికి మాయమాటలతో పిలిపించి, వ్యవసాయ పొలం వద్దకు తీసుకెళ్లి మద్యం తాగించారు. అతను మత్తులో ఉండగా వెంకటేశ్వర్లు బీర్ బాటిల్‌తో తలపై దాడి చేసి హత్య చేశాడు. అనంతరం పెట్రోల్ పోసి మృతదేహాన్ని తగులబెట్టారు. ఈ ఘటనను నిందితులు వీడియో కూడా తీశారు. తరువాతి రోజు లావణ్య, రాజు అక్కడికి వెళ్లగా వీడియోలు చూపించి మిగిలిన డబ్బు తీసుకున్నారు. అనుమానం రాకుండా లావణ్య



పరకాలకు తిరిగి వెళ్లింది. ఆపై నిందితులు మృతదేహ అవశేషాలను సంచిలో వేసి సమీప వాగులో పడేశారు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని సంఘటనా స్థలానికి తీసుకెళ్లగా, అక్కడి నుండి ఎముకల ముక్కలు, బూడిద, బీర్ బాటిల్ ముక్కలు తదితర ఆధారాలు స్వాధీనం చేసుకున్నారు. దయ్యాల వాగులో పడేసిన అవశేషాలను కూడా సీజ్ చేశారు. ఈ కేసులో మొత్తం ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు, వారి వద్ద నుండి ఆరు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై మరింత దర్యాప్తు కొనసాగుతోంది

## మహిళా సాధికారత కోసమే మా ప్రయత్నం

మొదటిపేజీ తరువాయి..

ఎంపీలు తమ అభిప్రాయాలు చెప్పారు. 56 మంది మహిళా ఎంపీలు మాట్లాడారు. మహిళా బిల్లును విపక్షాలు వ్యతిరేకించాయి. ప్రస్తుత లోక్‌సభ నియోజకవర్గాల జనాభాలో భారీ వ్యత్యాసం ఉంది. ఒకచోట 39లక్షల మంది ఓటర్లు ఉంటే మరోచోట 60 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఒక ఎంపీ లక్షలాది మంది సమస్యలను ఎలా ఆలకించగలరని ఈ సందర్భంగా ప్రస్తావించారు. నియోజకవర్గాల ఓటర్ల సంఖ్యలో సమతుల్యతను సాధించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఎంపీ తన నిధులు సమర్థంగా వినియోగించుకునేందుకు ఇది తోడ్పడుతుంది. అందుకే ఈ రాజ్యాంగ సవరణకు ఉపక్రమించామని అమిత్ షా పేర్కొన్నారు. మల్కాజ్‌గిరిలో దాదాపు 30లక్షల మందికిపైగా ఓటర్లు ఉండగా.. ఢిల్లీ, బెంగళూరు, గాజియాబాద్‌లో 20లక్షలకుపైగా ఓటర్లు ఉన్నారు. డీలిమిటేషన్ తర్వాత ఆయా చోట్ల రెండు సీట్లు వస్తాయి. దీనివల్ల సభ్యులకు, ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది.

1972లో ఇందిరా గాంధీ ప్రభుత్వం లోక్‌సభ సీట్లను 545కు పెంచింది. ఇన్నాళ్లపాటు సీట్లు సంఖ్య పెంచకుండా అడ్డుకున్న ఘనత వారిదే అని కాంగ్రెస్‌పై అమిత్ షా విరుచుకుపడ్డారు. కాలానికి అనుగుణంగా సీట్ల సంఖ్యలోనూ మార్పు రావాలని అన్నారు. ఉత్తరాది.. దక్షిణాది.. ఆ ప్రాంతం.. ఈ ప్రాంతం అంటూ విభజన రాజకీయాలు చేస్తున్నారు. దేశమంతా ఒక్కటే. ఉత్తర, దక్షిణ బేధాలు చూపి దేశాన్ని ముక్కలు చేస్తామంటే కుదరదు. దక్షిణమే కాదు.. కేంద్రపాలిత ప్రాంతాలకు సైతం దేశంపై అంతే అధికారం ఉంటుంది. ప్రాంతాలకు అతీతంగా ఈ సభలోని సభ్యులందరికీ సమాన అధికారం ఉంటుందని అమిత్ షా పేర్కొన్నారు. మహిళా బిల్లును, డీలిమిటేషన్ బిల్లును వేరు చేస్తారా? ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం 50శాతం పెంచుతారా? అని కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. దీనికి అమిత్ షా బదులిస్తూ.. 50శాతం పెంచుతూ సవరణ తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గంట సమయం ఇస్తే బిల్లులో సవరణలు చేసుకొని వస్తామని.. బిల్లుకు మద్దతిస్తారేమో చెప్పాలని అమిత్ షా స్పష్టం చేశారు. కూటమి లక్ష్యంగా ఘాటైన విమర్శలు చేశారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే చారిత్రాత్మక నిర్ణయాన్ని 'ఇండి' కూటమి సభ్యులు వ్యతిరేకించడం విచారకరమని అమిత్ షా అన్నారు.

## కాళేశ్వరంపై ఎలాంటి దురుద్దేశ్యం లేదు

మొదటిపేజీ తరువాయి..

గోదావరి వరదలు వచ్చేలోగా సాయిల్ టెస్టింగ్, డిజైన్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంపై కేసీఆర్ హయాంలో చేసిన పొరపాటు తెలంగాణ ప్రజలకు తెలుసునని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరాన్ని నిర్మించారని, అది కూలిపోయిందని అన్నారు. కాళేశ్వరంపై దాదాపు రూ. 97 వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఆ ప్రాజెక్టు నిర్మించారని తెలిపారు. కాళేశ్వరంపై ప్రతి ఏడాది రూ. 10వేల కోట్ల వడ్డీ కడుతున్నామని తెలిపారు. ప్రజాధనం ఉపయోగించడంతోనే దాన్ని ఎలా రిపేర్ చేయాలో ఆలోచించి ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు



అన్నీ విషయాలు గమనిస్తున్నారని అన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళు తున్నామని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ డ్యామేజ్ సాయిల్ టెస్ట్, డిజైన్ల ఖర్చులను కాంట్రాక్ట్ సంస్థలే భరిస్తాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్‌పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అనీ. పరిచిత్ మెహ్రా ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసింది. ఇంజినీర్లు, నిపుణులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. మూడు బ్యారేజీల మరమ్మతులకు సమన్వయ కమిటీ ఏర్పాటు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్ పనులు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రుతుపవనాలకు ముందే జియో టెక్నికల్ పరిశీలనలు పూర్తి చేయాలని తెలంగాణ సర్కార్ సూచించింది. మే 30వ తేదీలోగా పరిశీలనలు పూర్తిచేయాలని డెడ్‌లైన్ విధించింది. రోజువారీ పురోగతి నివేదికలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించింది. సీడబ్ల్యూసీ ఎన్డీఎస్ఏ అనుమతులతో పనులు, డిజైనింగ్ పునరుద్ధరణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. రోజువారీ యాక్షన్ ప్లాన్‌తో పనులు చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది.

## రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వం

మొదటిపేజీ తరువాయి..

ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వమే స్వయంగా నిర్వహించాలని లేదంటే.. ఒక కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని పేర్కొంది. రాహుల్ గాంధీ పౌరసత్వం అంశంపై కొన్నేళ్లుగా వివాదం నలుగుతూనే ఉంది. రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని, భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలంటూ భాజపా నేత సుబ్రహ్మణ్య స్వామి, కర్ణాటకకు చెందిన భాజపా కార్యకర్త విఘ్నేశ్ శిశిర్ డిమాండ్ చేస్తున్నారు. బ్రిటన్‌లో నమోదైన ఓ కంపెనీకి రాహుల్ గాంధీ డైరెక్టర్, సెక్రటరీగా ఉన్నారని సుబ్రహ్మణ్య స్వామి కొంతకాలంగా చెబుతున్నారు. ఆ కంపెనీ వార్షిక నివేదికలో తనను తాను బ్రిటిష్ పౌరుడిగా రాహుల్ గాంధీ పేర్కొన్నట్లు స్వామి తెలిపారు. వేరే దేశంలో పౌరుడిగా ఉన్న వ్యక్తి ఆ దేశ పౌరసత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవాల్సి ఉంటుందన్నారు. అలా చేయకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 9, భారతీయ పౌరసత్వ చట్టం, 1955ని ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. ఇదే అంశంపై గతంలో కేంద్రానికి కూడా లేఖ రాశారు. మరోవైపు, రాహుల్ గాంధీ పౌరసత్వానికి సంబంధించిన రికార్డులు ఉన్నాయని విఘ్నేశ్ చెబుతున్నారు. ఈ క్రమంలోనే న్యాయస్థానాలను ఆశ్రయించారు. పౌరసత్వానికి సంబంధించిన అంశాలపై నిర్ణయం తీసుకునే అధికారం తనకు లేదంటూ లఖ్‌నవూలోని ప్రత్యేక ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు గతంలో శిశిర్ పిటిషన్‌ను తోసిపుచ్చింది. దాంతో అతడు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలోనే తాజా ఆదేశాలు వెలువడ్డాయి.

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

మొదటిపేజీ తరువాయి..

కొండ ప్రాంతంలో ప్రయాణిస్తున్న ఓ వ్యాన్ అదుపుతప్పింది. వేగంగా వెళ్లి లోయలో పడిపోయింది. పైనుంచి కిందపడ్డంతో వ్యాన్ నుజ్జునుజ్జయింది. వ్యానులో ఉన్న పది మంది అక్కడికక్కడే చనిపోయారు. మరికొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ వారిని హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు 10 మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటకలోని యాదగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైవేపై వేగంగా దూసుకు వెళుతున్న కారు టైర్ పేలింది. ఒక్కసారిగా అదుపుతప్పిన కారు.. వేగంగా వెళ్లి బస్సును ఢీకొట్టింది.




Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967